ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 351 పేజీలు: 8+4 వెల: 6.50

ప్రకృతి సాగు చేద్దాం... భూమిని బాగు చేద్దాం: సిఎం 2లో

అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్లు: కేంద్రం 5లో

# భారీ పెట్టుబడుల ఒప్పందాలు




బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ అయిన దృశ్యం. చిత్రంలో మంత్రి లోకేష్ ఉన్నారు

### దావోస్‌లో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు భేటీ, కుదిరిన ఒప్పందాలు

### పి-4 విధానం ద్వారా పేదరికాన్ని తగ్గిస్తున్నాం

### రాష్ట్రంలో 10 లక్షల మందికి ఎఐ, క్వాంటం టెక్నాలజీలో శిక్షణ: ముఖ్యమంత్రి

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పని చేయడం తనకు అలవాటు అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ముందుచూపుతో వ్యవహరించి వినూత్నంగా ఆలోచించి చిత్తశుద్ధితో, కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యం అని నమ్ముతానని ఉద్ఘాటించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్‌లో మూడో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు ఇష్టాగోష్టిగా సంభాషించారు. ఎపిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది తన ఆలోచన అని సిఎం స్పష్టం చేశారు. ఎపి అమలు చేస్తున్న విధానాలను, >>2



బుధవారం ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న అసెంబ్లీ స్పీకర్ల 86వ అఖిల భారత మహాసభలో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

## చట్టసభలకు రాకపోతే నో వర్క్- నో పే!

### అమలు చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

### ప్రజా ప్రతినిధులను వెనక్కి పిలిచే హక్కు ప్రజలకు కల్పించాలి

### యుపిలో జరుగుతున్న స్పీకర్ల సదస్సులో పాల్గొన్న అయ్యన్న

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభకు సభకు హాజరుకాని వారికి 'నో వర్క్-నో పే' నిబంధన వర్తింపజేయాలని ఎపి శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేసారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే వారి వేతనాల్లో కోత వేసినట్టే, ప్రజాప్రతినిధుల జీత భత్యాల్లో సైతం కోతను విధించాలన్నారు. సక్రమంగా పనులు చేయక పోతే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను వెనక్కు పిలిపించే హక్కు కల్పించాలి. ఈ 'రైట్‌టురీకాల్' హక్కుతో ప్రజలే వారికి సరైన గుణ పాఠం నేర్పగలుగుతారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 2024 జూన్ లో ఎన్నికైనప్పటి నుంచి కొంత మంది శాసనసభ్యులు ఈనాటి వరకు ఒక్కరోజుకూడా సమావేశాలకు హాజరుకాలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగు >>2

## భూముల మార్కెట్ విలువ మళ్లీ పెంపు

### ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భూముల మార్కెట్ విలువలను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. సవరించిన భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ మెమో జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండోసారి భూముల మార్కెట్ విలువల పెంపు కావడం గమనార్హం. గత ఏడాది కొత్త జిల్లాలు, వాణిజ్య ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం 15 శాతం కంటే ఎక్కువగా పెంచింది భూముల మార్కెట్ విలువలు పెరగడం వల్ల ప్రభుత్వానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ద్వారా రూ.13,150 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు ఇది కీలక >>2

బడ్జెట్ సమావేశాల్లో అమరావతికి చట్టబద్ధత! 2లో

యేడాదిన్నర తర్వాత పాదయాత్ర చేస్తా: జగన్ 3లో



బుధవారం ఆరేపల్లి రంగంపేటలో పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనం

## పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనం

### రంగంపేటలో అంబరాన్నంటిన జల్లికట్టు సంబరాలు

**చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త:** పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనంతో ఆరేపల్లి రంగంపేట కిటకిటలాడింది. ఆరేపల్లి రంగంపేటలో కనుమ రోజున జరుపుకునే జల్లికట్టు సంబరాలను అనివార్య కారణలతో వాయిదా వేశారు. ఇందులో భాగంగా బుధవారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఆరేపల్లి రంగంపేటలో జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన చెక్క పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువత పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు రైతులు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఒక చెక్కతో అందంగా మలచబడిన పట్టీని పాడిరైతు తన ఎద్దు కొమ్ములకు కట్టి జనంలోకి వదలిపెడతాడు. తన ఎద్దు కొమ్ములకు కట్టిన పట్టీని గెలుచుకున్న యువత పౌరుషానికి ప్రతీకగా భావిస్తారు. జల్లికట్టు సంబరాలలో తమ పౌరుషాన్ని ధీటుగా ప్రదర్శించేందుకు యువత సైతం రెట్టించిన ఉత్సాహంతో పోటెత్తిన పోట్లగిత్త_లను నిలువరించి పట్టీని సొంతంచేసుకునేందుకే బరితెగించి యుద్ధమే చేశారు. ఈ సాహస కృత్యంలో పలువురు పల్టీలు కొట్టి గాయాలపాలయ్యారు. ఈ జల్లికట్టు సంబరాలను తిలకించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాధి మంది చేరుకోవడంతో ఏ.రంగంపేట జనసంద్రమయ్యింది. జల్లికట్టు సంబరాలకు ప్రత్యేక స్థాన ం కలిగివుండటంతో సంబరాలకు ప్రారంభానికి ముందు చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని సందడి చేశారు. ఎంఎల్ఏ రాకతో పార్టీ నాయకులు, అభిమానులు అపూర్వ స్వాగతం పలుకుతూ హోరెత్తిన కేరింతల నడుమ తమ అభిమాన నాయకుడిని భుజాలకెత్తుకుని మోసుకుంటూ గ్రామవీధులలో ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం జల్లికట్టు సంబరాలను అట్టహాసంగా ప్రారంభించారు.




Visakhapatnam: Varun Motor - Siripuram: 9966739777, Pendurthi: 7799224440 Gajuwaka: 7799122258, Muralinagar: 9052267733 | Jayabheri Automotives Maddilapalem : 8008333557, Gopalapatnam :7780636899 | Srikakulam: Varun Motor : 8886521999 | Vizianagaram: Jayabheri Automotives : 8886662205 | Rajahmundry: SB Motor(Auto nagar) : 9885173738 | Varun Motors(Hukumpeta) : 8886616717 | Kakinada: SB Motor : 8886661920.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.



బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్

# అమరావతిలో ఆర్టిఫిషియల్ వర్సిటీ

## దావోస్ సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించటంతో పాటు యువతకు నైపుణ్యశిక్షణ, ఉపాధి అవకాశాలను అందిస్తూ ఎఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేలా ఏపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్టు కాలిస్టా రెడ్మెండ్ ముఖ్యమంత్రికి తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఆర్టిఫిషియల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్యా చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్టు ఎన్విడియా ఉపాధ్యక్షురాలు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు హార్డ్ వేర్ తయారీ యూనిట్ ఏర్పాటు, సహా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం వహించే అంశంపై ఎన్విడియా ఆసక్తి కనపరిచింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు హార్డ్ వేర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఎన్విడియా ఆసక్తి కనపరిచింది. దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఎఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో సిఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో స్టార్టప్ లను ప్రోత్సహించటంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందిస్తూ ఎఐ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేలా ఏపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్టు కాలిస్టా తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఆర్టిఫిషియల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్టు ఎన్విడియా ఉపాధ్యక్షురాలుకాలిస్టా రెడ్మెండ్ వివరించారు.

**సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతి**

అమరావతిని సైబర్ సెక్యూరిటీ నగరంగా తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం అందించాలని ఇజ్రాయెల్ ప్రతినిధులను సిఎం చంద్రబాబు కోరారు. దావోస్‌లో సిఎం చంద్రబాబుతో ఇజ్రాయెల్ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ట్రేడ్ మిషన్ ప్రతినిధి ఓర్ష్ స్టెష్ట్ సమావేశం అయ్యారు. విశాఖ చెన్నై కారిడార్‌లో యుఎవి డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ సాంకేతికతపై ఇజ్రాయెల్ దేశ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికతపై సహకారం అందించే అంశంపై చర్చ జరిగింది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు సెమీకండక్టర్ల తయారీతో పాటు జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల లాగే ఇజ్రాయెల్ కూడా ఓ పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. కట్టుదిట్టమైన సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించే అంశంపైనా ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగాయి. మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల రూపకల్పనపై చర్చించామని వివరించారు సిఎం చంద్రబాబు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన సహా ఏపిని మెడ్ టెక్, ఏరో డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యం దిశగా అడుగులు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక తయారీకి ఇజ్రాయెల్ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రణాళికలపై సైతం ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించామని చంద్రబాబు తెలిపారు.

# పెట్టుబడుల ఒప్పందాలు

>> వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఏపి గురించి చర్చించుకుంటోందన్నారు. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత దేశానికి లేదని వ్యాఖ్యానించారు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారతదేశ అదనపు బలమని ధీమా వ్యక్తం చేశారు.

పరిశ్రమలకు వేగంగా అనుమతులివ్వడంతోపాటు, ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపి అభివృద్ధిలో గొప్ప ముందడుగు అని గుర్తు చేశారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించామని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తికి అడుగులు వేసి, పరిశ్రమ నిర్మిస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు వివరించారు. 30 ఏళ్ల క్రితం దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయని చంద్రబాబు, ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నామన్నారు. అభివృద్ధిలో అందర్నీ భాగస్వాములను చేసే ఉద్దేశ్యంతోనే వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ విధానం తెచ్చామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ విధానాన్ని తెచ్చి ఏపి ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి చొరవ తీసుకుంటున్నదని చర్చా వేదికలో పాల్గొన్న ప్రతినిధులు కితాబిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి సాధించేలా ఆదర్శవంతంగా ఉండేలా విధానాన్ని తీర్చిదిద్దారని చంద్రబాబును ప్రశంసించారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలకు, ఒన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునే వారికి గైడెన్స్ ఇస్తున్నని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ఇన్నాను సిద్ధం చేస్తున్నామన్నారు. వినూత్న ఆలోచనలతో ఉన్న వారిని ప్రోత్సహించేందుకు పి4 అనే వ్యవస్థను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పి4 విధానం ద్వారా పేదరికాన్ని తగ్గించడంతోపాటు కొత్త ఆలోచనలు ఉన్న వారికి చేయూత ఇచ్చే విధంగా కూడా వ్యవస్థను తీర్చిదిద్దామన్నారు. ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా పారిశ్రామికాభివృద్ధిని ప్రమోట్ చేస్తున్నామని వివరించారు. టైమ్ మీడియా ప్రతినిధి టిమ్ హోవాల్, బ్లూమ్‌బర్గ్ ప్రతినిధి జీనెత్ రోడ్రిగ్స్, బిజినెస్ టుడే ప్రతినిధి ఆలోక్ నాయర్, ఎన్డీటీవీ నుంచి ఆయుష్ ఐలావాదిలతో ఇష్టాగోష్ఠిలో సీఎం పాల్గొన్నారు.

**సిఎం చంద్రబాబుతో ఆర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ**

ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ అయ్యారు. అనకాపల్లి జిల్లాలో నిర్మించనున్న ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ పురోగతిపై చర్చించారు. తొలి దశలోనే దాదాపు రూ. 60 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ దశల్లో ఉన్న అనుమతులపై లక్ష్మీ మిట్టల్ సమక్షంలో అధికారులతో సిఎం సమీక్షించారు. ఫిబ్రవరి 15లోగా అనుమతులు, భూసేకరణ అంశాలు పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి 15 తరవాత అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి




బుధవారం దావోస్‌లో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన తమరా లీజర్ సిఇఒ సృష్టి శిబులాల్

చేసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని సిఎం కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతులు, ఇతర సహకారం విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని స్పష్టం చేసారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి త్వరితగతిన అవసరమైన అన్ని అనుమతుల సాధించాలని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లకు సిఎం సూచించారు. ప్లాంట్ నిర్మాణం విషయంలో మంత్రి లోకేష్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆదిత్య మిట్టల్ అన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు గురించి లక్ష్మీ మిట్టల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. మంత్రులు లోకేష్, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

**సిఎం చంద్రబాబుతో తమారా లీజర్ సిఇఒ భేటీ**

ఆంధ్రప్రదేశ్‌లో ఆతిథ్య రంగంలో పెట్టుబడులపై తమారా సంస్థ ప్రతినిధులు సిఎంతో చర్చించారు. ఏపీలో హోటల్ రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి విశ్లేషించారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని వివరించారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి నదీ తీరంలో అద్భుతమైన టూరిజం కేంద్రాలు అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందని సిఎం తెలిపారు. కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి లాంటి మంచి పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులు ప్రారంభించే అంశాలపై సిఎం చర్చించారు.

ప్రస్తుతం ప్రతీ పర్యాటక ప్రాంతానికీ రోడ్లు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పుడు ఎపి అన్ లాక్ అని తమారా లీజర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి తెలిపారు. టూరిజం ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని ఉపాధి కల్పిస్తుం దని తెలిపారు. ఉత్తరాంధ్రనుంచి రాయలసీమ వరకూ ప్రతీ జిల్లాలలోనూ పర్యాటక కేంద్రాలున్నాయని స్పష్టం చేసారు. హోటల్ రంగానికి మేం ప్రోత్సాహం ఇస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ఎపిలో ప్రాజెక్టులు పెట్టేందుకు ప్రతిపాదనలతో వస్తే సహకరిస్తామని సిఎం స్పష్టం చేసారు. గిరిజన ప్రాంతాల్లోనూ ఎకోటూరిజం పార్కులు ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని తమారా లీజర్ సంస్థ తెలిపింది. విశాఖ సహా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు కూడా ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడించింది.

# మార్కెట్ విలువ మళ్లీ పెంపు

>> ఆదాయ వనరుగా మారనుందని విశ్లేషకులు చెబుతు న్నారు. ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. దీంతో భూముల కొనుగోలు-విక్రయాల సమయంలో ఎక్కువ స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, దీర్ఘకాలంలో భూముల ధరలు పెరగడం వల్ల ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఈ నిర్ణయం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొంటున్నారు.

# ప్రకృతి సాగు చేద్దాం... భూమిని బాగు చేద్దాం

## ప్రపంచానికి నమూనాగా ఎపిలో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నాం

## ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి సాధ్యమే

## ప్రకృతి సేద్యం-ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తిపై ప్రపంచ ఆర్థిక సదస్సు రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి సాగు చేయాలని... భూమిని బాగు చేసేలా వ్యవసాయం, ఆహార ఉత్పత్తులను పండించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తులపై హైలెవల్ మీటింగ్... అలాగే రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు ఎపిలో ప్రకృతి సేద్యానికి తీసుకుంటోన్న చర్యలను వివరించారు. అలాగే గ్లోబల్ మార్కెట్లో నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్స్‌కు ఉన్న డిమాండుకు తగ్గట్టు రాష్ట్రం ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలను సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రకృతి ఆధారిత వ్యవసాయం చేసేందుకు పూర్తి స్థాయి సన్నద్ధంగా ఉంది. ప్రకృతి సేద్యం అనేది కేవలం ఒక వ్యవసాయ పద్ధతి మాత్రమే కాదు, వాతావరణ మార్పులను ఎదుర్కొనే ఒక శక్తివంతమైన ఆయుధం. రాష్ట్రంలో ఇప్పటికే 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ఎటువంటి ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ప్రకృతి సేద్యానికి సంబంధించి ప్రపంచానికే ఎపిని ఓ నమూనాగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఎరువుల వినియోగం.. రసాయనాల వినియోగంతో చేసే వ్యవసాయంతో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. రైతులకు మొదటి సంవత్సరం నుంచే అధిక నికర ఆదాయం లభిస్తోంది... రైతులు బలోపేతం కావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

**పర్యావరణానికి మేలు చేసేలా... గ్లోబల్ మార్కెట్టుకు తగ్గట్టుగా..**

"ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిలో కార్బన్ నిల్వ సామర్థం పెరుగుతుంది... అలాగే పర్యావరణానికి మేలు జరుగుతుంది. అలాగే నీటి వినియోగం తగ్గడంతో పాటు బయోడైవర్సిటీ పెరిగేలా చూసుకోవచ్చు. అలాగే భూసారం తగ్గకుండా భూమిని మరింత బలంగా పోషకాలు ఉండేలా చేసుకోవచ్చు. ఫార్మర్ టు ఫార్మర్ అనే పద్ధతిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి గ్రామానికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రకృతి సేద్యంలో అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు శిక్షణ ఇచ్చేలా వ్యవస్థను రూపొందించాం. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్లలో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి వీలుగా సరైన మార్కెటింగ్ వ్యవస్థను, సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. టెక్నాలజీని ఉపయోగించి రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. అయితే ప్రకృతి సాగును ప్రోత్సహించేందుకు మెరుగైన పారిశ్రామిక పద్ధతులు, ఆర్థిక ప్రోత్సాహకాలు అవసరం. వ్యాపార సంస్థలు తమ ఆర్థిక లాభాల పరంగానే కాకుండా... పర్యావరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్టులో ఉన్న డిమాండ్ ను అంచనా వేసుకుంటూ అంతర్జాతీయంగా రాష్ట్ర ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా భారీ ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ఓ పెద్ద బిజినెస్ ఆపర్చునిటీగా నిరూపించే దిశగా ఎపిలోని రైతులను సిద్ధం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### వారం - వర్జ్యం

22-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం,ఉత్తరాషాఢ కార్తె
చవితి రా.2.27
శతభిష మ.2.24,
వర్జ్యం : సా.6.39-7.43
దు.ఉ.10.26-11.11,
2) మ.2.58-3.43
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**వృషభం:** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు.

**మిథునం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఉద్యోగపరముగా రావలసిన సౌకర్యాలు ఇబ్బందులకు గురిచేస్తాయి.

**కర్కాటకం:** డాక్యుమెంట్లు, ముద్రణాపరమైన రాయిబాకీలు, భూమి, స్థిరాస్తుల సంబంధితమైన విషయాలు నిదానంగా సాగుతాయి.

**సింహం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులను దూరంగా ఉంచండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది.

**కన్య :** కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకోని సర్దుకుపోవటం మంచిది.

**తుల :** ఓర్పు నేర్పులు మేలుచేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. ధనలాభం.

**వృశ్చికం:** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి.

**ధనుస్సు:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. ఇతరుల విషయంలో జోక్యం వద్దు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** బంధువుల నుండి మాట సహాయం పొందుతారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి.

**మీనం:** ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బడ్జెట్ సమావేశాల్లో అమరావతికి చట్టబద్ధత!

## పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధం

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధతకు కేంద్రం సన్నద్ధమవుతుంది. విభజన చట్టాల అనంతర పరిణమాలు, నిర్ణయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఎపిలో ఇప్పటికే దగ్గర,దగ్గర దశాబ్ద కాలం నుంచి అమరావతి రాజధానిగా ఉంది. దేశ మ్యాప్‌లో సైతం అమరావతిని ఎపి రాజధానిగా సూచించారు.అయితే సాంకేతిక అంశాల కారణంగా అమరావతి రాజధాని చట్టబద్దతకు అనుమతి రాలేదు. ఎపి తాజా కేంద్రమంత్రి మండలిలో ఈ అంశంపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.కేబినెట్ ఆమోదం తర్వాత పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. ఎపి విభజన చట్టం పార్ట్2 కింద 5(1) నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది. పార్ట్2 కింద 5(2) సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది.

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు. పార్ట్ 25(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు. వాస్తవానికి 10 ఏళ్లపాటు 2 రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ గడువు 2024 జూన్ 2తో ముగిసింది. రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, నిర్మాణాలపై కేంద్రానికి నోట్ అందజేసింది. ఏ తేదీ నుంచి రాజధానిగా ప్రకటించాలో కేంద్ర హోంశాఖ చెప్పాలంది.

2024 జూన్ 2 నుంచే రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. సంబంధిత కేంద్ర శాఖల నుంచి హోంశాఖ అభిప్రాయాలు కోరడంతో పలు మంత్రిత్వ శాఖలు ఇప్పటికే తమ అభిప్రాయాలు వ్యక్తపరిచాయి. పట్టణాభివృద్ధి, న్యాయ శాఖలు ఇంకా అభిప్రాయాలు చెప్పాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చించి ఆమోదించనున్నట్లు తెలిసింది.

ఈ మేరకు కేబినెట్ నోట్ తయారీలో హోంశాఖ నిమగ్నమైనట్లు అధికారులు వెల్లడించారు. రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నది. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఒయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ సహా ఎన్నో కంపెనీలు రానున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండో విడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరిస్తున్నారు.

# రూఫ్‌టాప్ సౌరవ్యవస్థల అమలు వేగవంతం చేయాలి

## మే నెలాఖరుకు 2లక్షల సౌరవిద్యుత్ కనెక్షన్లు పూర్తికావాలి

## ఎస్పీడిసిఎల్‌కు రాష్ట్ర సిఎస్ విజయానంద్ ఆదేశం

**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్‌వినియోగాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ కె.విజయానంద్ ఎస్పీడి సిఎల్ అధికారులను ఆదేశించారు. రానున్న మేనెలాఖరుకు రాష్ట్రంలో 2లక్షల సౌరవిద్యుత్ కనెక్షన్లు పూర్తికావాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా పిఎం సూర్యఘర్,ముఫ్త్‌బిజ్లీ యోజనను సమర్థవంతంగా అమలుచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సిఎండి శివశంకర్‌లో తేటి, నెడ్కాప్ ఎండి ఎం.కమలాకర్‌బాబు, ఎస్పీడిసిఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, తొమ్మిదిజిల్లాల ఎస్పీడిసిఎల్ సంస్థ ఎస్ఇలతో సౌరవిద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. ఫీడర్ సోలరైజేషన్, రూఫ్‌టాఫ్ సౌర ప్రాజెక్టుల అమలును క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించి నాణ్యతతో దీర్ఘకాలిక పనితీరును నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది మార్చినెలాఖరుకు 1.50లక్షల రూఫ్‌టాప్ సౌర కనెక్షన్లు పూర్తిచేయాలని, మేనెలాఖరుకు 2లక్షలు కనెక్షన్లు లక్ష్యంగా తీసుకుని పనిచేయాలన్నారు. నిర్ణీత సమయంలో లక్ష్యం పూర్తిచేయడానికి అధికారుల పర్యవేక్షణ ఉండాలని నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్ట్‌లు,రూఫ్‌టాఫ్ సౌరవ్యవస్థలు, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌళిక సదుపాయాల అమలును నిర్ధిష్ట కాలపరిమితితో వేగవంతంచేయాలని ఎస్పీడిసిఎల్, నెడ్కాప్ ఎండిలను ఆదేశించారు. భూసేకరణ, లీజ్‌రిజిస్ట్రేషన్లు,శాఖల మధ్య అనుమతులు ప్రాజెక్టుల అమలును పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని పిఎంసూర్యఘర్, ముఫ్త్‌బిజ్లీ యోజన



బుధవారం తిరుపతిలో సౌరవిద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎస్ విజయానంద్

క్రింద అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలన్నారు.ఫిబ్రవరి రెండోవారంలో జరగనున్న కలెక్టర్ల సమావేశంలో ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షిస్తామన్నారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా వెంటనే మీటరింగ్ పూర్తిచేయాలని సిఎస్ దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు జరిగినా సంబంధిత డిఇలు,ఎడిఇలు వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని, వినియోగదారుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజయానంద్ హెచ్చరించారు. పిఎం కుసుం క్రింద రాష్ట్రవ్యాప్తంగా 1,162.80 మెగావాట్ల సామర్థ్యంతో ఫీడర్ సోలరైజేషన్ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, సుమారు 2.93లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. యూనిట్‌కు సగటున 3.09 రూపాయల టారిఫ్‌తో ఆమోదించబడిందని ఎస్పీడిసిఎల్ అధికారులు సిఎస్ విజయానంద్ దృష్టికి తీసుకువచ్చారు. 2.07లక్షల కుటుంబాలు ఎస్సీ,ఎస్టీలు ఉండగా 415.67 మెగావాట్స్‌పవర్ సామర్థ్యంతో రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్ వ్యవస్థలు అమర్చామని వివరించారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకానికి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

# చట్టసభలకు రాకపోతే నో వర్క్ - నో పే!

>> తున్న చట్టసభల సభాపతుల 86వ అఖిల భారత మహాసభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలపట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అన్న అంశంపై అయ్యన్న ప్రసంగించారు. చట్టసభల్లో కొద్ది మంది శాసనసభ్యులు ఒక్క చర్చలో కూడా పాల్గొనలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అది చాలదన్నట్టు, సభకు అస్సలు హాజరుకాని సభ్యుల్లో ఎక్కువ మంది క్రమం తప్పకుండా వేతనాలు, భత్యాలు మాత్రం తీసుకుంటున్నారని వివరించారు. ఈ విషయం ఒక సభాపతిగా తనకు ఎంతో వేదన కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఎలా ఉండగలుగుతాం అన్నారు. ఈ రకమైన అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని అయ్యన్న ప్రశ్నించారు. ఈ రకమైన వ్యవహార శైలిని నిషేధించే నిబంధనలేవీ లేకపోవడంతో మాకొక మార్గం చూపించాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. దీనికోసం సహ సభాపతుల సలహాలను సైతం కోరుతున్నానని అయ్యన్న పాత్రుడు అన్నారు. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థకు సంబంధించిన సమస్య కాదనీ, ప్రజలు ఇలాంటి ఉదాహరణలు చూపించి ప్రజాప్రతినిధులందరినీ ఒకే కోవలోకి తీసుకువస్తారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే విమర్శలు ఎవరికీ మినహాయింపు కాదని స్పీకర్ పేర్కొన్నారు.

ఈ విషయంలో తన వైపు నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రెండు సూచనలను చేశారు. ఒకటి సభకు హాజరుకాని వారికి 'నో వర్క్ - నో పే' నిబంధన వర్తింపజేయటమన్నారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకపోతే వారి వేతనాల్లో కోత వేసినట్టే, ప్రజాప్రతినిధుల జీత భత్యాల్లో సైతం కోతను విధించాలని ఈ సందర్భంగా సూచించారు. అప్పటికీ గుణపాఠం నేర్చుకోని ప్రజాప్రతినిధుల కోసం మరో అడుగు ముందుకు వేయాలన్నారు. వారిని మళ్లీ ప్రజా కోర్టులో నిలబెట్టడం తప్ప మరో మార్గం లేదని వెల్లడించారు.

**ప్రజలే సరైన గుణ పాఠం చెప్పాలి:**

దీనికి అవసరమైతే రాజ్యాంగాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించి అయినా సరే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను వెనక్కు పిలిపించే హక్కు కల్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఈ 'రైట్‌టురీకాల్' హక్కుతో ప్రజలే వారికి సరైన గుణ పాఠం నేర్పగలుగుతారని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులకు ఈ అధికారాలు, బాధ్యతలు ప్రజల నుంచి నేరుగా సంక్రమిస్తుండటంతో శాసన వ్యవస్థకు రాజ్యాంగంలో కీలకపాత్ర కట్టబెట్టారన్నారు.

ఇంత గురుతరమైన బాధ్యతలు, అధికారాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధుల పట్ల ప్రజల్లో నమ్మకం నానాటికీ సన్నగిల్లుతోందని అయ్యన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మనం సైతం ఓ సారి ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. అప్పుడే, విధి నిర్వహణలో ప్రజల మెప్పు పొందగలుగుతామని వెల్లడించారు. ప్రజలు మనల్ని చిన్న చూపు చూసేలా తప్పిదాలు చేయకూడదని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మరింత శ్రమించి, నిజాయితీగా, చిత్త శుద్ధితో, నిరంతరం పనిచేస్తూనే ఉండాలని తెలియజేశారు.

**కనీసం 60 రోజులైనా చట్ట సభలు జరగాలి,**

ప్రజల సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ, దురదృష్టవశాత్తు చట్ట సభల పనిదినాలు మాత్రం ఏటికాయేడు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఇది శాసన వ్యవస్థ అనారోగ్యానికి సూచిక అని స్పీకర్ అయ్యన్న వెల్లడించారు. ఏడాదికి కనీసం 60 రోజులైనా చట్ట సభలు పనిచేయాలని అభిప్రాయపడ్డారు. సభ తరచూ సమావేశమైతేనే సభ్యులు, ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, స్వల్ప వ్యవధి ప్రశ్నలు, సావధాన తీర్మానాలు ఇలాంటి పలు సాధనాలతో ప్రభుత్వాన్ని నిలదీయగలుగుతారని గుర్తు చేశారు.

అంతేకాకుండా తద్వారా ప్రజలకు జవాబుదారీగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. కమిటీలు కూడా తరచుగా చురుగ్గా సమావేశాలు జరపాలని సూచించారు. అప్పుడే, శాసనసభ ప్రాముఖ్యత, దాని ప్రయోజనం అందరికీ తెలుస్తుందన్నారు. శాసనసభ్యులు తమ విధులను ఏ మాత్రం నిర్వర్తించకపోవడం విచారకరమైన విషయం అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు విన్నవించారు.

# కొత్త సాంకేతిక విజ్ఞానంతో కార్యాచరణ

## - దావోస్‌లో సిఎం చంద్రబాబుతో స్విట్జర్లాండ్ ప్రతినిధి బృందం భేటీ



దావోస్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో స్విట్జర్లాండ్ దేశ ప్రతినిధి బృందం భేటి దృశ్యం

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అభివృద్ది రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.నూతన ఆవిష్కరణలను గమనిస్తూ వాటిని అధ్యయనం చేసి రాష్ట్రంలో కార్యచరణ చేపడతామన్నారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందన్నారు.దావోస్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో స్విట్జర్లాండ్ దేశ ప్రతినిధి బృందం భేటి అయ్యింది. ఆ దేశ ఆర్ధిక వ్యవహారాల కార్యదర్శి హెలెనే బడ్లిగర్ అర్టీడా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి అంబాసిడర్ ఆండ్రియా రౌబర్, స్విస్ పార్లమెంటు సభ్యుడు నిక్ గుగ్గర్, సీకో సలహాదారు మార్టీనా బైటెన్వాదర్ లు ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. ఏపీ స్విట్జర్లాండ్ మధ్య వివిధ రంగాల్లో వాణిజ్య సంబంధాలు, ఏపీలో స్విస్ కంపెనీల ఆపరేషన్లు, కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై చర్చ చర్చించారు. సాంకేతికతతో పాటు వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ రాష్ట్రంలో ఎప్పటికప్పుడు పాలసీలను రూపొందిస్తున్నట్లు వివరించారు. పరిశ్రమలు పెట్టాలనుకునే వారికి ఈ పాలసీలు ఎంతో అనుకూలంగా ఉంటాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చే ప్రపంచ స్థాయి పారిశ్రామిక వేత్తలు, నిపుణులతో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నానన్నారు. ఆలోచనలను పంచుకోవడంలూ తెలుగు ప్రజలు ముందుంటారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ సేవలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దావోస్ వచ్చిన ప్రతిసారీ తాను కొత్త అంశాలను నేర్చుకుంటున్నాన్నారు. ఇక్కడకు వచ్చే 2047 నాటికి భారత్ ప్రపంచశక్తిగాఎదుగుతుందని, ఆ గ్రోత్ స్టోరీని ప్రతి ఒక్కరూ చూస్తారన్నారు. పెట్టుబడులకు భారత్, ఆంధ్రప్రదేశ్ అతు త్యమ గమ్యస్థానాలుగా చంద్రబాబు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు కూడా పాల్గోన్నారు. వారినుద్ధేశించి అందరం కలిసి టీమ్ ఇండియాగా పనిచేద్దాం అని బాబు అన్నారు.

## విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పండి: మంత్రి లోకేష్




ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్‌తో లోకేష్‌భేటీ

విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పాలని ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్ ను రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అల్గోరిథమ్, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని కోరారు. ఫిన్‌టెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడం, రాష్ట్ర ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎకో సిస్టమ్ ను బలోపేతం చేయడానికి లీడ్ మెంటర్‌గా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మొట్టమొదటిగా మల్టిపుల్ డెలివరీ ఛానెళ్ల ద్వారా పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో సహకరించాలని లోకేశ్ కోరారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని నిఖిల్ కామత్ తెలిపారు.

# రాయలసీమకు నీటిని సాధించుకునేందుకు ఉద్యమం

## - రాయలసీమ ఎత్తిపోతల సాధన సమితి



**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ ప్రజల జీవితాల్లో నీరు ఒకసమస్య మాత్రమే కాదని, అది ఒక పోరాటమని, న్యాయబద్దంగా రావాల్సిన నీటికోసం ఉద్యమాలు తప్పదని రాయలసీమ ఎత్తిపోతల సాధనసమితి నిర్ణయించింది. ఈ మేరకు నీటికోసం రాబోయే రోజుల్లో ఉద్యమాల ద్వారానే సాధించుకోగలమని తీర్మానించారు. బుధవారం తిరుపతిలో రాయలసీమ ఎత్తిపోతల సాధనసమితి నాయకులు ,మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ఆచార్యభూమన్, కందారపు మురళి, ఎంపి డాక్టర్ గురు మూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నగరమేయర్ డాక్టర్ శిరీష, రాజారెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, నాగరాజు, నీలంబాలాజీ, డిఎంసి భాస్కర్, ఆదం ,ఉదయ్‌వంశీ తదితరులు సమావేశమయ్యారు. సుదీర్ఘంగా పలు అంశాలపై చర్చించి కీలక తీర్మానాలు చేశారు.రాయలసీమ ఎత్తిపోతల పథక సాధనకోసం రాయలసీమ ఎత్తిపోతల సాధన సమితిని ఏర్పాటు చేసి తద్వారా రాయలసీమ అవసరాలకోసం హక్కుగా రావా ల్సిన నీటిని సాధించుకోవాలన్నారు. ఇందుకు అవసరమైతే ఉద్యమం చేయాలని నిర్ణయించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, భవిష్యత్తు విధానాలపై సార్ధకమైన చర్చ సాగించాలని, నీటికోసం గతంలో జరిగిన ఉద్యమాన్ని గుర్తుచేసుకుంటే న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు.

## మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

### - బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ

**విజయవాడ,జనవరి21, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం(సుప్రీం కోర్టు) నిరాకరించింది. దీని కోసం ట్రయల్‌కోర్టుకు వెళ్లాలని సీజేఐ ధర్మాసనం సూచిస్తూ 4 వారాల గడువు ఇచ్చింది. నిందితులు ముగ్గురూ ఇప్పటికే డిఫాల్ట్ బెయిల్‌పై ఉన్నట్లు ప్రభుత్వ న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దీంతో డిఫాల్ట్ బెయిల్‌ను రెగ్యులర్ బెయిల్‌గా మార్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నిబంధనలు అనుసరించాల్సి ఒదేనని స్పష్టం చేసింది. దీంతో ముగ్గురు నిందితులు దాఖలు చేసిన మూడు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# అలిపిరి వద్ద బేస్‌క్యాంపునకు శ్రీకారం!

## - శ్రీవారి భక్తుల కోసం వసతి సౌకర్యం, దర్శన కౌంటర్లు ఏర్పాటు



**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా తిరుపతి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి సిద్దమైంది. సుమారు 15హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు.ఇందుకు అన్ని సమకూర్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, అధికారులు కూడా ముందుకు కదులుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. కొండపై 50వేలమంది భక్తులు రద్దీ పెరిగితే వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు నిండిపోయి వెలుపలకు క్యూలైన్లు విస్తరిస్తున్నాయి. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 20గంటల నుండి 30గంటల సమయం పడుతోంది. దీంతో రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటోంది. భక్తులు తిరుమలకు చేరుకుంటే వీలైనంత వరకు త్వరగా నాలుగైదు గంటల్లోనే దేవుని దర్శనం చేయించేలా కృత్రిమమేధ(ఏఐ)ఆధారిత సేవలను ప్రారంభించాలని ఆలోచన ఉంది. ఇదే సమయంలో తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌళిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. సాదారణరోజుల్లోనే తిరుమలకు 80వేలమంది నుండి 90వేలమంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. ఇక వారాంతం,ప్రత్యేక పర్వదినాల్లో,విశేషమైన ఉత్సవాల రోజుల్లో 1.50లక్షలమంది వరకు కూడా భక్తులు తిరుమలకు వస్తున్నారు. గత ఏడాది కాలంలో తిరుమలలో విజన్ 2047కి శ్రీకారంచుట్టేలా పనులు చేపట్టేందుకు ప్రస్తుత టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. అలిపిరిపాతచెక్‌పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకునిగానీ, దేవలోక్‌ప్రాంతంలోగానీ బేస్‌క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది.

**-బేస్‌క్యాంపుతోనే యాత్రికులకు సకల సేవలు:**

ఇప్పటికే అలిపిరి వద్ద ఇందుకోసం స్థలాన్ని కూడా టిటిడి పరిశీలించింది. ప్రస్తుతం తిరుమలలో 7,790 గదులు, వెయ్యికిపైగా మఠాల్లోని గదులు, మూడు యాత్రికుల వసతి సముదాయాల్లో 7వేల వరకు లాకర్లు సదుపాయం ఉన్నాయి. వీటన్నిటిలో 40వేలమంది నుండి 50వేలమంది వరకు భక్తులకు వసతి పొందుతున్నారు.ఆపై భక్తులు కొండకు చేరుకున్నా ఆరుబయట, ఖాళీస్థలాల్లో, ఉద్యానవనాల్లో విశ్రాంతి తీసుకోవడం, తలదాచుకోవడం కనిపిస్తుంది. సామాన్యభక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.

## యువకుని దారుణ హత్య

### - భార్య, బావమరిది కలసి హత్య చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు

**పెద్దారవీడు(మార్కాపురం), ప్రభాతవార్త** ఓ యువకుడు దారుణ హత్య గురైన సంఘటన పెద్దారవీడు సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథన ప్రకారం మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల పట్టణానికి చెందిన అడపాల లాలు శ్రీను (37)ఈ హత్య గురయ్యాడు. గంజాయి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న లాలు శీను బెయిల్ పై విడుదలైన లాలు శ్రీను ఒంగోలు నుంచి స్వగ్రామైన పెద్దదోర్నాలకు వెళ్తుండగా పెద్దారవీడు సమీపంలో ఈ ఘటన జరిగింది. భార్య, బావుమర్ది లు కలిసి ప్రత్యేక కారులో ఒంగోలు నుంచి లాలు శ్రీనును దోర్నాలకు తీసుకెళ్తుండగా ఈ హత్య జరిగింది. లాలు శ్రీను ముఖంపై కారం చల్లి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. పెద్ద దోర్నాల పట్టణానికి చెందిన అడపాల లాలు శీను(37) టీ కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లాలు శీను మద్యం, జూదానికి వ్యసనపరుడుగా మారిపోయాడు. గంజాయి కేసులో లాలు శీను పై పెద్ద దోర్నాల పోలీస్ స్టేషన్ లో గత సంవత్సరం నవంబర్ లో కేసు నమోదయింది. ఈ కేసులో ఒంగోలు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లాలు శ్రీను కు వారం రోజుల క్రితం బెయిల్ వచ్చింది. భార్య ఝాన్సీ, బావుమర్ది అశోక్ బుధవారం ఉదయం ఒంగోలు వెళ్లి శీనును ప్రత్యేక వాహనంలో దోర్నాలకు తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

ఒంగోలు నుంచి కారు లో వస్తున్న శీను ను పెద్దారవీడు సమీపంలోని రోడ్డు పక్కలో లాలు శ్రీను పై కారం చల్లి కత్తితో పొడిచి బుధవారం రాత్రి 8 గంటల సమయంలో దారుణంగా హత్య చేశారు.

# యేడాదిన్నర తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను ప్రారంభిస్తా : మాజీ సిఎం జగన్

## - ఈ లోపు ప్రతి నెలా జనంలోకి వస్తా, కార్యకర్తల సమావేశంలో వెల్లడించిన జగన్,

## -సంకీర్ణ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైంది, ప్రశ్నిస్తే కేసులు పెడుతుంది



**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:**సంకీర్ణ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందని జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పాలనా వ్యవస్థలన్నీ బలహీనపడ్డాయి. ప్రభుత్వం సమాజంలోని ఏ వర్గానికీ ప్రయోజనం చేకూర్చడం లేదు. ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయింది, ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పోలికలు చేయడం సర్వసాధారణమైంది.అని జగన్ అన్నారు.సంకీర్ణ ప్రభుత్వం ఏకపక్ష పాలనకు పాల్పడుతోందని, పోలీసులను దుర్వినియోగం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులు, విమర్శకులపై కేసులు పెడుతోందని జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు.తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో వైఎస్ జగన్ సమావేశం అయ్యారు. ఏడాదిన్నర తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను ప్రారంభిస్తానని ప్రకటించారు. అలా ఏడాదిన్నరపాటు ప్రజల్లోనే ఉంటానని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి మిగిలి ఉంది మూడేళ్లు అని తెలిపారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. అమరావతి సమీపంలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రతి కార్యకర్తకు అండగా నిలవడం, నియోజకవర్గాల్లోని క్యాడర్‌తో మమేకం కావడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని, దీనికోసం ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అధికారం కోల్పోయిన తర్వాత తొలిసారిగా ఇంతటి భారీ కార్యాచరణను ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.గతంలో జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలిచిపోయిన విషయం తెలిసిందే.

## లిక్కర్ కేసులో ఇద్దరు నిందితులకు సిట్ కస్టడీ

**విజయవాడ,.జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసువిచారణలో సిట్ అధికారులు దూకుడు పెంచారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులను విచారించడం ద్వారా ఈ కుంభకోణంలో ఎవరెవరి హస్తం ఉంది, నిధుల మళ్లింపు ఎలా జరిగింది అనే కోణంలో సిట్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. విజయవాడ కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ప్రధాన నిందితులను సిట్ అధికారులు విచారిస్తున్నారు. రోనక్ కుమార్‌ను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి కోర్టు అనుమతించింది. రోనక్ కుమార్‌ను సిట్ కార్యాలయానికి తరలించి, ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. మద్యం సరఫరా, లైసెన్సుల మంజూరులో జరిగిన అవకతవకలపై ఆయనను ప్రశ్నించే అవకాశం ఉంది.అనిల్ చోక్రాను ఒక రోజు పాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే.. భద్రతా కారణాల దృష్ట్యా అనిల్ చోక్రాను విజయవాడ జిల్లా జైల్లోనే విచారించాలని నిర్ణయించారు.సిట్ అధికారులు ఇప్పటికే విజయవాడ జిల్లా జైలుకు చేరుకుని అనిల్ చోక్రాను విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. లిక్కర్ పాలసీలో జరిగిన లోపాలు, ఇతర నిందితులతో ఉన్న సంబంధాల గురించి సిట్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు.. గుంటూరు జైల్లో ఉన్న మరికొంత మంది రిమాండ్ ఖైదీల గురించి కూడా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

## మినీబ్రహ్మోత్సవాన భక్తులు సంతృప్తి చెందేలా మెరుగైన సదుపాయాలు

### - అత్యవసర సమావేశంలో టిటిడి ఇఒ సింఘాల్

**తిరుమల,జనవరి 21ప్రభాత వార్తప్రతినిధి:** మరో నాలుగురోజుల్లో కలియుగవైకుంఠం తిరుమలలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న మినీబ్రహ్మోత్సవం ఆదివారంరోజు మలయప్పస్వామి ఏడువాహనాలపై ఊరేగనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు విచ్చేసే అశేష సంఖ్య భక్తులు సంతృప్తి చెందేలా సౌకర్యవంతమైన దర్శనంతోబాటు మెరుగైన సదుపాయాలు కల్పించామని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు, పదిరోజుల వైకుంఠ ఏకాదశిపర్వదినాన్ని విజయవంతం చేసిన రీతిలో అదే స్ఫూర్తితో ఆదివారం రోజు జరిగే రథసప్తమిని అత్యంత వైభవంగా విజయవంతంగా నిర్వహిద్దామన్నారు.

25వతేదీ ఆదివారం సూర్యజయంతి (రథ సప్తమి)సందర్భంగా మినీ బ్రహ్మోత్సవం తిరుమలలో టిటిడి ఏర్పాట్లు చేసింది. ఒకేరోజు ఉదయం నుండి రాత్రి వరకు ఏడువాహనాలపై శ్రీవారు మాఢవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు సుమారు రెండులక్షలమందికిపైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ వేడుకలకు విచ్చేయనున్న భక్తుల రద్దకి అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,

పటిష్ట ఏర్పాట్లపై బుధవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,

తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య,

టిటిడి సిపిఆర్‌ఒ డాక్టర్ తలారిరవి,తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ తదితర జిల్లా అధికారులతో గంటన్నరకు పైగా సమీక్షించారు.

# తిరుమల సమాచారం

## సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు

### - భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రవేశ మార్గాలు



**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి 25వతేదీ ఆదివారం సూర్యజయంతి (రథసప్తమి) వేడుకలు తిరుమలలో అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడు వాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. వరుసగా శని,ఆదివారం ,సోమవారం సెలవులు వస్తుండటంతో భారీగా భక్తులు చేరుకునే అవకాశం ఉంది. ఈ కారణంగా ఆ రోజు భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి టిటిడి దర్శనం కల్పించనుంది.ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు, భక్తులకు సేవలందించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు, టిటిడి విజిలెన్స్ ఏర్పాట్లలో తలమునకలైంది. బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విజిలెన్స్ విభాగం అధికారులతో కలసి ఆలయ మాఢవీధులు తనిఖీ చేశారు. భక్తులకు గ్యాలరీల్లోకి అనుమతించడం, ప్రవేశనిష్క్రమణ మార్గాలు పరిశీలించారు. అందరూ కలసి సమన్వయంతో భక్తులకు సేవలందించలన్నారు. ఏర్పాట్లు తనిఖీలతో బాటు సేవలందించడంపై సమీక్షించారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఎస్పీ పరిశీలించారు. భక్తుల నియంత్రణ, తోపులాటలేకుండా క్యూలైన్లలోనికి అనుమతించడం వంటివాటిపై సూచనలు చేశారు. ముఖ్యంగా చక్రస్నానం సమయంలో భక్తులు ప్రశాంతంగా క్యూలైన్లద్వారా పుష్కరిణిలోకి చేరుకునేలా చూడాలని ఎస్పీ నిర్దేశించారు.

## గోవిందరాజస్వామి ఆలయానికి రూ.18లక్షలు విలువైన వంటపాత్రలు విరాళం



**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి దాత వంటపాత్రలను విరాళంగా అందించారు. తిరుపతికి చెందిన మురళి 18లక్షలు రూపాయలు విలువైన వంటపాత్రలను ఆలయానికి విచ్చేస్తున్న భక్తులకు అందించే ప్రసాదాల తయారీకి ఈ పాత్రలు ఉపయోగిస్తారు. సోలా,అర, పోటు వంట పాత్రలను బుధవారం ఉదయం టిటిడి ఎఫ్ఎసిఎఒ బాలాజీకి అందజేశారు.ఈ సందర్భంగా దాతను అభినందించారు. ఆలయడిప్యూటీ ఇఒ విఆర్ శాంతి, ఎఇఒ ఏబి నారాయణచౌదరి, సూపరింటెండెంట్ పద్మప్రియ,అర్చకులు పాల్గొన్నారు.

## తిరుమల భద్రతపై ఆరా - శ్రీవారిసేవలో ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా



**తిరుమల,జనవరి 21ప్రభాత వార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఆలయం భద్రత, తిరుమల రక్షణ, భక్తులు భద్రతా వలయం వంటి అంశాలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్(అదనపు డిజి) మహేశ్‌చంద్రలడ్డా ఆరా తీశారు. ఆలయం పరిసరాల్లో నిఘా వ్యవస్థ, భద్రత సిబ్బంది పని తీరును గమనించారు.బుధవారం ఉదయం తిరుమలకు వచ్చిన లడ్డా దంపతులు భద్రతపై ఆరా తీస్తూ ఆలయంలోనికి చేరుకున్నారు. అదనపు డిజికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్‌చంద్ర లడ్డా దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవునికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కుటుంబం, తమిళనాడు ఎమ్మెల్యే సెల్లూర్ కె.రాజు, సినీనటి ఖుష్బూ, నటుడు నవీన్‌చంద్ర విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## విశ్రాంత అధికారికి కీలక పదవి - టిటిడి జెఇఒగా డాక్టర్ శరత్

**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలతిరుపతిదేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు,ఆలయ పవిత్రతను కాపాడే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మరో కీలకమైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.శరత్‌ను నియమించారు. సాధారణంగా టిటిడి పాలన వ్యవహారాల్లో ఇప్పటివరకు సర్వీసులో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారులే ఇఒ,జెఇఒలుగా నియమింపబడేవారు.

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానము
గుండ్లూరు గ్రా॥, కలికిరి (మం), అన్నమయ్య జిల్లా.
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్
NIT.No. P/COE/1317/2025 Dt. 31.10.2025
శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానము రీస్టోరేషన్ & రిహాబిలిటేషన్, శ్రీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ చూడగలరు.
ఇట్లు : కార్యనిర్వహణాధికారి

100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాలను నిల్వచేయడానికి మరియు విక్రయించడానికి నోటీసు

వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తేదీ 24 అక్టోబరు 2015న జారీచేసిన ఉత్తర్వు నం. 2900 (ఇ) మరియు ఆ తరువాత చేసిన సవరణ ప్రకారం, జువారీ ఫార్మ్‌హబ్ లిమిటెడ్ (జెడ్ఎఫ్‌హెచ్ఎల్) ఈ క్రింద పేర్కొనబడిన 100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాల నిల్వ మరియు విక్రయంని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించబోతోందనే విషయం ప్రజానీకానికి తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాము.

| | గ్రేడ్‌లు | 1 | 2 |
|---|---|---|---|
| | స్పెసిఫికేషన్/కంపోజిషన్ | ఎన్‌పికె 19:19:19 | ఎన్‌పికె 13:40:13 |
| 1 | బరువు పరంగా తేమ శాతం, గరిష్టంగా | 0.5 | 0.5 |
| 2 | బరువు పరంగా మొత్తం నత్రజని, కనీసం | 19.0 | 13.0 |
| 3 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే భాస్వరం ($P_2O_5$గా), కనీసం | 19.0 | 40.0 |
| 4 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే పొటాషియం ($K_2O$గా), కనీసం | 19.0 | 13.0 |
| 5 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా సోడియం (NaClగా) శాతం, కనీసం | 0.5 | 0.5 |
| 6 | బరువు పరంగా నీటిలో కరిగిపోని పదార్థం, గరిష్టంగా | 0.5 | 0.5 |
| 7 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా మొత్తం క్లోరైడ్ (Clగా), గరిష్టంగా | 1.5 | 1.5 |
| 8 | బరువు పరంగా లీడ్ (Pbగా) శాతం, గరిష్టంగా | 0.003 | 0.003 |
| 9 | బరువు పరంగా క్యాడ్మియం (Cdగా), గరిష్టంగా | 0.0025 | 0.0025 |
| 10 | బరువు పరంగా ఆర్సెనిక్ (Asగా) శాతం, గరిష్టంగా | 0.01 | 0.01 |

FarmHUB
జువారీ ఫార్మ్‌హబ్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: జై కిసాన్ భవన్, జువారీనగర్, గోవా – 403726, ఇండియా

వార్త

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

-సోక్రటీస్

# విద్యను ప్రైవేట్‌పరం చేయడం న్యాయమా?

**అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటిని, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది.**



రావులపాటి సీతారాం రావు

గతకాలం వైభవం చెప్పుకోవటం అప్రస్తుతమేమో కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉన్నత తరగతుల విద్యాభ్యాసంతోపాటు క్రింది తరగతుల విద్యార్థుల చదువులను గురించి సమీక్షిస్తే చాలా లోపాలు, కొట్టొచ్చినట్లు కనబడుతాయి. పూర్వకాలంలోని గురుకులాలలోని విద్యాభ్యాసం ఆచరించాల్సిన అవసరం ఈ మధ్యకాలంలో మళ్లీ ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవటం గమనిస్తూనే ఉన్నాం. అయితే ఆనాటి గురుకులాల్లోని విద్యార్థుల సంఖ్య చాలా పరిమితులకు లోబడి ఉండేది. ఈనాడు విద్యతో ఉద్యోగం ముడిపడి ఉండటం చేత ఇబ్బడిముబ్బడిగా సంఖ్య విద్యాలయాల్లో పెరుగుతున్నది. చదువుకున్న విద్యార్థుల నాణ్యత తగ్గుతున్నది. పుస్తకాల బరువు పెరుగుతున్నది. సంపాదించుకున్న విజ్ఞానం అరకొరగా ఉంటున్నది. చివరకు విద్యార్థులు విద్యగరిపే అధ్యాపకుల విషయాలు, విశ్వవిద్యాలయాల నాణ్యత తగ్గుముఖం పట్టడం, ఎక్కువ మంది విద్యార్థుల ఆత్మహత్యలూ ఇలాంటి విషయాల్లో కూడా కోర్టులు దృష్టి పెట్టి ఆదేశాలు ఇవ్వాల్సిన పరిస్థితులు రాష్ట్రాల్లో ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో సుప్రీంకోర్టు తొమ్మిది ఆదేశాలు రాష్ట్రాలకూ, కేంద్రానికి ఇవ్వటం ఇటీవల విద్యార్థులనూ, విద్యాధికులనూ, విద్యాలయాలనూ ఆలోచింపచేసే విషయంగా మారింది. ఎక్కువగా విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి ప్రైవేట్‌పరం అవటంతో ఈ ప్రైవేట్ సంస్థలు ఆర్థిక కారణాలతో 'మాస్' లెవల్లో వివిధ తరగతుల్లో చేర్చుకొనే దుస్థితి దాపురించింది. ఎక్కువ సంఖ్యలో ఒక క్లాసులో విద్యార్థులుంటే,ఎంతవరకు అందరికీ సమస్థాయిలో విద్యగరపటం ఎంత కష్టమో ఈ విద్యా సంస్థలు పట్టించుకోకపోగా, మెరుగైన విద్యార్థులను గుర్తించి వారినే ప్రోత్సహించటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. 'సెలెక్టెడ్ విద్యాదానం' కొన్ని సంస్థలు, పేర్లు అందరికీ తెలుసు. ప్రస్తావించడం అప్రస్తుతం. విద్యార్థులు కాకుండా ఆర్థికార్థులు ఈ ప్రోత్సాహాలకు కారణంగా కనపడుతున్నాయి. ఈమధ్యకాలంలో అందుకనే కొన్నిప్రభుత్వాలు, విద్యా సంస్థలను మెరుగ్గా తీర్చిదిద్ది విద్యార్థుల భవిష్యత్తు సమదృష్టితో బేరీజు వేసి, ప్రోత్సహించాలని, నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఆచరణలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటేనే ఇలాంటి ప్రయత్నాలు విజయాలను సాధించగలవు. సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకనిర్దేశాలలో ఈ విషయం ప్రస్తావించారు. సుప్రీంకోర్టు, ఉన్నత విద్యలు,ప్రైవేట్‌పరం కావటంతో క్వాలిటీ తగ్గి క్వాంటిటీ పెరగటాన్ని గమనించింది. ఆర్థిక ప్రయోజనం కోసమే అన్న అంశాన్ని కూడా ఇందుకు కారణంగా పరోక్షంగా చూపెట్టింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 142 ప్రస్తావించి, మార్గదర్శక సూత్రాలలో రికార్డులు



భద్రపర్చటం, రిపోర్టింగ్ కాకుండా ఆత్మహత్యలు ఉన్నత విద్య చదివే వారిలో ఎందుకు పెరుగుతున్నాయన్న సమీక్ష, (అంటే హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్లలో) ప్రత్యేకంగా చేయాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా తగు నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్స్ రిజిస్ట్రార్ల వెకెన్సీలు త్వరగా భర్తీ చేయాలని స్పష్టపరిచింది. అదే విధంగా ఫ్యాకల్టీ ఖాళీలను భర్తీ చేయక తప్పదని కూడా ఈ ఆదేశాలలో చేర్చింది. విద్యార్థుల బాగోగులు ఈ ఆదేశాల అమలుపై ఆధారపడి ఉన్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు భారత దేశంలో, ప్రస్తుత లెక్కల ప్రకారం దాదాపు 50 శాతం ఉన్నత విద్యాసంస్థలలో (హెచ్.ఇ.ఐ) ముఖ్యంగా విశ్వ విద్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయని వేలెత్తి చూపింది. తమిళనాడులోని మద్రాసు యూనివర్సిటీని ఒక 'కేసు స్టడీ'గా భావించి ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ విశ్వవిద్యాలయానికి ముఖ్యంగా మహిళల విద్య విషయంలో దేశంలోనే ప్రముఖస్థానం ఉంది.క్వాలిటీ రిసెర్చికి ఈయూనివర్సిటీకి మంచి పేరు ఉంది.1970 సంవత్సరంలో చదువు చెప్పేవిషయంలో ఈ సంస్థకు పెద్ద పేరు ఉండేది. తర్వాత ఆ పేరు క్రమేపీ తగ్గిపోయి యూనివర్సిటీ ప్రత్యేకతను కోల్పోయింది. అవసరమున్న టీచింగ్ స్టాఫ్ సంఖ్యలో సగం సంఖ్య మాత్రమే ఉండటం ఇందుకు ఒక కారణంగా చెప్పక తప్పదు. రీసెర్చి భాగం నామమాత్రంగా ఉంది. ఇంతకు ముందు ఫిలాసఫీ, మాథ్స్,బాటనీ సబ్జెక్ట్‌లో ఈ యూనివర్సిటీకి గర్వపడేంత గొప్ప పేరు ఉండేది. కానీ ఇప్పుడు ఆ పేరు ఛాయామాత్రంగానే మిగిలింది. ఈ యూనివర్సిటీ ప్రస్తావన ఎందుకంటే మనదేశంలో ఒకప్పటి ఉన్నత విద్య ఎంత ఉన్నతంగా ఉండేదో చెప్పటానికి మాత్రమే గవర్నర్లు ప్రభుత్వాలు పంపిన వైస్ ఛాన్సలర్ల నియామకాలను ఏదో ఒక వంకతో ప్రక్కన పెట్టటంతో వెకెన్సీలు భర్తీ చేయకపోవటంలో ఇలాంటి పరిస్థితి దాదాపు అన్నిరాష్ట్రాలలోవచ్చింది. ప్రభుత్వాలు తమకు రాజకీయంగా అనుకూలురు అయిన వారి పేర్లను పంపటం కూడా ఒక కారణం కావచ్చు. అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటిని, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది. ●

# కొత్త విత్తన చట్టంతో కొత్త కష్టాలు!


కొత్తగా తెచ్చిన విత్తన చట్టంలోని అంశాలుచూస్తే కొరివితో తలగోక్కున్నట్లే అనిపిస్తోంది. అంటే కోతిచేష్టలు తెచ్చుకున్నట్టుగా ఉంది.అసలునకిలీ విత్తనాలను నకిలీ విత్తనాలకు మధ్యతేడాతెలుసుకునే లోపు జరుగాల్సిన నష్టం జరిగిపోతుంది. దేశంలోఎక్కడ చూసినా నకిలీవిత్తనాల వార్తలే వినిపిస్తున్నాయి. రైతులు ఎంతోమంది వాటి ప్రభావంతో వేరే దారిలేక ఆత్మహత్యలకు దిగుతున్నారు. దేశంలో 500 పైబడి ఉన్న విత్తన కంపెనీలు సాలీనా ఐదువేల కోట్ల రూపాయల విలువచేసే నకిలీ విత్తనాలను రైతులకి అంటగట్టగలుగుతున్నారు. సాధారణంగా జరిగే విత్తనాల సాగుకే బోలెడంత ఖర్చవుతుంది. తీరా ఖర్చుతడిసి మోపెడయ్యాక కానీ అవి నకిలీ వని తెలియదు. అప్పుడు రైతు లబోదిబో అని గుండెలు బాదుకుంటాడు. నకిలీ విత్తనాలు తారసిల్లినపుడల్లా ఇలాంటి పరిస్థితే. ఇలాంటి విత్తనాలతో దేశవ్యాప్తంగా విత్తన వ్యాపార సంస్థలు 71వేల కోట్ల రూపాయలు మేరకు వ్యాపారం చేస్తున్నాయి. కొత్తగా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం,ముసాయిదా విత్తన బిల్లు 2025ను ప్రవేశపెట్టింది. 1966 విత్తన చట్టాన్ని కొన్ని మార్పులు చేర్పులతో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్త విత్తన బిల్లు రూపు దిద్దుకోనుంది.అయితే ఇది ఎంతవరకు రైతుకు ఉపయోగకారిగా ఉంటుందో తెలుసుకోవడం కోసం మొన్నడిసెంబరు 11వరకు రైతుల సూచనల కోసం ప్రభుత్వం సమయం ఇచ్చింది.రైతు సంఘాలు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసాయి. కానీ ఈ బిల్లులోని అంశాల్ని పరిశీలించిన వామపక్ష రైతాంగ సంఘాలు కార్పొరేటర్లకు మాత్రమే అనుకూలంగా ఉన్నట్టు బహిరంగంగానే చెప్పాయి. ఈ ముసాయిదా విత్తనాల బిల్లు చట్ట రూపం దాలిస్తే అంతకు ముందున్న విత్తన చట్టాలు దాటిఉంటుంది.కొత్తగా వచ్చేచట్టం నాణ్యమైన విత్తనాలు సరఫరా మరింతగా మెరుగుపరుస్తుందని, ప్రధానంగా విత్తన వాణిజ్యంలో తీసుకొచ్చిన అన్ని జాగ్రత్తలు ఇందులో పొందుపరిచేందుకు ఉద్దేశించబడిన బిల్లు ఇది. సాధారణ సాగుదారులకు ఈ చట్టం పెద్దగా ఉపయోగించదని, విత్తన కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తుందన్న ఆరోపణలే తీర్పే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచన ఎలాఉందో తెలియాలి.నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకునేందుకు తప్ప వారు మారరు. విత్తనాలు వేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో కూడాప్రభుత్వాలు మీనమేషాలు లెక్క పెడుతున్నాయి.ఎవరైతే నకిలీ విత్తనాలు అందుగట్టారో వారి నుండే పరిహారాన్ని రాబట్టే ప్రక్రియ చాలా అవసరం. విత్తనసంస్థలపై ఇటువంటి ఆర్థిక భారం పడుతుందన్న విషయం అమలులో ఉండాలని తెలిస్తే వారు రైతుల్ని ఇబ్బందులకి నెట్టరు.లేకుంటే వారి ఇష్టారాజ్యం. విత్తన విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం కూడా ఒక లోపం. అందుకే రైతుకు అందే విత్తనాల నియంత్రణపై వ్యవసాయశాఖ అధికారులపర్యవేక్షణ ఉండడం అవసరం. నకిలీ విత్తనాల విక్రయ నేపథ్యంలో విత్తనాలు కృత్రిమ కొరతకు పాల్పడే వ్యవస్థలు, వ్యక్తులు కూడా తమ కార్యకలాపాలను వారు నిర్వహిస్తుంటారు. వాటిపై ప్రభుత్వం నిరంతర నిఘాపెట్టి నియంత్రించాలి. అలాంటి కంపెనీలను నిషేధించాలి. రైతులు సాంప్రదాయ పద్ధతిలో విత్తనాలుపొదుపుకునే రైతుకు కూడామరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వటం అవసరం. అలా కాకుండా విత్తన చట్ట సవరణ పేరిట ఎన్ని చట్టాలు తెచ్చినా ఉపయోగంలేదని రైతు సంఘాల వ్యాఖ్యానం. సంయుక్త కిసాన్ మోర్చా వంటి సంస్థలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బహుళజాతి కార్పొరేట్ విత్తన సంస్థలకు మాత్రమే ఈ బిల్లు మేలుచేస్తుందని ఆయా సంఘాలుఆరోపిస్తున్నాయి. రేపటి బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఈ బిల్లు చట్ట రూపం దాల్చేందుకు ఎన్ని అభ్యంతరాలువ్యక్తమవుతాయో చూడాలి. ఈ ముసాయిదా చట్టం సాంప్రదాయవ్యవసాయ పద్ధతులకు ముప్పు కలిగిస్తుందని,అంతేకాక రైతుల విత్తనాల కోసం ప్రైవేటు కంపెనీలపై ఆధారపడాల్సివస్తే భవిష్యత్తులో స్వయంగా విత్తనాలను తయారుచేసుకునే వారి హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆల్ ఇండియాకిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే అభిప్రాయపడుతున్నారు. తదుపరి పంట కోసం విత్తనాలు నిల్వచేసుకునే సాంప్రదాయాన్ని పంజాబ్ రైతులు పాటిస్తుంటారు.రేపేప్పుడోవిత్తన హక్కులను కార్పొరేట్లకు ధారపోస్తే రైతు బాగా నలిగిపోతాడని పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల్లో పరీక్షించి విడుదల చేసే ఏవిత్తన రకమైనా రాష్ట్రానికొకరీల ప్రత్యేక వ్యవసాయ వాతావరణ పరిస్థితుల్లో తప్పనిసరిగా వాడవలసివస్తే రైతుకు నష్టం కలుగుతుంది. అందుకే ఇది న్యాయమైన విత్తనచట్టం కాదని రైతు సంఘాలు ఘోషిస్తున్నాయి. రైతులకు చట్టబద్ధమైన పరిహారవ్యవస్థను రూపొందించాలని వారుకోరుతున్నారు. ఎన్నిసార్లు వ్యవసాయ చట్టాల సవరణలకు తలపెట్టిన బిల్లులు రైతుల అభ్యంతరాలతో చట్టాలుగా రూపు దిద్దుకోలేదు.1966 విత్తన చట్టం, ఆటుపై 1983 లో వచ్చిన విత్తన సవరణ కూడా అదే మాదిరి ఆపోయింది. ఈసారి పరిస్థితి అలాగే ఉంది.పెద్ద పెద్ద విత్తన కంపెనీలకే కొత్త విత్తన చట్టం ఉపయోగం కాస్తుందని, తక్షణ పరిహార లబ్ధిదారులకు చిన్నరైతు మరింత చితికిపోతాని రైతు సంఘాలు ఆలోచనగా ఉంది. ఏ విత్తనచట్టంలోనైనా నకిలీ విత్తనాలతో నష్టపడిన రైతుకు తక్షణ పరిహారం దక్కే మార్గాన్ని సూచించాలని రైతు సంఘాలు అభ్యర్థిస్తున్నాయి. ప్రస్తుత బిల్లు పలు విత్తన రంగాన్ని కార్పొరేట్లు వశపర్చుకునేలా చేస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా ఈ ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు. బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.



జార్జి ఎలియట్

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.




ప్లినీ

# ఆన్‌లైన్ మోసాలతో జర జాగ్రత్త!

డా.పోలం సైదులు

సోషల్ మీడియాను వేదికగా చేసుకోని వర్క్‌ఫ్రమ్ హోమ్, పార్ట్‌టైం జాబ్, ఫిషింగ్, ఫేక్ కస్టమర్ కేర్, ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్,లోన్‌యాప్‌లు, జాబ్, వీసా, గిఫ్ట్, లాటరీలంటూ మోసాలు, ఓఎల్ఎక్స్, క్వికర్, ఇతర మార్కెటింగ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిమోనల్ లాంటి రకరకాల పేర్లతో సైబర్ నేరాలు చోటుచేసు కుంటూ డేటా చౌర్యానికి పాల్పడుతున్నాయి. ఆశకుపోయి కొంచెం ఆదామరిస్తేచాలు ఉన్నది పోగొట్టుకుని,అప్పులపాలై చిక్కుల్లో పడాల్సిందే. మొన్నీమధ్య వాట్సాప్‌లలో ఒక మెసేజ్ చక్కర్లు కొట్టడం అందరికీ తెలిసిందే. కంగ్రాట్యూలేషన్స్ మీరు గిఫ్ట్ గెలుచుకున్నారు. క్లయిమ్ చేసుకోండని మెసేజ్ దర్శనమివ్వడం,దానిని తాకగానే మరో పది గ్రూపు లకు పంపాలని, అలా చేసినవారి ఫోన్లలో వాట్సాప్ హ్యాక్ అయ్యి ఆ నంబర్ నుండి కాంటాక్ట్ నంబర్లకు మెసేజస్ వెళ్ళడం జరిగింది. వర్క్ ఫ్రమ్‌హోమ్ జాబులంటూ నెల జీతాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, రిజిస్ట్రేషన్ ఖర్చులను ముందుగానే జమచేయాలంటూ కండిషన్ పెడుతూ, తీరా చేశాక తీసుకోని ఉడాయించడం జరుగుతుంది. డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని మోసపూరిత మాటలు చెబుతూ, మొదట్లో నమ్మకం కలిగాక పెద్దమొత్తం వసూలుచేసి వారిని ఇబ్బందులకు గురిచేయడం, కేవలం బెట్టింగ్ కోసమే వివిధరకాల ఆటలు ఆడిస్తూ, క్షణక్షణానికి బెట్టింగ్స్‌పెట్టి డబ్బులు కాజేయడం, పిల్లలను రకరకాల ఆటలకు అలవాటుపడేలా చేసి తర్వాత వారినుండి అధికమొత్తంలో డబ్బులు కాజేయడం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందడంతో చౌకగా ఇంటర్నెట్ అందరికి అందుబాటులోకి వచ్చి ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తూనే,ఏం జరుగుతుందో,ఎలా జరుగుతుందో,చివరికి ఏమోతుందోనన్న అనుమానం కలిగిస్తూ సగటుమానవున్ని కలవర పెడుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ప్రస్తుతం మనుషులు పేపర్‌కరెన్సీ లేకుండా లావాదేవీలు జరుపుతున్నారు. అన్నిరకాల బ్యాంకులు వారి బ్యాంకులకు సంబంధించి ప్రత్యేక యాప్‌లను డెవెలప్‌చేసి తమ కస్టమర్లకు అందుబాటులో తెచ్చి, ఫోన్ పే, గూగుల్ పే, పేటియం,ఆన్లైన్ పేమెంట్లకు యాక్సెస్ ఇవ్వడంతో,సాంకేతిక పరిజ్ఞానమునుపయోగించుకొని కొందరు సులభంగా డిజిటల్ నేరాలకు పాల్పడటం జరుగుతుంది. ఎవరైనా తమ ఫోన్‌లోకి ఒక యాప్‌ని డౌన్లోడ్ చేసుకోని ఉపయోగించాలంటే తన వ్యక్తిగత వివరాలను ఇవ్వాల్సివుంటుంది. అంటే తనకు తెలియకుండానే తన సమాచారం ఇతరులకు చేరుతుంది. ఇలా షరతులు,



దేశంలో ఇలాంటి విషయాలు తెలియకుండా ఇంటర్నెట్ వినియోగిస్తూ లావాదేవీలు జరుపుతూ మోసపోతున్నవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. సర్వేఆధారంగా వన్ టైం పాస్వర్డ్‌ను తమకు తెలియకుండా ఇతరులతో పంచుకున్నవారు 26శాతం వున్నారంటేనే అవగతమవుతుంది.సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోని నేరాలకు దిగుతున్న సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాలను ఎంచుకోని వ్యక్తుల బ్యాంకు ఖాతా నంబర్, పాస్వర్డ్,క్రెడిట్ కార్డు,డెబిట్ కార్డు ఓటిపినీ పొంది డబ్బులను కాజేస్తున్నారు. మరీ ముఖ్యమైన ఆసక్తికర విషయమేమిటంటే తాము మోసపోయిన విషయాన్నీ అంగీకరిస్తున్నవారు అధికసంఖ్యలో వున్నారంటే దేశంలో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న డిజిటల్ నిరక్ష్యరాస్యులెందరో తెలియకనే తెలుస్తుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే డిజిటల్ నిరక్ష్యరాస్యుడు అంటే చదువురానివాడు కాదు.చదువొచ్చినా సాంకేతిక పరిజ్ఞానంలోని లొసుగులు తెలియవనివారని అర్థం.ఎంతో చదువు చదివి వివిధరకాల ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినవారున్నారంటే ఎలాంటి ఆశ్చర్యం అక్కర్లేదు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఉద్యోగి నెలజీతం బ్యాంకుల ద్వారానే తీసుకునే పరిస్థితి, వ్యవసాయదారులుక్రాప్‌లోన్స్, ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బును బ్యాంకుల ద్వారానే తీసుకోవాలి. అలాగే మహిళామండలి సభ్యులు ప్రతినెల వారు కొంతసొమ్మును బ్యాంకులలో జమచేసుకోవడం, నెలసరి వాయిదాపద్ధతిలో కట్టి తేర్చడానికి అప్పులుగా తీసుకోవడం అందరికి తెలిసినదే. అంటే ఇప్పుడు దేశంలో బ్యాంకులలో అకౌంట్ లేకుండా ఉన్నవారెవరైనా ఉన్నారంటే ఏదో చిన్నపిల్లలు మాత్రమే వుంటారు. ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరవాలంటే తమ ఆధార్ కార్డు, పాన్‌కార్డు సమర్పించాల్సిందే. ఎటిఎం కార్డు, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అయిపోయింది.సాంకేతిక విద్యనభ్యసించిన కొందరు తమ జ్ఞానానిఉపయోగించి సులభంగా డబ్బులు సంపాదించాలని వివిధరకాల సైట్‌లనుపయోగించి అవతలివ్యక్తుల సమాచారాలను తెలుసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. దేశంలో రోజురోజుకు అభివృద్ధిలో భాగంగా పరిణితి చెందుతూ నూతన సాంకేతిక తను పరిచయం చేస్తున్నా,అంతేవేగంతో నేరగాళ్లు సైతం వారి ఆలోచనలతో కొత్త కొత్త ఆవిష్కరణలు గావించి సైబర్ నేరగాళ్లకు ఒడిగడుతున్నారని చెప్పవచ్చు. అందుకే దేశంలోఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవడం,ఆన్‌లైన్ మోసాలు, హ్యాకింగ్, డేటా దొంగతనం వంటి ఫిర్యాదులను స్వీకరించి, సైబర్‌దాడుల నుండి ప్రజలను,సంస్థలను రక్షించడానికి అవగాహన కల్పిస్తూ,భద్రతా చర్యలనుసూచించడం జరుగుతుంది.అలాగే ఐపి అడ్రస్‌లు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో సైబర్ నేరస్తులను ట్రాక్‌చేసి పట్టుకోవడం,నేరాలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలనుసేకరించి, విశ్లేషించి శిక్షపడేలా చేస్తుంది.కావున ఎవరైనా ఏదైనాసైబర్ నేరానికి గురైతే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చు లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదుచేయవచ్చు. ప్రభుత్వంసైతం నేరాలపై వివిధ సర్వేల ఫలితాలను పరిశీలించి,సైబర్ నేరగాళ్ల ముప్పునుండి తప్పించుటకు, సాంకేతిక నిపుణలతో చర్చించి,ఇలాంటి నేరాలకు ఎవరు పాల్పడినా వెంటనేగుర్తించి, వారికి కఠినమైన శిక్షలు వేసేవిధంగా కృషి చేయాలి. ●

# ప్రజావాక్కు



### పెరుగుతున్న డయాబెటిస్ బాధితులు

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డయాబెటిస్ బాధితులున్న రెండో దేశంగా భారత్ నిలవడం ఒక తీవ్రమైన ప్రజారోగ్యసంక్షోభానికి నిదర్శనం. వేగవంతమైన పట్టణీకరణ, జీవనశైలి మార్పులు జన్యుపరమైన ముప్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు కేవలం సంపన్నవర్గాలకే పరిమితమైన ఈ వ్యాధి, ఇప్పుడు గ్రామీణప్రాంతాలకు, యువతకు సైతం వేగంగా విస్తరిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేఆహారం,మానసిక ఒత్తిడి, అస్తవ్యస్తమైన నిద్రఅలవాట్లు ఈ మెటబాలిక్ వ్యాధికి ఇంధనంగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తు, చాలా సందర్భాల్లో ఈ వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### శాంతి ముసుగులో అధికారం

గ్రీన్‌లాండ్‌ను ప్రపంచభద్రతకుఅనివార్యమని ప్రకటిస్తూ, నోబెల్ శాంతి బహుమతి ప్రస్తావనను కూడా జోడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, శాంతి కంటే శక్తి ప్రదర్శనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న రాజకీయ ధోరణిని బహిర్గతం చేస్తున్నాయి. ఇవి దౌత్యబద్ధమైన విదేశాంగవిధానానికి నిదర్శనం కాకుండా, అంతర్జాతీయవ్యవస్థను వ్యక్తిగత రాజకీయఅహంకారానికి లోబర్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.ఆర్కిటిక్ ప్రాంతంలో గ్రీన్‌లాండ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. కానీ ఆ ప్రాముఖ్యతను సాకుగా చూపి, ప్రపంచ భద్రత పేరుతో భూభాగాలపై హక్కులు ప్రకటించడం వలసవాద ఆలోచనలకు ఆధునిక రూపం ఇచ్చినట్లే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### వీధి కుక్కలను కట్టడి చేయాలి

ఆధునిక మానవుని జీవన విధానం మారింది. పల్లెల్లో ఉండడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. పల్లెటూరి జీవన విధానం పూర్తిగా కనుమరుగైపోతూఉన్నది. పల్లెటూర్లలో వీధి కుక్కలుండేవి.వాటిని విచ్చలవిడిగా వదిలేసేవారు. వ్యవసాయానికి పనికివచ్చిన పశువులను సాలల్లో కట్టేవారు. ఇప్పుడు పట్టణాల్లో ఖరీదైన కుక్కలను కొవ్వెక్కి అద్దెలలో ఉన్నవారు కూడా బీరువాలో పదివేల నోట్ల కట్ట లేని వారు కూడా కొంటున్నారు. సోమలి కాపులు కాస్త కుక్కల కాపులుగా మారిపోయారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మూడో ప్రపంచ యుద్ధం!

ఒకరి దగ్గర ఉన్న డబ్బును ఇంకోకరికి ఎంతైనా ఇవ్వవచ్చును. దీనికి ఎవరి అనుమతి తీసుకోనక్కరలేదు. ఇదేమి విచిత్రమో వెనుజూలా ప్రతిపక్షనాయకురాలైన మరియామదుడో 2025 లో తనకొచ్చిన నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రేమ పూర్వకంగా ఐచ్చికంగా ఇచ్చివేసింది. దానికి ట్రంప్ ఆనందపడుతూ స్వీకరించడం వింతల్లో కెల్లా వింత.ఇతరదేశాలన్ని దీన్నిచూసి నవ్వుకున్నాయి.నోబెల్ బహుమతి ప్రదాతలయిన నార్వే దేశం వారు దీన్ని ఖండించారు. ఒకరు సంపాదించుకున్న డిగ్రీలు, మెడల్స్ ఒకరి నుంచి మరొకరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యే సరకుకాదు. ఎనిమిది యుద్ధాలను ఆపిన తనకు శాంతి బహుమతి రాలేదు కాబట్టి ఇక తానను కున్న పరిపాలనే చేస్తానని ట్రంప్‌చెప్పుకోవడం హాస్యాస్పదం. అంటే ప్రపంచ శాంతికి ఏదో విధంగా విఘాతం కలిగించే పనులు చేస్తాడనే అర్థం అవుతోందిగా.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పోలీసు వ్యవస్థలో మార్పులు

తెలంగాణ పోలీస్‌వ్యవస్థలో ఈ మార్పును అభినందించవచ్చును. పోలీస్ వ్యవస్థలో కొద్దిపాటి మార్పు తీసుకొచ్చినందులకు అభినందించవచ్చును. అట్లాగే పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యంలేకుండా పోలీస్‌వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి బాధితులకు మరింత చేరువగా మానవీయ కోణంలో సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధన విభాగం సీఐడి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇది పౌరులకు బాధితులకు శుభ పరిణామంగా భావిస్తున్నారు. ఇకపై బాధితులు ఠాణాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేకుండా పోలీసులే బాధితుల నివాసానికి లేదా వారు కోరిన ప్రదేశానికి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. నమోదుచేసే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పండ్ల పెంపకం చేపట్టాలి


తెలంగాణలో పెరిగిన నీటి వసతులు వల్ల తేమకూడా పెరిగింది. దాని వల్ల కొబ్బరి లాంటి తోటలు కూడా పెరిగే అవకాశం ఉండడంతో తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలి. ఉపాధి హామీ ప్లానింగ్ చేసేటప్పుడు పండ్ల తోటల పెంపకాన్ని ఒక ప్రాధాన్యాన్ని ఇవ్వాలి. గేట్ల వెంబడి నాటితే రైతులకు ఏ నష్టం కూడా వాటిల్లదు. అందుకని తెలంగాణలో పండ్ల పెంపకం చేపట్టడం వల్ల ఎటువంటి నష్టం ఉండదు.

-భారత అవినాష్, జనగామ

# సంకుచిత పోకడలు ప్రమాదకరం

ఐ.ప్రసాదరావు

ప్రాచీన కాలంలో ప్రపంచంలో బహుగా ప్రకాశించిన పర్షియా దేశం తదుపరి మతం ఆధార దేశంగా ఇరాన్ పేరుతో మారిపోయి, నేడు అతి దీన దేశంగా, అన్ని రంగాల్లో విఫలమై విలవిలలాడుతున్న అతిపేద దేశంగా ప్రస్తుతం మన కళ్లముందు కదలాడుతుంది. దీనికి ప్రధాన కారణం మతపరమైన కట్టుబాట్లు ఆచారాలు, పరిపాలన అభివృద్ధికి ఆటంకంగా ముఖ్యంగా మహిళలు అభివృద్ధికి గొడ్డలి పెట్టు అవుతున్న తరుణంలో ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆందోళనలతో అట్టుడుకుతూ, ఇతర దేశాల ఆధిపత్యం వహించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఆధునిక కాలంలో ప్రపంచం మొత్తం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక టెక్నాలజీతో దూసుకుపోతున్న తరుణంలో సహజవనరుల చమురు నిల్వలు ఉన్న ఇరాన్ దేశం సుభిక్షంగా ఉండవలసింది పోయి, తీవ్రమైన సంక్షోభంలో పడటానికి ప్రధాన కారణం మత ఆధారిత పరిపాలన అనే గ్రహించాలి.ప్రపంచ వ్యాప్తంగా రాజరికం, మత ప్రభువులు పాలన, నియంతల పాలన పోయి, దాదాపు ప్రపంచంలోని మూడోవంతు దేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సాగుతున్న దేశాలు ఏవిధంగా అభివృద్ధి పంథాలో సాగుతున్నాయో గుర్తెరగాలి. మత ఆధారంగా మన నుంచి విడిపోయిన మన పొరుగు దేశమైన పాకిస్థాన్ కూడా దాదాపు అన్ని రంగాల్లో దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. అంతేకాకుండా అసాంఘిక శక్తులకు ఆస్థానంగా మారింది. పాలన మత ఆధారంగా మారిపోతే, అభివృద్ధి ఆగిపోయి, ఈ ఆధునిక కాలంలో అధోగతి పాలు అవుతుంది అని చరిత్ర చెబుతోంది. ఏ దేశంలోనైనా అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మత ఆధారంగా ఉన్న దేశాల పాలనలో మహిళలకు తగిన ప్రాధాన్యత లేకపోవడం అంతేకాకుండా అణచి వేయడానికి ప్రయత్నాలు చేస్తుండటంతో ఆయా దేశాల్లో అశాంతి, ఆగ్రహావేశాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మానవ హక్కులు మంటగలసి అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు నేతలను ఉపేక్షించడం మంచిది కాదు.గత సంవత్సరం వరకు అనేక రంగాల్లో అభివృద్ధి చెందిన మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్ నేడు పరిపాలనలో మత ఆధారిత ప్రభావం పెరగడంతో దేశం అతలాకుతలం అవుతోంది. పరిస్థితి చేజారకముందే చర్యలు తీసుకోవడం ఉత్తమం అని గ్రహించాలి.అలాగే ఆఫ్ఘనిస్తాన్ కూడా మత ఆధారిత పరిపాలన వల్ల అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న పరిస్థితి. నేటి ఆధునిక



కాలంలో ఏ దేశంలోనైనా మత, కుల, లింగ, ప్రాంతీయ, భాష, రంగు, ఆధిపత్యం వంటి విషయాలు ఆధారంగా పరిపాలన సాగితే, తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని అన్ని దేశాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు.ఇక ఇటీవల కాలంలో మన దేశంలో కూడా 'ఒకే' అనే భావన ప్రోత్సహించడం జరుగుతుంది. భారతదేశం విశిష్ట లక్షణం 'భిన్నత్వంలో ఏకత్వం' ఈ విషయం మరచి పోయి నేటి పాలకులు ఒకే భాష, ఒకే మతం, ఒకే పార్టీ వంటిఅంశాలు ప్రోత్సహించడం జరుగుతుంది.ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. సరికదా భవిష్యత్తులో వివక్షత, విద్వేష, విభజన వంటి సంకుచిత ధోరణులు పెరిగి, దేశంలో అలజడులు ప్రభలే అవకాశం ఉంది అని గ్రహించాలి. తాత్కాలిక అధికారం కోసం, ఆధిపత్యం కోసం పరితపించే పాలకులు, భవిష్యత్తులో పెను ప్రమాదాలు అంచనా వేయాలి.భారత రాజ్యాంగం ఆశయాలు దృష్టిలో ఉంచుకోవాలి. నాకు అధికారం ఉందికదా అని ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విర్రవీగుతూ సామ్రాజ్యవాద ధోరణితో వివిధ దేశాలనుభయపెడుతూ ఆక్రమణకు సిద్ధం అవుతున్న తరుణంలో, తన మిత్రులు అనుకున్న యూరోపియన్ దేశాలు బ్రిటన్,జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు గ్రీన్‌లాండ్ విషయంలో ఎదురు తిరుగుతున్నాయి. అనగా అతిగా ప్రవర్తిస్తే ఏ విషయంలోనైనా ఎదురుదెబ్బ తగులుతుంది అని గ్రహించాలి. క్రీ.శ ఒకటవ శతాబ్దం నుంచి నేటి వరకూ ప్రపంచం వ్యాప్తంగా అనేక ఆర్థిక సామాజిక రాజకీయ మార్పులు వచ్చాయి. అందరూ సమానమే అనే భావన పురుడు పోసుకుంది. మాగ్నా కార్టా, మానవ హక్కులు, సహజ హక్కులు,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వం, సామ్యవాదం లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి అనేక అంశాలపై నేటి ప్రభుత్వాలు పనిచేయవలసిన ఆవశ్యకత ఉంది. ఇవి అన్ని దేశాలు గుర్తించాలి. మన దేశ పాలకులు కూడా ముఖ్యంగా రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పరిపాలన అందించాలి. అధికారం అందిపుచ్చుకోవడానికి అడ్డదారులు తొక్కరాదు. ఆయా రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను రెచ్చగొట్టి, ఓట్లు దండుకోవడం మంచిది కాదు.ఆయా రాష్ట్రాల్లో పరిపాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపి, ప్రజలను చైతన్యవంతం చేసి మరింత మెరుగైన పరిపాలన అందిస్తాం అనే భరోసా కల్పించాలి. ఓట్లు రాబట్టుకోవడం మంచిది. అంతేకాకుండా కుల, మత,భాష ఆధారంగా ఓట్లు దండుకోవడం మంచిది కాదు. ఏది ఏమైనా ప్రస్తుత ప్రపంచంలో అధికారం,ఆధిపత్యం ధోరణులు పెరుగుతున్నప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఐక్యమత్యంతో సంఘటితంగా ఉండాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే వారిని బలపరచాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా పరిపాలన అందించడంలోనే భవిష్యత్తు ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది అని అందరూ ముఖ్యంగా పాలకులు గ్రహించాలి. మీడియా కూడా కీలక పాత్ర పోషించాలి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)




# భారత్‌లో ఉగ్రదాడులకు పాక్ కుట్ర!

## నిఘా వర్గాల వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 21:** పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జనవరి 26న భీకర దాడులకు పాల్పడేందుకు '26-26' అరు కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్ము కశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలువురు అనుమానితుల ఫొటోలతో ఢిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ జమ్ముకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ హర్యానాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామన్నారు.

# అంతర్జాతీయ రౌడీలా వ్యవహరిస్తున్న ట్రంప్

## బ్రిటన్ పార్లమెంట్‌లో ఎంపి ధ్వజం

**లండన్, జనవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై యూకే పార్లమెంట్ సభ్యుడు ఎడ్ డేవీ తీవ్రంగా మండిపడ్డారు. గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిలా కాదు అంతర్జాతీయ రౌడీలా, గ్యాంగ్ స్టర్ లా ప్రవర్తిస్తున్నాడు. తాను కోరుకున్నది ఏదైనా సరే బలప్రయోగంతో లాక్కోవాలని చూస్తున్నాడు. అమెరికా చరిత్రలోనే ట్రంప్ అత్యంత అవినీతిపరుడైన అధ్యక్షుడు అంటూ యూకే పార్లమెంట్ లో వ్యాఖ్యానించారు. ట్రంప్ అహాన్ని శాంతింపజేయాలంటే ముందుగా ఆయనకు ఖరీదైన బహుమతులు ఇవ్వాలని, ఎంతసేపూ ఆయనను పొగడాలని అన్నారు. ప్రపంచంలో అందరూ తనను పొగడాలని భావిస్తున్నాడంటూ ఎద్దేవా చేశారు. ప్రైవేట్ జెట్ ల వంటి ఖరీదైన కానుకలిస్తూ, ఆయన క్రిప్టో ఖాతాలో బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెడితే ట్రంప్ సానుకూలంగా ఉంటారని విమర్శించారు. గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవాలన్న అమెరికా ప్రయత్నాన్ని తప్పుబట్టిన దేశాలపై టారిఫ్ లు విధిస్తానంటూ ట్రంప్ చేసిన బెదిరింపులు, ఈయూ దేశాలపై ఇప్పటికే విధించిన సుంకాలను తప్పుబడుతూ డేవీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ టారిఫ్ యుద్ధంతో పలు దేశాల్లో ఆర్థిక వ్యవస్థ కుదేలై లక్షలాది మంది ఉపాధి కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయినా సరే ట్రంప్ ఇదేమీ పట్టించుకోకుండా గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవడమే తన లక్ష్యమంటూ మాట్లాడడం సరికాదని అన్నారు. ఎవరేమైనా, ఏదేమైనా తాను కోరుకున్నది తనకు దక్కాలని భావించడం రౌడీయిజమేనని మండిపడ్డారు.

## రూ.20 వేలు పెట్టుబడి పెడితే పది రెట్లు రాబడి..

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విడియోలు

# ఖండించిన రాజ్యసభ ఎంపి సుధామూర్తి



### తాను ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రసుతల కృత్రిమ మేధ యుగంలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు చాలా మంది ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. రాజ్యసభ ఎంపి సుధామూర్తి పెట్టుబడి స్కీమ్‌లను ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా దీనిపై సుధామూర్తి స్పందించారు. అవి నకిలీవని, వాటిని నమ్మొద్దని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. రూ.20 వేలు పెట్టుబడి పెడితే పదిరెట్లు రాబడి వస్తోందంటూ తాను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవని సుధామూర్తి పేర్కొన్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దని కోరారు. వీటిని నమ్మి తనకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారని వెల్లడించారు. తాను ఎప్పుడూ ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని, ఇలాంటి హెచ్చరికలే చేశారు. అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ఆమె చెబుతున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయింది. అవి ఫేక్ అని, వాటిని నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు.

# అవి విద్వేష వ్యాఖ్యలే..

## ఉదయనిధి మారన్‌కు మద్రాస్ హైకోర్టు షాక్



**చెన్నై, జనవరి 21:** డెంగ్యూ, దోమలు, మలేరియా, కరోనా ఇలా కొన్నింటిని మనం వ్యతిరేకిస్తే సరిపోదని సమూలంగా నిర్మూలించాలంటూ సనాతన ధర్మంపై గతంలో చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కు హైకోర్టు షాక్ ఇచ్చింది. విచారణ జరిపిన మద్రాస్ హైకోరు ఈ వ్యాఖ్యలు విద్వేష ప్రసంగాల్లో భాగమేనని తేల్చిచెప్పేసింది. ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. 2023లో ఉదయనిధి సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పలు చోట్ల అభ్యంతరాలు వ్యక్తం అయి కోర్టుల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ క్రమంలో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ లోనూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇవాళ వాటిని విద్వేష వ్యాఖ్యలు గానే తేల్చింది. డీఎంకే 100 ఏళ్లకు పైగా హిందూ మతంపై స్పష్టమైన దాడి చేస్తోందని, మంత్రి అదే సైద్ధాంతిక వంశానికి చెందినవారని గుర్తుచేసింది. మరోవైపు విద్వేష ప్రసంగాలు చేసిన వారు బాగానే ఉంటారని, వాటిపై స్పందించిన వారే చట్టపరంగా ఇబ్బందులు పడుతున్నారంటూ హైకోర్టు బెంచ్ వ్యాఖ్యానించింది. కోర్టులు కూడా విద్వేష ప్రసంగాలపై స్పందించిన వారిని ప్రశ్నిస్తున్నాయి, వాటిని ప్రారంభించిన వ్యక్తులపై చట్టాన్ని అమలు చేయడం లేదని, తమిళనాడులో మంత్రి చేసిన ద్వేషపూరిత ప్రసంగానికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాలేదని హైకోర్టు గుర్తుచేసింది.

# పూరీ జగన్నాథ ఆలయానికి బాంబు బెదరింపు

**పూరి, జనవరి 21:** ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయాన్ని పేల్చివేస్తామని సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆన్‌లైన్ పోస్టు ఆధారంగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందురోజు ఫేస్‌బుక్‌లో ఆ పోస్టు కనిపించింది. ఆలయాన్ని పేల్చడంతో పాటు బీజేడీ రాజ్యసభ ఎంపీ సుభాషిస్ కుంతియాను అటాక్ చేస్తామని కూడా ఆ పోస్టులో హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా పేల్చివేస్తామన్నారు. అయితే ఆ సోషల్ మీడియా పోస్టు కోసం ఓ మహిళ అకౌంట్‌ను వాడుకున్నారు. ఆమె పేరుతో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ యూజర్ ఐడీని క్రియేట్ చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పూరి సైబర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో జగన్నాథుడి ఆలయ పరిసరాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

# అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్లు

## కోట్ల మందికి భరోసా ఇస్తూ కేంద్రం కీలక నిర్ణయం

## సిడ్బీకి రూ.5 వేల ఈక్విటీ మద్దతుకు కేబినెట్ ఓకే



**న్యూఢిల్లీ, జనవరి 21:** కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు, సామాన్యులకు తీపికబురు అందించింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అటల్ పెన్షన్ యోజన గడువును 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ప్రచార మరియు అభివృద్ధి కార్యకలాపాలకు నిధుల మద్దతును మరియు లోటు నిధులను కూడా పొడిగించింది. ఈ పథకం ద్వారా అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మికులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సమావేశం తర్వాత విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, అసంఘటిత కార్మికులలో అవగాహన కల్పించడం, సామర్థ్య నిర్మాణంతో సహా పథకాన్ని విస్తరించడానికి ప్రచార, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రభుత్వ మద్దతుతో ఈ పథకం 2030-31 వరకు కొనసాగుతుంది. ఎపివై చందాల ఆధారంగా 60 ఏళ్ల వయస్సు నుండి నెలకు రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు హామీతో కూడిన కనీస పెన్షన్‌ను అందిస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసే వారు తమ వృద్ధాప్యంలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు 2015 మే 9న కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అటల్ పెన్షన్ యోజన ద్వారా చందాదారులు 60 ఏళ్లు నిండిన తర్వాత వారు చెల్లించిన చందాను బట్టి నెలకు రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు కనీస హామీతో కూడిన పెన్షన్‌ను పొందుతారు. అటల్ పెన్షన్ యోజన పథకం ఇకపై 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈ పథకం వ్యాప్తిని పెంచడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి, గ్యాప్ ఫండింగ్ కోసం కేంద్రం నిధుల మద్దతును కూడా పొడిగించింది. ఈ ఏడాది జనవరి 19 నాటికి ఈ పథకంలో సుమారు 8.66 కోట్ల మంది పైగా చందాదారులు నమోదు చేసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులకు చేరువ కావడానికి ప్రభుత్వం సామర్థ్య పెంపుదల, అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, చిరు వ్యాపారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోనున్నారు.

తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో మరిన్ని కోట్ల మందికి ఈ పథకం కింద సామాజిక భద్రత లభించనుంది.

**చిన్న పరిశ్రమలకు కేంద్రం తోడ్పాటు**

దేశంలో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బి)కి రూ.5 వేల కోట్ల ఈక్విటీ మద్దతు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.5 వేల కోట్ల ఈక్విటీ మూలధనాన్ని మూడు విడతలుగా సిడ్బి (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో పెట్టుబడిగా పెట్టనుంది. ఇందులో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3వేల కోట్లు, 2026-27లో వెయ్యి కోట్లు, 2027-28లో వెయ్యి కోట్లు చొప్పున కేంద్రం పెట్టుబడిగా పెట్టనుంది.




## మొజాంబిక్ హక్కుల కార్యకర్తకు ఇందిరాగాంధీ శాంతి పురస్కారం

**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రతిష్టాత్మక ఇందిరా గాంధీ శాంతి పురస్కారానికి మొజాంబిక్ హక్కుల కార్యకర్త గ్రాకా మాచెల్ ఎంపిక య్యారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత, మానవతావాద పనులలో గ్రాకా మాచెల్ చేసిన విప్లవాత్మక కృషికి గుర్తింపుగా 2025 సంవత్సరానికి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్ట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ అధ్యక్షతన సమావేశమైన అంతర్జాతీయ జ్యూరీ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇందిరాగాంధీ శాంతి బహుమతితో పాటు రూ.కోటి నగదు, ప్రశంసాపత్రం, ట్రోఫీని మొజాంబిక్ హక్కుల కార్యకర్త గ్రాకా మాచెల్‌కు అందించనున్నారు. మాచెల్ ఒక విశిష్ట ఆఫ్రికన్ రాజనీతిజ్ఞురాలు.

# ఎన్నికల ప్రచారానికి 'కమలం' భారీ వ్యయం

**న్యూఢిల్లీ, జనవరి 21:** లోక్‌సభ ఎన్నికలు, ఇతర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2024-25 సంవత్సరంలో ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ రూ.3,335.36 కోట్లు ఖర్చు చేసినట్లు ఆ పార్టీ వార్షిక ఆడిట్ నివేదిక ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. 201920 సంవత్సరంలో 17వ లోక్‌సభ, ఏడు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల కోసం రూ.1,352.92 కోట్లు ఖర్చు చేసిన బీజేపీ అంతకు రెండున్నర రెట్లు అధికంగా 2024-25 (18వ లోక్‌సభ) ఎన్నికల కోసం ఖర్చు చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికలను ఆ ఏడాది మార్చి 16న ఎన్నికల కమిషన్ ప్రకటించగా అంతకు ముందు ఆర్థిక సంవత్సరం నుంచే ప్రచార కార్యకలాపాలు మొదలయ్యాయి. 2024 ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 44 రోజుల పాటు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఎన్నికలకు ముందు ఆర్థిక సంవత్సరం 2023-24లో ఎన్నికలు, సొంత ప్రచారం కోసం బీజేపీ 1,754.06 కోట్లు ఖర్చు చేసింది. 18వ లోక్‌సభ ఎన్నికలు, 8 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు సంవత్సరం, ఎన్నికలు జరిగిన సంవత్సరంలో ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం బీజేపీ ఖర్చు చేసిన మొత్తం వ్యయం రూ. 5,089.42 కోట్లు. 17వ లోక్‌సభ ఎన్నికలు, 7 అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు రెండు సంవత్సరాల్లో ఖర్చు చేసిన రూ. 2,145.31 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా అధికం. 2025 డిసెంబర్ 27న ఎన్నికల కమిషన్‌కు బీజేపీ తన వార్షిక ఆడిట్ నివేదికను సమర్పించగా దాన్ని ఈసీ ఈ వారం ప్రచురించింది. 2024-25లో బీజేపీ చేసిన మొత్తం ఖర్చు రూ. 3,774.58 కోట్లలో ఎన్నికల కోసం ఖర్చు చేసింది 88 శాతమని తేలింది. ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం జరిగిన మొత్తం వ్యయంలో 68 శాతం అంటే రూ. 2,257.05 కోట్లు ప్రకటనలు, ప్రచారం కోసం బీజేపీ ఖర్చు చేసింది. ఎలక్ట్రానిక్ మీడియా కోసం అత్యధికంగా రూ.1,124.96 కోట్లు ఖర్చు చేయగా ఆ తర్వాత వరుసగా ప్రకటనల కోసం రూ.897.42 కోట్లు ఖర్చు చేసింది. అంతేగాక ఎన్నికల ప్రచారం నిమిత్తం విమానాలు, హెలికాప్టర్లలో తిరిగినందుకు రూ. 583.08 కోట్లు ఖర్చయినట్లు తన ఆడిట్ నివేదికలో పేర్కొన్నది. ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థులకు రూ. 312.90 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందచేసినట్లు కూడా బీజేపీ తన ఆడిట్ రిపోర్టులో వెల్లడించింది. మిగిలిన పార్టీల విషయానికి వస్తే 2024-25 సంవత్సరంలో ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ రూ.896.22 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో రూ. 619.67 కోట్లు ఖర్చు చేసినట్లు ఈసీకి ఇచ్చిన ఆడిట్ నివేదికలో కాంగ్రెస్ పేర్కొన్నది. బీజేపీ వార్షికాదాయం గత రెండేండ్లలో చాలా వేగంగా పెరిగింది. 2023-24లో రూ. 4.340.47 కోట్లు ఉన్న బీజేపీ మొత్తం ఆదాయం 2024-25లో రూ. 6,769.17 కోట్లకి పెరిగింది. స్వచ్ఛంద విరాళాల ద్వారా రూ. 6,124.85 కోట్లు లభించగా మిగిలిన ఆదాయం సభ్యత్వ రుసుములు, బ్యాంక్ వడ్డీ, ఇతర వనరుల ద్వారా సమకూరినట్లు వెల్లడించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత వచ్చిన మొదటి ఆర్థిక సంవత్సరం 2024-25 కావడం గమనార్హం.

### అదే దారిలో కాంగ్రెస్ పార్టీ కూడా!




# మోడీ సొంత రాష్ట్రంలోనూ అవినీతేనా?

## ప్రారంభోత్సవానికి ముందే కూలిపోయిన వాటర్‌ట్యాంక్



**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రధాని మోదీ సొంత రాష్ట్రం, దశాబ్దాలుగా బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్‌లో అవినీతి క్షేత్రస్థాయిలో భారీగా ఉందని ఈ ఘటన రుజువుచేస్తోంది. రూ. 21 కోట్ల ఖర్చుతో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం జరుపుకోవడానికి ముందే కుప్పకూలిపోయింది. సూరత్ జిల్లాలో 33 గ్రామాలకు రక్షిత తాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించిన వాటర్ ట్యాంకు పాలకుల నేలమట్టమైంది. వాటర్ ట్యాంకు నిర్మాణంలో నాసిరకం సామగ్రి వాడి ఉంటారన్న అనుమానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి చెందిన గాయ్‌పగ్లా గ్రూపు వాటర్ సైప్లై స్కీము కింద మాండ్వి తాలూకాలోని తాడ్‌కేశ్వర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 11 లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యంతో 15 మీటర్ల ఎత్తుతో వాటర్ ట్యాంక్ నిర్మాణమైంది. ట్రయల్ రన్ నిర్వహించగా పెద్దపెట్టున శబ్దంతో వాటర్ ట్యాంక్ కూలిపోగా స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు దాదాపు 9 లక్షల లీటర్ల నీటితో ట్యాంకును నింపినట్లు అధికారులు చెప్పారు. హఠాత్తుగా మొత్తం కట్టడం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ సహా ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. వాటర్ ట్యాంకుకు ప్రారంభోత్సవం కాకపోవడం, నివాస గృహాలకు మంచినీటి సరఫరా కనెక్షన్ ఇవ్వకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఎన్డీయేలో చేరిన టిటివి దినకరన్



**చెన్నై,జనవరి 21:** తమిళనాడులో బిజెపి కి భారీ ప్రయోజనం లభించింది. ఎన్డీఏ నుంచి బయటికి వెళ్లిన అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఎఎంఎంకె) ఘర్ వాపసీ అయింది. ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్వయంగా ఎన్డీఏలో చేరినట్లు ప్రకటించారు. కొద్దిసేపటి కిందటే ఆయన కేంద్రమంత్రి పియూష్ గోయెల్ ను కలిశారు. ఎన్డీఏలోకి రీఎంట్రి ఇచ్చారు. అంంతకుముందు చెన్నైలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంకేను ఓడించి రాష్ట్రంలో స్థిరమైన పాలనను అందించడమే తన ఉద్దేశమని, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ఒకే జెండా కిందికి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్డీఏలోకి తిరిగి రావడాన్ని కొత్త ఆరంభంగా దినకరన్ అభివర్ణించారు. రాజకీయాల్లో రాజీ అనేది తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. రాజీ పడటంలో తప్పులేదని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్డీఏ కూటమికి తనవంతు సహాయం అందిస్తానని ఉద్ఘాటించారు. ఎక్కడా ఉన్నా, ఏ పార్టీలో ఉన్నా అమ్మ జయలలిత నిజమైన అనుచరులుగా తామందరం కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దినకరన్ ఎన్డీఏలో కొనసాగారు.

## బంగ్లాలోని రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాలను వెనక్కి వచ్చేయాలని పిలుపు!

**న్యూఢిల్లీ,జనవరి 21:** ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఆందోళనకర పరిస్థితులు చూస్తుంటే భారత్‌పై బంగ్లావాసులు ద్వేషంతో రగిలిపోతున్నారు. మరోవైపు హిందువులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. హిందువుల్ని చంపడం, దాడి చేయడం, వారి ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి ఘటనలు బంగ్లాదేశ్ లో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్తితుల్లో ఇప్పటికే ఇరు దేశాల సంబంధాలు క్షీణించాయి. అక్కడ ఉన్న హిందువులతోపాటు భారతీయ అధికారులకు కూడా రక్షణ లేదనే నిర్ణయానికి ఇండియా వచ్చేసింది. అందుకే వారి భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌లో ఉన్న రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాల్ని తిరిగి ఇండియాకు వచ్చేయాలని ఆదేశించింది. బంగ్లాలోని భారత రాయబారి, ఇతర సిబ్బంది, వేరే విభాగాల్లో పని చేస్తున్న భారత సిబ్బంది కుటుంబ సభ్యుల్ని ఇండియాకు రావాలని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశించినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నిర్ణయం సిబ్బంది కుటుంబ సభ్యులకు మాత్రమే అని సిబ్బంది మాత్రం అక్కడ పని చేస్తారని ఆయన తెలిపారు. భారతీయ రాయబార కార్యాలయం ఎప్పటిలాగే పని చేస్తుందని, ఇతర సేవలు కొనసాగుతాయని, ఎంతకాలంలోపు కుటుంబ సభ్యులు ఇండియా తిరిగి రావాలి అనే కాలపరిమితి విషయంలో ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం ఢాకాలో ప్రధాన రాయబార కార్యాలయం ఉండగా, ఛట్టోగ్రామ్, ఖుల్నా, రజ్షాహి, సిల్హెట్‌లలో రాయబార కార్యాలయాలున్నాయి.

# సంక్షిప్తంగా..

## మాజీ ప్రధాని హత్యకేసు నిందితుడికి యావజ్జీవ ఖైదు



**టోక్యో,జనవరి 21:** జపాన్ మాజీ ప్రధాని షింజో అబేను హత్య చేసిన 45 ఏళ్ల టెట్సుయా యమగామికి జీవితకాల జైలుశిక్ష పడింది. నారా జిల్లా కోర్టు ఆ శిక్షను ఇవాళ ఖరారు చేసింది. మాజీ ప్రధానిని హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. జపాన్ అధికార పార్టీ, వివాదాస్పద దక్షిణకొరియా చర్చి మధ్య సంబంధాలను వ్యతిరేకిస్తూ నిందితుడు మాజీ ప్రధాని హత్యకు ప్లాన్ చేశాడు. జపాన్ రాజకీయాల్లో అత్యధిక కాలం ప్రధానిగా చేసిన వ్యక్తిగా అబెకు రికార్డు ఉన్నది. అయితే ప్రధాని హోదాను విడిచిన తర్వాత ఆయన ఎంపీగా కొనసాగారు. నారా సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో అబేపై 2022లో కాల్పులు జరిపారు. గన్ కంట్రోల్‌పై పట్టు ఉండే జపాన్‌లో ఆ ఘటన జరగడం యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది.

## దావోస్‌లో ఆకట్టుకున్న మెక్రాన్ సన్‌గ్లాసెస్

**న్యూఢిల్లీ, జనవరి 21:** సామ్రాజ్యవాదం మళ్లీ పురుడుపోసుకుంటోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గ్రీన్‌లాండ్' హెచ్చరికలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ పెద్దన్న అమెరికాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దాంతో పాటు మెక్రాన్ తన సన్‌గ్లాసెస్‌తోనూ ఆకట్టుకున్నారు. కళ్లజోడు తీయకుండా ఆయన కనిపించిన తీరుపై నెట్టింట్లో పెద్ద చర్చే నడుస్తోంది. దావోస్ సదస్సు జరుగుతున్న వేదిక లోపల కూడా మెక్రాన్ సన్‌గ్లాసెస్ ఎందుకు ధరించారు? దీని ద్వారా డొనాల్డ్ ట్రంప్‌కు ఏదైనా సందేశం ఇస్తున్నారా? లేకపోతే ఇదేమైనా ఫ్యాషనా? అంటూ నెటిజన్లు వరుస పోస్టులు పెడుతున్నారు.

## రిటైర్‌మెంట్ ప్రకటించిన సునీతా విలియమ్స్



**న్యూయార్కు,జనవరి 21:** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్(60) 27 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి వీడ్కోలు పలికారు. నాసా నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్ 25వ తేదీ నుంచే ఇది అమలులోకి వచ్చిందని నాసా పేర్కొంది. మానవ అంతరిక్ష ప్రయాణంలో సునీతా విలియమ్స్ మార్గదర్శకురాలు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె చూపిన నాయకత్వం, టెక్నాలజీ అభివృద్ధికి చేసిన సేవలు చంద్రుడు, మార్స్‌పై భవిష్యత్తులో చేయబోయే మిషన్లకు బలమైన పునాది వేశాయని నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ప్రశంసించారు. 1998లో నాసాకు ఎంపికయ్యారు. 27 ఏళ్ల పాటు అమెరికా అంతరిక్ష కేంద్రంలో ఆమె పనిచేశారు.

## ప్రయాగ్‌రాజ్‌లో కుప్పకూలిన శిక్షణ విమానం

**ప్రయాగ్‌రాజ్, జనవరి 21:** భారతీయ వైమానిక దళానికి చెందిన టూ సీటర్ మైక్రోలైట్ విమానం కుప్పకూలింది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్న పైలెట్‌తో పాటు సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. మైక్రోలైట్ విమానాన్ని సాధారణంగా శిక్షణ, బర్డ్ రెక్కీ, సర్వే కోసం వినియోగిస్తుంటారు. రెగ్యులర్ సోర్టీలో భాగంగా ఆకాశంలో ఎగురుతున్న సమయంలో విమానం కూలినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ చెరువులో అది కూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు. పప్పామావు, సంగం ప్రాంతాల్లో సోర్టీ నిర్వహిస్తున్నప్పుడు విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు ప్రయాగ్‌రాజ్ డీసీపీ తెలిపారు. పైలెట్లు సురక్షితంగా బయటకు వచ్చారని, జార్జ్‌టౌన్ పోలీసు ఏరియాలోని కేపీ కాలేజీ వద్ద చెరువులో ఆ విమానాన్ని దించినట్లు ఆయన చెప్పారు.

## మిస్టర్ ప్రెసిడెంట్! డెన్మార్క్ ఎంపి తీవ్ర విమర్శ



**కొపెన్‌హ్యాగన్, జనవరి 21:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు డెన్మార్క్ పార్లమెంట్‌లో ఊహించని పరాభవం ఎదురైంది. ఖనిజ నిక్షేపాలకు నిలయమైన గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని అమెరికాకు విక్రయించాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చర్చ జరుగుతుండగా ఎంపీ అత్యంత కటువైన పదజాలంతో విరుచుకుపడ్డారు. మిస్టర్ ప్రెసిడెంట్, ఫ ఆఫ్" అంటూ ఆగ్రహంతో సదరు ఎంపీ చేసిన అసభ్య పదజాలపు వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో మంచు కరుగుతున్న కొద్దీ అక్కడ కొత్త రవాణా మార్గాలు, అపారమైన ఖనిజ సంపద బయటపడుతున్నాయి. ఈ క్రమంలో రష్యా, చైనాల కంటే ముందే అక్కడ పట్టు సాధించాలని ట్రంప్ భావిస్తున్నారు. గ్రీన్‌లాండ్ తమ చేతిలో ఉంటే నాటో భద్రతకు, అమెరికా రక్షణకు తిరుగుండదు.

# మాతా, శిశు మరణాలు తగ్గించాలి

● ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి ● సేవల నాణ్యతపై జిల్లాల్లో అధ్యయనం కోసం చర్యలు ● ప్రత్యేకంగా ముగ్గురు వైద్యులతో పరిశీలక బృందాల ఏర్పాటు ● మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ. జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: మాతా, శిశు మరణాల్ని తగ్గించేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం మాతా, పుట్టిన ఏడాది లోపు శిశు మరణాలకు దారితీస్తున్న కారణాలు, వైద్యులు, సిబ్బంది అనుసరిస్తున్న విధానాల్లో ఉన్న చిన్న లోపాలు సైతం గుర్తించి వాటిని పునరావృతం కాకుండా చూసేలా తగిన సలహాలు, సూచనలతో కార్యాచరణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తారన్నారు. ఇందుకోసం జిల్లాల వారీగా ముగ్గురు వైద్యులతో పరిశీలక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిశువుల్లో ప్రతి వెయ్యి మందిలో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి వెయ్యి మందిలో 25 మంది ప్రాణాలు విడుస్తున్నారు. దీంతో పోల్చితే రాష్ట్రంలో శిశు మరణాలు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది శిశువుల్లో ప్రాణాలు విడుస్తున్న 19 మందిలో 16 మంది పుట్టిన 28 రోజుల్లోపు కన్ను మూస్తున్నారు. ఇదే విధంగా జాతీయ స్థాయిలో పరిశీలించినట్లయితే ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

### యునిసెఫ్, డబ్ల్యూహెచ్ఓ సహకారం

నవజాత శిశు మరణాలను నియంత్రించే చర్యల్లో భాగంగా ప్రస్తుతం ఆసుపత్రుల్లో గర్భిణిలు, మాతా, నవజాత శిశువులకు అందుతున్న వైద్యం, ప్రసవ సమయంలో అనుసరిస్తున్న విధానాల్లో లోపాలను (గ్యాప్ అసెస్మెంట్) గుర్తిస్తున్నారు. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సహకారంతో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు, ఇతర అంశాలను ఎలా పరిశీలించాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం పంపించిన ఖఇండియా న్యూబార్న్ యాక్షన్ ప్లాన్ఖ ఫ్రేమ్ వర్క్‌ను అధికారులు అనుసరిస్తున్నారు.

### ప్రభుత్వాసుపత్రుల సందర్శన

ఈ క్రమంలో జిల్లాల వారీగా ముగ్గురు సీనియర్ వైద్యులతో ప్రత్యేక పరిశీలక బృందాలను వైద్య ఆరోగ్య శాఖ నియమించింది. ఈ బృందంలో చిన్న పిల్లల వైద్యులు, గైనకాలజిస్టు, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ వైద్యులు ఉన్నారు. ఈ బృందాలు సదరు జిల్లాల్లోని అన్ని రకాల ప్రభుత్వాసుపత్రులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించి. గర్భిణిలకు అందుతున్న వైద్య సేవలు, ఐదేళ్లలోపు వయసు కలిగిన చిన్నారుల వరకు వివిధ దశల్లో అందుతున్న వైద్య సేవల గురించి పూర్తి సమాచారాన్ని సేకరిస్తాయి. నవజాత శిశు మరణాల వివరాలు కూడా సేకరిస్తారు. అదేవిధంగా గర్భిణిలు, తల్లుల నుంచి కూడా వారికి అందుతున్న క్లినికల్ కేర్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకుంటాయి. వీటి ఆధారంగా ప్రతి జిల్లా నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయానికి యథాస్థితి నివేదికలు అందుతాయన్నారు. వీటిని క్రోడీకరించి రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

### పరిశీలక బృందాలకు ప్రత్యేక కార్యశాల

రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాల మేరకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా జిల్లాల్లో ఏ విధంగా సమాచారాన్ని సేకరించాలన్న దానిపై పరిశీలక బందాల్లోని సభ్యులకు విజయవాడలో ప్రత్యేకంగా కార్యశాల (సదస్సు)ను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ (మెటర్నల్ చైల్డ్ హెల్త్), సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎల్బీఎస్ హెచ్ దేవి మాట్లాడుతూ మాతా శిశు మరణాల తగ్గింపునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తూ ఇంకా దృష్టిపెట్టాల్సిన అంశాలపై పరిశీలక బృందాలకు అవగాహన కల్పించారు. అలాగే యునిసెఫ్ ముఖ్య ప్రతినిధులు, వైద్యులు శ్రీధర్, సలీమా (హెల్త్ స్పెషలిస్టులు), నాగేంద్ర (ఎంసీహెచ్ కన్సల్టెంటెంట్), డబ్ల్యూహెచ్ ఓ ఢిల్లీ ప్రతినిధులు డాక్టర్ దీపాంకర్, వికాస్ మాట్లాడుతూ ఇండియా న్యూబార్న్ యాక్షన్ ప్లాన్ ఆధారంగా మాతా, నవజాత శిశు ఆర్యోగ్యంపై స్టడీ ఎలా జరగాలన్న దానిపై కూలంకుషంగా వివరించారు. దీనికి అనుగుణంగా తయారయ్యే ప్రణాళిక భవిష్యత్తు తరాలకు ఓ దిక్సూచిగా ఉంటుందని అధికారులు వివరించారు.



## అమరజీవి జలధారకు రూ.1400 కోట్లు

● జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు

పాలకొల్లు, జనవరి 21 ప్రభాతవార్త: పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి సురక్షిత తాగునీరు అందించేందుకు అమరజీవి జలధార పథకం కింద రూ 1400 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో బుధవారం జిల్లాలో పథకం అమలుకు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో ప్రజల ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా అమరజీవి జలధార పథకం పనులు చేపట్టామన్నారు. గోదావరి నది ఉన్న డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పుగా, నీరు కలుషితం అవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో తొలి దశలో ఐదు జిల్లాలు ఈ పథకాన్ని అమలు చేయనున్నారని అందులో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటన్నారు. గోదావరి జలాలను పైపులైన్ ద్వారా నేరుగా ఇళ్లకు అందించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి విజ్జేశ్వరం దగ్గర 155 ఎంఎల్డీ ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్, ఇంటెక్ వెల్, ఫిల్టర్ బెడ్స్, సంపులు, పైప్ లైన్ వంటి నిర్మాణాలు రూ.1000 కోట్లతో చేపడుతున్నామన్నారు. విజ్జేశ్వరం వద్ద గోదావరి నీరును తీసుకొని శుద్ధి చేయడం జరుగుతుందన్నారు.

## ప్రజా భాగస్వామ్యంతో నీరుకొండలో ఎన్టీఆర్ విగ్రహం

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి ప్రాంతం నీరుకొండలో బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం అన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రజా భాగస్వామ్యంతో నిర్మిస్తున్నామని మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అన్న ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని స్పష్టంచేశారు. జగన్ ప్రచార యావ కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రసక్తే లేదని, కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై వైసీపీ విషం కక్కుతోందని మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తానే ఆపానని బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు ప్రకటిస్తే, జగన్ గానీ, ఆయన పార్టీ నాయకులు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 19 నెల కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశామని, సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని తెలిపారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అవన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, త్వరలో మరికొంత గజదొంగల వివరాలు బయటకు రానున్నాయని, వారం దరిపైనా చట్టం తన పరిధిలో తాను పనిచేసుకుంటూ పోతుందని తెలిపారు.




## పలువురు సిఐడి అధికారులకు పతకాలు

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ పోలీస్ సిఐడి విభాగంలో విశేష సేవలు అందించిన పలువురు వివిధ స్థాయి అధికారులకు పతకాలను అందజేసారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సైబర్ క్రైమ్ రామిశెట్టి మధుబాబు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిఐడి హెడ్ క్వార్టర్స్(మంగళగిరి) సిహెచ్ మణికంఠ, హెచ్‌సి 525 సిఐడి కంట్రోల్ రూమ్ ఈ రామ్మోహన్ రెడ్డి, పిసి అర్సోయ, పెద్ద మాలకొండయ్య(నెల్లూరు) లకు డిజిపి కమెండేషన్ డిస్క్ బ్రాంజ్ మెడల్స్ ప్రకటించారు. డిజిపి కమెండేషన్ డిస్క్ మెడల్స్ ప్రశంసా పత్రాన్ని డీజీపీ సిఐడి డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ చేతుల మీదుగా మెడల్ విన్నర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజేసింగ్ రానా, డాక్టర్ కేవీ శ్రీనివాసరావు, కె.చక్రవర్తి, ఎస్ శ్రీధర్, లీగల్ అడ్వైజర్ ఎం లక్ష్మణరావు, సైబర్ క్రైమ్ డిఎస్పీ రవి కిరణ్, ఎస్‌ఐవో కేటీ టీవీ రమణరావు ఏపిఒ నందీశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్ కసిరెడ్డికి అస్వస్థత... ఆస్పత్రికి తరలింపు

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: లిక్కర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజ్ కసిరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. జైల్లో ఉండగానే ఆయనకు స్వల్ప అనారోగ్యం తలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఆయన్ను విజయవాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)కు తరలించారు. ఆసుపత్రిలో రాజ్ కసిరెడ్డికి వైద్యులు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమికంగా స్వల్ప అస్వస్థత కారణంగానే ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సమాచారం. వైద్య పరీక్షలు పూర్తయ్యాక తిరిగి జైలుకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.



## మొగలిచెర్ల దత్తమందిరంలో 25న విశేష అభిషేకాలు

తిరుపతి, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: అవధూత మొగలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో ఈనెల 25వతేదీ మాఘమాసం సప్తమితిథిన దత్తాత్రేయునికి విశేష అభిషేకాలు జరిపిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. మాఘమాసం విశిష్టతతో స్వామివారు కొలువైన బృందావనాన్ని భక్తులే స్వయంగా శుద్ధిచేసేందుకు అవకాశం కలుగుతుంది. 23వతేదీ శుక్రవారం ఉదయం బృందావర్తన సేవలో అభిషేకించే అవకాశం ఉంటుందన్నారు. 24న శనివారం సాయంత్రం విశేష పల్లకీసేవ, 26న ఉదయం పదిగంటలకు సుప్రభాతసేవ, ఆరోజు విశేష అభిషేకాలు జరుగుతాయన్నారు. ఈ సేవల్లో పాల్గొనదలచిన భక్తులు ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయస్వామి మందిరంకు గాని, 9908873699, 9652429852, 9440266380 నంబర్లకు సంప్రదించాలని కన్వీనర్ పవని విష్ణుకౌశిక్ కోరారు.

# ఎస్సీ పారిశ్రామిక వేత్తలకు రూ.53.05 కోట్లు

● ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు రూ.7.16 కోట్ల ప్రోత్సాహకాలు ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సచివాలయం, జనవరి 21 ప్రభాతవార్త: దళిత గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 11451 మంది పారిశ్రామికవేత్తలకు రూ.269.9 కోట్లను పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందించినట్లు రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో దళిత గిరిజన పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో మరింతగా వృద్ధిలోకి తీసుకెళ్ళేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలియజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దళిత గిరిజన పారిశ్రామిక వేత్తలకు రెండు దశల్లో ప్రోత్సాహకాలు అందించామని మంత్రి తెలిపారు. మొదటి విడతగా 2025 అక్టోబర్‌లో 6675మంది ఎస్సీ పారిశ్రామిక వేత్తలకు రూ.178.75 కోట్లు, 1159మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.30.94 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, ఆమోదం పొందిన యూనిట్లను కవర్ చేయడానికి బడ్జెట్ లభ్యత ఆధారంగా ప్రభుత్వం ఇప్పుడు రెండో విడతగా అదనంగా నిధులను విడుదల చేసిందని మంత్రి తెలియజేశారు. ఈ విడతలో 3122 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.53.05 కోట్లు, 495 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.7.16 కోట్లు విడుదల చేయడం జరిగిందని మంత్రి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు, రెండు విడతల్లో కలిపి రూ.231.80 కోట్లు 9797 మంది ఎస్సీ పారిశ్రామిక వేత్తలకు, అలాగే రూ.38.10 కోట్లు, 1654 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపిస్తున్న దృఢమైన నిబద్ధతకు ఈ నిధుల విడుదలే నిదర్శనమని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# అరసవల్లి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

● భక్తుల భద్రతే ముఖ్యం ● అధికారులకు హోం మంత్రి అనిత దిశానిర్దేశం



శ్రీకాకుళం, జనవరి 21 ప్రభాతవార్త: అరసవల్లి క్షేత్రంలో జరిగే రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధి కారులు సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా రానున్న ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లను క్రమబద్ధీకరించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపు విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే ఉత్సవాలను దిగ్విజయం చేయగలమని ఆమె పేర్కొన్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, రథసప్తమి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. అనంతరం జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అంతకుముందు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న హోం మంత్రికి జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కులరహిత సమాజమే ఎస్సీ కమీషన్ లక్ష్యం

● ఎస్సీ కమీషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్

సచివాలయం, జనవరి 21 ప్రభాతవార్త: షెడ్యూల్డ్ కులాల హక్కుల కోసం పనిచేస్తూనే, వివక్ష లేని కులరహిత సమాజమే లక్ష్యంగా ఎస్సీ కమీషన్ పనిచేస్తుందని ఎస్సీ కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. జింఖానా గ్రౌండ్స్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఎస్సీ కమీషన్ సభ్యుల ప్రమాణ స్వీకారమహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సభ్యులు మేకల బిక్షం (బాబు), ఎస్టీ రామాంజినమ్మ, రావాడ సీతారామ్, పి.గౌతంరాజ్, డాక్టర్ బాబుల చేత ఎస్సీ కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమీషన్ చైర్మన్ జవహర్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిని స్వీకరించిన సభ్యులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, అణగారిన కులాల గొంతుకగా ఎస్సీ కమీషన్ నిలవాలన్నారు. ఎస్సీల్లోని 59కులాలకు పక్షపాత ధోరణి లేకుండా నిష్పక్షపాతంగా సేవలు అందించాలన్నారు. దళితుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి ఉన్నతికి పాటు పడడమే ఎస్సీ కమీషన్ లక్ష్యంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనపై ఉంచిన నమ్మకాన్ని అంతే బాధ్యతగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా కమీషన్ పనిచేస్తుందని, బాధితులకు న్యాయం చేయడమే కమీషన్ లక్ష్యమన్నారు. వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎస్సీ కమీషన్ శ్రమిస్తుందని హామీ ఇచ్చారు. దళితులు రాజకీయంగా ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, వినియోగదారుల రక్షణ మండలి చైర్ పర్సన్ పీతల సుజాత, మడకశిర ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తదితరులు ప్రత్యేక అతిథులు హాజరై ఎస్సీ కమీషన్ సభ్యులను అభినందించారు.



ఎస్సీ కమీషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు సన్మానం



## భక్తుల భద్రతే పరమావధి.. రథసప్తమి ఏర్పాట్లు పటిష్టం

● కోడి రామ్మూర్తి స్టేడియం, అరసవల్లి క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

శ్రీకాకుళం, జనవరి 21 ప్రభాతవార్త: అరసవల్లి రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి కోడి రామ్మూర్తి స్టేడియం, అరసవల్లి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరో నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. స్టేడియం అంతటా వెలుతురు సరిగ్గా ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 24న జరగనున్న తమన్ సంగీత విభావరికి వేల సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, గ్యాలరీల వద్ద బారికేడ్లను అత్యంత పటిష్టంగా నిర్మించాలని ఎస్పీ మహేశ్వర్ రెడ్డి సూచించారు.
అక్కడి నుంచి అరసవల్లి వెళ్లిన అధికారులు, ఇప్పటికే రూపొందించిన రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని సెక్టార్లను కలియ తిరిగారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల భక్తులను ఇతర మార్గాలకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. క్యూలైన్ల మధ్య బారికేడ్లు ఎక్కడా ఇబ్బంది లేకుండా, భక్తుల ఒత్తిడికి తట్టుకునేలా పటిష్టంగా ఉండాలని స్పష్టం చేశారు. సామాన్య భక్తుడికి పెద్దపీట వేస్తూ, అరగంటలోనే దర్శనం పూర్తయ్యేలా చేయడమే తమ లక్ష్యమని కలెక్టర్ పునరుద్ఘాటించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్, ఆర్ అండ్ బి, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయండి

రాష్ట్ర శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి




తిరుపతి కలెక్టరేట్, జనవరి 21 ప్రభాతవార్త: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమంపై అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై శాసన సభ డిప్యూటీ సెక్రటరీ ఆర్.వనితరాణి, జిల్లా కలెక్టర్ డా వెంకటేశ్వర్, కమిటీ సభ్యులతో కలసి చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాల వివరాలను కమిటీకి సమర్పించారు. సంక్షేమ పథకాలను పారదర్శకతతో సమర్థవంతంగా అమలు చేస్తూ లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత చురుకుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శాసనసభ కమిటీ సభ్యులు పల్లె సింధూర రెడ్డి, లోకం నాగమాధవి, వరపుల సత్యప్రభ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ రెడ్డి, కల్పలత, మధుసూదన్, డిఆర్ఓ జి నర్సింహులు, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వినోద్ కుమార్, ఐసిడిఎస్ అధికారిని వసంతబాయి, సోషల్ వెల్ఫేర్ డిడి విక్రమ్ కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, బీసీ వెల్ఫేర్ డిడి భరత్ కుమార్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి చెన్నారెడ్డి, డిఆర్డిఏ పిడి ప్రభావతి, మెప్మా పిడి ఇఫ్రామ్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడమే లక్ష్యంగా కమిటీలో ఉన్న వారు కృషి చేస్తున్నామని తెలిపారు.

## ముగిసిన పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం పర్యటన

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం మూడు రోజుల పర్యటన బుధవారంతో ముగిసింది. విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్, డేవిడ్ బి పాల్, జియాన్ ఫ్రాంకో డి సీకో, కేంద్ర జలవనరుల శాఖ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి, మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, రవి అగర్వాల్, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, చీఫ్ ఇంజనీర్ ఎం.రమేష్ కుమార్, ఎన్ఐ ఆర్ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతానిలతో కలిసి మూడు రోజుల్లో గ్యాప్ 1, డిహిల్, గ్యాప్ 2, జిహిల్, ప్రధాన డాం ఎగువ, దిగువ భాగాలు, డివాల్, డీవాటరింగ్ ఛానల్, రాక్ ఫిల్, క్లే స్టాక్, మెయిన్ డాం గ్యాప్-1లో మట్టి పటిష్టత ఎలా ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడో రోజు జరిగిన సమావేశానికి పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ ఎం.రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. మూడు రోజులపాటు జరిగిన క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష సమావేశాల్లో ప్రభుత్వ సాగునీటి సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సి కె.నరసింహమూర్తి, ఎస్ఈ ఆర్.రామచంద్ర రావు, పాల్గొని విదేశీ నిపుణులు, కేంద్ర ప్రభుత్వ అధికారుల సందేహాలు నివృత్తి చేశారు.


## అక్రమంగా తరలిపోతున్న గోవులు స్వాధీనం



పలమనేరు, జనవరి 21, ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పలమనేరు మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న గోవులను తిరుపతి, పలమనేరు భజరంగబళి విశ్వహిందూ పరిషత్ నేతలు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా నుండి వివిధ సంతల్లో కొనుగోలు చేసి 4 ట్రక్కుల్లో రహస్యంగా తరలిస్తుండగా బుధవారం తెల్లవారు జామున అందిన సమాచారం మేరకు దాడి చేసి అడ్డుకున్నారు. పలమనేరు సమీపంలోని హైవే వద్ద 1 ట్రక్కులో వెళుతున్న 32 గోవులు, మరో ట్రక్కులో వెళుతున్న 40 గోవులు మొత్తం 72 గోవులు పట్టుబడగా మిగిలిన రెండు ట్రక్కుల్లో గోవులు తీసుకొని దుండగులు పరారీ అయ్యారు. తమిళనాడు, కేరళలో పశుమాంసానికి విశేషమైన డిమాండ్ ఉంది. పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సంతల్లో కొనుగోలు చేసిన లేగ దూడల నుండి వయసు మీరి పశువులను తక్కువ ధరలకు కొనుగోలు చేసి రాత్రికి రాత్రే తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసుల నుండి రవాణాశాఖ అధికారులకు, మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వరకు మామూ అందజేస్తూ గమ్య స్థానాలు చేరుస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణా నుండి వచ్చిన పశువులను భజరంగ భళి, విశ్వహిందూ పరిషత్ నేతలు స్వాధీనం చేసుకొని క్యాటిల్‌ఫామ్ వద్ద గో సంరక్షణ శాలకు అప్పగించడం విశేషం. తప్పించుకొని వెళ్ళిన మిగిలిన గోవులపై దర్యాప్తు చేయాలని నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోవులను సంరక్షించాలని, గోమాతలను పూజించాలని వాటిని మాంసం కోసం చంపడం మహాపాపమని వివరించారు. గోవులను తరలిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని విన్నవించారు.

## రాముల గుడికి కోటిన్నర ఆస్తి విరాళం

దాతృత్వాన్ని చాటుకున్న దంపతులు



ప్యాపిలి, జనవరి 21 ప్రభాతవార్త: ఆస్తుల కోసం హత్యలు చేస్తున్నారు. డబ్బుల కోసం అన్నదమ్ములు, బంధు వులు ఘర్షణలు పడుతున్న కాలమిది. మానవత్వం వంట కలిసి పోతున్న మంట కలిసి పోతున్న కాలంలో దాతత్వం కనుమరుగవుతున్న తరుణంలో కోటిన్నర రూపాయల ఆస్తిని శ్రీరా ముల వారి గుడికి విరాళంగా ఇచ్చి దాన గుణాన్ని దంపతులు నిరూపించిన ఉదంతం కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామంలో చోటుచేసుకుంది.
బొచ్చు పెద్ద వీరభద్రుడు, వెంకటేశ్వరమ్మ దంపతులు ఏకంగా కోటిన్నర రూపాయల విలువచేసే 8 ఎకరాల పొలాన్ని రాములోరి గుడికి విరాళంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. మాధవరం గ్రామానికి చెందిన రాముల గుడికి ఎనిమిది ఎకరాలు పొలం రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా దాత బొచ్చు పెద్ద వీరభద్రుడు మాట్లాడుతూ తమకు పిల్లలు లేనందున శ్రీరాములు గుడికి విరాళం ఇచ్చామని తెలిపారు. తాము ముగ్గురు అన్నదమ్ములమని, తాను పెద్దవాడినని, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారన్నారు. తన భార్య మానసిక రోగిగా ఉండడంతో ఆస్తిని భగవంతుడు శ్రీరాముడికి విరాళంగా ఇచ్చామని వారు తెలిపారు. శ్రీరాముల ఆలయానికి ఆస్తిని ఇచ్చిన దంపతులను గ్రామస్తులు అభినందించారు.



# రూ.8.74 కోట్లతో శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి

- కార్పొరేషన్ సహకారంతో 100 ఎకరాల్లో సోలార్ పవర్ ప్రాజెక్ట్
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 21 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.8.74 కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అనేక ఏళ్ల చరిత్ర కలిగిన పవిత్ర క్షేత్రమని, భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. తొలి దశలో రూ.8.74 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో ప్రారంభించి ఏడాదిన్నర లోపు పూర్తి చేస్తామని తెలిపారు. దేవస్థానానికి చెందిన 1176 ఎకరాల భూముల్లో 100 ఎకరాలను వినియోగించి నెల్లూరు నగర కార్పొరేషన్ సహకారంతో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నట్లు, దీనికి అవసరమైన అన్ని అనుమతులను జారీ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని, నేడు ప్రభుత్వం నుంచి భారీ నిధులు మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధులు కోరిన వెంటనే స్పందించి మంజూరు చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఇంచార్జ్ మేయర్ పొలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ ఇందుపూరు అమ్మల్ శంకర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, జిల్లా కోఆప్షన్ మెంబర్ అలాఖ్ఖు, మండల కోఆప్షన్ మెంబర్ మీరామోహిద్దీన్, దేవరపాలెం గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి అశోక్ రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు ముత్యంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, మురళి, దుబ్బుగుంట కిష్టయ్య, తోటేటి మురళి, టిడిపి నాయకులు వేమిరెడ్డి నారాయణ రెడ్డి, తాటిపర్తి బాబు, సుధాకర్ రెడ్డి, టి.వెంకటేష్, గుంజి అంకుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపి కేంద్రంగా ఉద్యాన, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి

- పారిశ్రామిక పార్కుల రంగంలోనూ విస్తృత అవకాశాలు
- యుఎఇ మంత్రితో పెట్టుబడులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చ




విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి నుంచి ఉద్యాన, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటును పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యూఏఈకి ప్రతిపాదించారు. దావోస్‌లో ఆ దేశ విదేశీ వాణిజ్య మంత్రి థాని బిన్ అహ్మద్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఎపిలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు ప్రతిపాదనపై ఇరువురు నేతలు చర్చించారు. యూఏఈ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీలో విస్తృతంగా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని సిఎం వివరించారు. అగ్రిటెక్, ఫుడ్ టెక్, ఆక్వా టెక్‌తో పాటు ఫుడ్ పార్కుల అభివృద్ధి, ఆహార భద్రతా చర్యల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఆహార ఉత్పత్తులను వేగంగా రవాణా చేసేందుకు వీలుగా ఎపిలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్డు, రైలు నెట్‌వర్క్ విస్తృతంగా ఉందని యుఎఇ వాణిజ్య మంత్రికి వివరించారు. వీటితో పాటు జాతీయ పారిశ్రామిక కారిడార్లు కూడా రాష్ట్రంతో అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. యుఎఇకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్ వరల్డ్, ఏడీ పోర్ట్స్, యాడ్ నాక్ లాంటి కంపెనీలు ఎపిలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సిఎం కోరారు. పునరుత్పాదక ఇంధన రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఎపి పనిచేస్తోందని.. యూఏఈకి చెందిన టాక్వా, మజ్దార్ లాంటి కంపెనీలతో పాటు ఎడిఐఎ, ముబాద్లా, ఎడిక్యూ లాంటి ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్పేస్, డ్రోన్ సిటీల్లోనూ యుఎఇ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా... దీనిపై యుఎఇ విదేశీ వాణిజ్య మంత్రి సానుకూలంగా స్పందించారు.



వైద్యశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

# వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

## ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ (గన్నవరం), జనవరి 21, ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా హెచ్చరించారు. విజయవాడ గిరిపురంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరుపట్టిని పరిశీలించారు. ఓపి సేవలు, రోగులకు అందుతున్న వైద్యపరీక్షలు, కన్సల్టేషన్‌రూమ్‌ల పని తీరును, టెలీక్లీనిక్ సేవల అమలు తీరును సమీక్షించారు. లేబొరేటరీలో రోగులకు చేస్తున్న పరీక్షలు, నివేదికల వివరాలు ఆరా తీసారు. ఫార్మసీ విబాగంలో మందుల నిల్వలు, ఉచిత ఔషదాల పంపిణీ పై సిబ్బందికి సూచనలిచ్చారు. జాతీయ వ్యాదినిరోధక టీకాల కార్యక్రమం అమలుతీరును పరిశీలించి చిన్నారులు, గర్భిణీలకు తప్పనిసరిగా టీకాలు వేయాలని సూచించారు., ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని, వారికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోగులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వైద్యశాలల్లో సమస్యలు ఉంటే క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి తెలియచేయాలని కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. ప్రభుత్వవైద్యశాలల్లో సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

పదవతరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున చదువులో వెనుకపడిన విద్యార్దులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లాకలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. బుధవారం విజయవాడలోని సివిఆర్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా పదవ తరగతి విద్యార్దులతో ముచ్చటించారు. వారి మేధస్సును పరీక్షించి వారికి పలు ప్రశ్నలు సంధించారు. గణితం, సోషల్ స్టడీస్‌కు సంబందించిన ప్రశ్నలు అడిగారు. విద్యార్దుల సమాధానాల పట్ల సంతృప్తి చెందారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉపాధ్యాయులు సెలవులు పెట్టవద్దని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్దులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్దులను పరీక్షలకు తయారు చేయాలని, పరీక్షల్లో ప్రశ్నలకు జవాబులు రాసే విధానాన్ని తెలియచేయాలంటూ పలు సూచనలిచ్చారు.

# కార్యకర్త ఇంటికెళ్లి... నేనున్నానంటూ పవన్ భరోసా



చందు వెంకటవసంతరాయలు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పవన్

- కష్టంలో తోడుంటామంటూ ధైర్యం నింపిన డిప్యూటీ సిఎం
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు చందు వీరవెంకట వసంతరాయలు కుటుంబానికి పరామర్శ

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాం. కష్టంలో వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం పెడన నియోజకవర్గం, కృత్తివెన్ను మండల పరిధిలోని పెదచందాల గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు చందు వీర వెంకట వసంతరాయలు కుటుంబాన్ని పరామర్శించారు. గత ఏడాది జులైలో దిగమర్రు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వసంతరాయలుకి బ్రెయిన్ డెడ్ కాగా, అతని కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న పవన్ ఆ కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి భరోసా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం పెదచందాలలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భార్య నాగ పుష్పావతి, కుమారుడు సీతారామరాజు, కుమార్తె జాహ్నవిలను ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ స్థితిగతులపై ఆరా తీశారు. వారు చెప్పిన సమస్యలు ఓపికగా విన్నారు. తండ్రి మరణానంతరం ఉద్యోగం వదిలి కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్న సీతారామరాజుని అభినందించి, అతని వివరాలు తెలుసుకున్నారు. కుమార్తె జాహ్నవికి వినికిడి లోపం, మాటలు రావని తెలుసుకుని టీటీడీ శ్రవణం ప్రాజెక్టు ద్వారా సాయం చేయాలని అధికారులకు సూచించారు. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద ఉపాధి కల్పించే ఏర్పాటు చేయాలన్నారు. మీ కష్టంలో మేము తోడుంటామంటూ భరోసా ఇచ్చారు. జనసేన క్రియాశీలక సభ్యులకు ఇచ్చే రూ.5 లక్షల బీమా చెక్కుని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ "ఇంటి పెద్దను కోల్పోతున్నామన్న బాధలోనూ వారి కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడం నన్ను కదిలించింది. ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతాయి. దుఃఖాన్ని దిగమింగుకుని అవయవదానం చేసిన వసంత రాయలు కుటుంబానికి అభినందనలు తెలియజేస్తున్నా. మరణంలోనూ మరో ఐదుగురికి ఊపిరి పోయడం గొప్ప విషయం. వసంత రాయలు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం" అని అన్నారు.

### అడుగడుగునా జననీరాజనం

వసంతరాయలు కుటుంబాన్ని పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ వస్తున్న విషయం తెలుసుకున్న పెడన నియోజకవర్గ ప్రజలు ఆయనకు స్వాగతం పలికేందుకు రోడ్ల వెంబడి బారులు తీరారు. పూలు, పూలమాలలతో కార్యకర్తలు, హారతులతో ఆడపడుచులు గ్రామ గ్రామాన స్వాగతం పలికారు. మచిలీపట్నం శివారు, పెడన, తోటమూల, హుస్సేన్ పాలెం, కట్లపల్లి, సింగరాయపాలెం, బల్లిపర్రు, మడక, నందమూరు, మంజులూరు, బంటుమిల్లి, చిన పాండ్రాక, చెరుకుమల్లి, కృత్తివెన్ను, గాంధీనగర్, పెద చందాల గ్రామాల్లో ప్రజలంతా రోడ్డు వెంట బారులుతీరారు. పలువురు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ పవన్ ముందుకు సాగారు. కార్యక్రమంలో పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, వివిధ కార్పోరేషన్ల డైరెక్టర్లు, జనసేన ఎన్టీఆర్, కృష్ణా, జిల్లాల అధ్యక్షులు సామినేని ఉదయభాను, బండ్రెడ్డి రామకృష్ణ, నియోజకవర్గాల పిఓసిలు పాల్గొన్నారు.



# 23న వసంత పంచమి వేడుకలు

## విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా సరస్వతి యాగం, ఉచిత దర్శనం, ప్రత్యేక ప్రసాదం

ఇంద్రకీలాద్రి, జనవరి 21 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 23న వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. వసంతపంచమి పర్వదినాన సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడానికి సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై వైదిక కమిటీతో కలిసి ఈఓ, చైర్మన్, పాలకమండలి బుధవారంనాడు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 7 గంటల వరకు యూనిఫారం, గుర్తింపుకార్డుతో వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వారికి 6వ అంతస్థులో శ్రీ అమ్మవారి ప్రసాదంగా పెన్ను, లడ్డూ ప్రసాదం, శక్తికంకణం, శ్రీ అమ్మవారి ఫొటో అందిస్తామన్నారు. 6వ అంతస్థులో ఉచితంగా 500 మందికి అక్షరాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి మాతగా దర్శనమిస్తారన్నారు. అలాగే సరస్వతి హోమం నిర్వహిస్తామన్నారు.

### నకిలీ ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా వుండాలి

దుర్గమ్మవారి ఆలయం నుండి అని చెప్పి భక్తులకు వస్తున్న నకిలీ ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా వుండాలని ఇఓ వికె శీనా నాయక్ అన్నారు. దుర్గమ్మవారి చీరలు ఇంటివద్దకే అందిస్తామని, దుర్గమ్మవారి పూజలు చేయిస్తామంటూ పలు అజ్ఞాత కాల్స్ భక్తులకందుతున్న నేపథ్యంలో ఇఓ బుధవారం భక్తులను ఈ నకిలీ కాల్స్ ను నమ్మవద్దని భక్తులు స్వయంగా కానీ, దేవస్థానం అఫిషియల్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఏ రకమయిన సేవలనైనా బుక్ చేసుకోవాలన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం



దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,472ల విరాళాన్ని విజయవాడకు చెందిన ఎన్ గోపాలకృష్ణ బుధవారం అందించారు. గొల్లమామిడాడకు చెందిన కొప్పుల మనీషా, తమ కుటుంబసభ్యులు రు.1,35,516 విరాళాన్ని అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.




## వ్యాపారస్తులపట్ల స్నేహ భావంతో వ్యవహరించాలి

# పన్నుల రాబడి వృద్ధి చేయాలి

## రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: వ్యాపారస్తులపట్ల స్నేహ భావంతో వ్యవహరిస్తూ రాష్ట్రంలో పన్నుల రాబడిని పెంచాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధికి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తాడేపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రేంజ్ ఆఫీసర్లు (ఆర్వోలు), జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో మంత్రి పయ్యావుల కేశవ్ రెవెన్యూ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు వాణిజ్య పన్నులు శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు నిర్దేశించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన సంస్కరణలు రాజకీయంగా సరైనవే కాక ప్రజలకు, వ్యాపారులకు అనుకూలమైనవని తెలిపారు. డిసెంబర్ నాటికి నిర్దేశించుకున్న వాణిజ్య పన్నుల వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని గుర్తుచేశారు. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పన్ను వసూళ్ల వృద్ధి రేటు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్ర పాలన సజావుగా సాగేందుకు రాబోయే మూడు నెలల్లో అవసరమైన నిధుల సమీకరణలో వాణిజ్య పన్నుల శాఖ పాత్ర కీలకమని మంత్రి స్పష్టం చేశారు. సంస్కరణల పేరుతో అధికారులు బాధ్యతల నుంచి రిలాక్స్ కావద్దని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని గమనిస్తున్నారని తెలిపారు. ఎక్సైజ్ శాఖ పనితీరును స్ఫూర్తిగా తీసుకుని, వాణిజ్య పన్నుల శాఖ కూడా పన్ను పరిధి పెంచి లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్యాక్స్ బేస్ పరంగా చూస్తే వృద్ధి చాలా స్వల్పంగా ఉందని, పన్ను సంస్కరణలకన్నా అధికారుల పనితీరు, సామర్థ్యమే ట్యాక్స్ బేస్ పెరుగుదలకు కీలకమని అన్నారు. పొరుగు రాష్ట్రాలతో వాణిజ్య పన్నుల శాఖ పనితీరును పోల్చి విశ్లేషించాలని సూచించారు. ఆటో అప్రూవల్ (14ఏ) సౌకర్యాన్ని తప్పుడు మార్గాల్లో ఎవరైనా ఉపయోగిస్తున్నారా అనే విషయాన్ని నిశితంగా అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుతం 90 శాతం రిటర్న్ ఫైలింగ్ జరుగుతోందని, అధికారుల కృషితో దీన్ని 100 శాతానికి తీసుకెళ్లేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. నిర్దేశిత గడువు లోగా ఆడిట్ కేసులకు పరిష్కారం చూపాలని, క్షేత్రస్థాయి అధికారులు అంకితభావంతో పనిచేసి పన్ను ఎగవేతను అరికట్టాలని మంత్రి స్పష్టం చేశారు.

ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి పియూష్ కుమార్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్టర్ల సదస్సు ద్వారా గూగుల్ సంస్థ వంటి పెద్ద సంస్థల నుంచి పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. "స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంలో భాగంగా రాబోయే ఐదేళ్లలో రూ. 40 లక్షల కోట్ల పెట్టుబడులను ఆశిస్తున్నామని, పరిశ్రమల రంగంలో ఇప్పటికే రూ. 16 లక్షల కోట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 29 శాతానికి పైగా రెవెన్యూ వృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. జీఎస్టీ-2.0 ద్వారా సాంకేతికతను వినియోగించి రియల్ టైం మానిటరింగ్ చేస్తున్నామని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఐటి ద్వారా పన్ను వసూళ్లు, డేటా విశ్లేషణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. వ్యాపారులకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ స్మార్ట్ గా పని చేయాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు. ఎ మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా పన్ను చెల్లింపుదారుల సందేహాలను నివృత్తి చేయడంలో రాష్ట్రం ముందుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నెక్స్ట్ జనరేషన్ పోర్టల్స్ వంటి ఆధునిక సాంకేతికతతో పన్ను ఎగవేతలను అరికడుతున్నామని, పారదర్శకత పెరిగి అవినీతికి తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవే బిల్లుల సంఖ్యలో గతేడాదితో పోలిస్తే 9.5 లక్షల పెరుగుదల ఉండటం రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటున్నాయనేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మార్చి నాటికి ఆదాయ వృద్ధిని 10 శాతానికి తీసుకెళ్లాలని అధికారులకు ప్రధాన కమిషనర్ బాబు. ఎ సూచించారు. వర్క్ షాపులో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ (లీగల్) డి. రమేష్, సెక్రటరీ టూ సిసిఎస్టి రవిశంకర్, స్పెషల్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ ఎన్. సౌమ్య పాల్గొన్నారు.




# సంక్రాంతి సంబరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్

అమలాపురం, జనవరి 21 ప్రభాతవార్త: డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా ఎస్ యానాం బీచ్ సంక్రాంతి సంబరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును శాసనమండలి సభ్యులు సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. అమలాపురంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీచ్‌లో సంక్రాంతి సంబరాలు పేరిట కోట్ల రూపాయలు దోపిడీ చేశారని ఎమ్మెల్యే పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత రెండేళ్లుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు ముసుగులో రూ10 కోట్ల వరకు దోపిడీ జరిగిందని ఆరోపించారు. షాపింగ్ మాల్స్, చమురు సంస్థలతోపాటు అధికారులు, కాంట్రాక్టర్లు నుంచి కూడా ఫెస్టివల్ ముసుగులో ఎమ్మెల్యే ఆనందరావు కోట్లాది రూపాయల బలవంతపు వసూళ్లతో అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్సీ బొమ్మి ఆరోపించారు. కోతకి గురైపోతున్న ఓడలరేవు గ్రామాన్ని విస్మరించి స్వగ్రామం యానం పట్ల మొగ్గు చూపారని వీటిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యేలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను ఒక్కొక్కటిగా బయట పెడతాను అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన 18నెలల్లో కనీసం వందమంది దళితులపై దాడులు, హత్యలు, హత్యాచారాలు జరిగాయని ఎమ్మెల్సీ ఆరోపించారు. ఇంత జరుగుతున్న ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ స్పందించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జరుగుతున్న దళితులపై జరుగుతున్న దాడులకు కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ఎపిలో ప్రత్యామ్నాయ ఇంధన రంగంలో

# పెట్టుబడులకు మంచి ప్రోత్సాహం



### దావోస్‌లో సిఇఓలతో భేటీలో మంత్రి లోకేష్

విజయవాడ, జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో ప్రత్యామ్నాయ ఇంధన రంగంలో పెట్టుబడులకు మంచి ప్రోత్సాహం అందిస్తామని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపార వేత్తలు, సీఈఓలతో భేటీ అవుతూ ఏపీ మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంవగా ఆయన మాట్లాడుతూ ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లోకార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌరపవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు.

జపాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థ నిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీస్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు. పునరుత్పాదక శక్తితో పాటు ఎల్ఎన్‌జీ ఆధారిత విద్యుత్ పరివర్తన, గ్రిడ్‌బ్యాలెన్సింగ్ పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి వచ్చేవారిని అతిథుల్లా చూస్తున్నాం. వారిని గౌరవిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తాం. అభివృద్ధి ఏ ఒక్కరికో పరిమితం కారాదు. అందరూ భాగస్వాములు కావాలి. ఈ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం వన్ ఫ్యామిలీవన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానానికి శ్రీకారం చుట్టిందని వివరించారు.

# స్కానింగ్ సెంటర్‌లపై తనిఖీలు తప్పనిసరి: కలెక్టర్





నెల్లూరు కలెక్టరేట్, జనవరి 21 ప్రభాతవార్త: జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లపై సంబంధిత శాఖ అధికారులు తరచూ తనిఖీ చేసి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కలెక్టర్ వారి చాంబర్లో జిల్లా కలెక్టర్, చైర్మన్ జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ వారి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కలెక్టర్ శుక్ల మాట్లాడుతూ గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కానింగ్ సెంటర్ల విషయంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించా లన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్లు, రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించి మూడు స్కానింగ్ సెంటర్లకు అదేవిధంగా పర్మిషన్ మోడిఫికేషన్ సంబంధించి ఏడు స్కానింగ్ సెంటర్‌లకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా అసిస్టెంట్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (సాంకే తిక సహాయ పునరుత్పాదన సెంటర్లు)కి సంబంధించి మూడు సెంటర్లకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, పోలీసు శాఖ నుంచి టీవీ సుబ్బారావు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి కవిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆట

# టాటా స్టీల్ చెస్: ప్రజ్ఞానందతో గుకేశ్ డ్రా



**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026, రౌండ్ 4లో భారత్ గ్రాండ్ మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానానంద మధ్య మ్యాచ్ డ్రా అయింది. అలాగే భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ కూడా నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై డ్రాతో సరిపెట్టుకున్నాడు. గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞాన్ నాల్గవ రౌండ్‌లో తన రెండో డ్రాను స్వదేశీయుడు దొమ్మరాజుతో గుకేష్ ఆడాడు. బ్లాక్ పావులు కలిగి ఉన్న గ్రాండ్ మాస్టర్ అర్జున్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై 80-మూవ్‌ల గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీనివల్ల అతను ఉమ్మడి ఆధిక్యం నుండి కిందికి దిగజారాడు. అర్జున్ ఇప్పుడు 4ఆటల నుండి 2.5 పాయింట్లతో ఇద్దరుఉమ్మడి గ్రాండ్ మాస్టర్లు నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్) మరియు హాన్స్ నీమాన్ (అమెరికా) కంటే అర పాయింట్ వెనుకబడి ఉన్నాడు. ఇదే సమయంలో డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానంద తన నాలుగు ఆటలలో కేవలం 1 పాయింట్‌తో అనిష్‌తో పాటు పట్టికలో దిగువన వెనుకబడి ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ అరవింద్ చితంబరం ఈ టోర్నమెంట్‌లో తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. హాన్స్ నీమాన్ చేతిలో ఓడిపోయాడు. దీంతో అతడు పాయింట్ల పట్టికలో 1.5 పాయింట్లతో సంయుక్తంగా 10వ స్థానానికి పడిపోయాడు. నేడు జరిగే 5వ రౌండ్‌లో అతను జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో తలపడనున్నాడు. అదే సమయంలో, గుకేష్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన థాయ్ డై వాన్ న్గుయెన్‌తో, అర్జున్ స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్‌పై తలపడనున్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ విజయం



**న్యూఢిల్లీ:** పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లో భారత్ షట్లర్ యుకీ భాంబ్రీ, తన స్వీడిష్ భాగస్వామి ఆండ్రీ గోరాన్సన్‌తో కలిసి 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సునాయాస విజయంతో ప్రారంభించారు. మెల్‌బోర్న్ పార్క్‌లోని కోర్ట్ 13లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 10వ సీడ్ జంట జేమ్స్ డక్‌వర్త్ మరియు క్రజ్ హెవిట్‌ల స్వదేశీ జోడీపై 6-3, 6-4 తేడాతో వరుస సెట్‌లతో విజయం సాధించింది. యుకీ-గోరాన్సన్ జోడీ మొదటి సర్వ్‌లోనే 95 శాతం విజయ రేటును నమోదు చేశారు. 5 సర్వీస్ గేమ్‌లలో 4 గెలిచారు (40-0). మొదటి సెట్‌లో మూడు బ్రేక్ పాయింట్లను సాధించి, గేమ్9లో వాటిలో ఒకదాన్ని గోల్‌గా మార్చుకుని 6-3తో సెట్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ సెట్‌లో కూడా మొదటి నాలుగు సర్వ్ గేమ్‌లను లవ్‌పై గెలవగా (40-0) ఇందులో 4 ఏస్‌లు కూడా ఉన్నాయి. 7వ గేమ్‌లో ఇండోస్వీడిష్ ద్వయం జేమ్స్ డక్‌వర్త్ సర్వీస్‌పై సెట్‌లో తొలి బ్రేక్‌ను పొందారు. 10 పాయింట్ల డ్యూస్ గేమ్ ఆడినప్పటికీ మనుగడ సాగించలేకపోయాడు. ఆ తర్వాత, మ్యాచ్ చివరి గేమ్‌లో, గోరాన్సన్ ద్వయం తన సర్వీస్‌ను 40-15తో సులభంగా మలిచి సెట్‌ను గెలుచుకుని రెండవ రౌండ్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నారు.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ముంబయి ఇండియన్స్ ఔట్

## ఫైనల్‌కు చేరడంపై సందిగ్ధం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026, సీజన్ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఐదు జట్లు దాదాపు ఐదేసి లీగ్ మ్యాచ్‌లు ఆడాయి. ఈ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పాయింట్స్ టేబుల్‌లో 10 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఈ జట్టు నెట్ రన్ రేటు +1.882గా ఉంది. ఇక ఆరు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి ముంబై ఇండియన్స్ మెరుగైన +0.046 రన్‌రేట్‌తో 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. యూపీ వారియర్స్ ఆడిన ఐదు మ్యాచ్‌లో రెండు గెలిచి-0.483 నెట్‌రన్ రేట్‌తో



మూడో స్థానంలోను, ఢిల్లీ క్యాపిటల్స్ ఐదు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి -0.586 నెట్‌రన్ రేట్‌తో 4 పాయింట్లతో నాల్గో స్థానంలోను, గుజరాత్ జెయింట్స్ రెండు గెలుపొంది -0864 నెట్‌రన్ రేట్ కలిగి నాల్గు పాయింట్లతో చిట్టచివరిన ఐదో స్థానంలో ఉంది. దాంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూపీఎల్ రూల్స్ ప్రకారం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో టాప్3లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచే జట్టు నేరుగా ఫైనల్ చేరనుండగా, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తోంది. ప్రస్తుతం ఆరు మ్యాచ్‌ల్లో రెండేసి విజయాలతో రెండో స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లకు రెండూ గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 8 పాయింట్స్ చేరుతాయి. దీంతో యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం అవుతుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి మాత్రమే గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరడం కష్టం. అద్భుతం జరిగితే తప్పా ఇది సాధ్యం కాదు. ఎందుకంటే ముంబై ఇండియన్స్ చివరి రెండు మ్యాచ్‌లకు మూడు గెలిచినా గరిష్టంగా 8 పాయింట్లు మాత్రమే సాధించగలదు. ఆర్‌సీబీ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ జట్టు తమ చివరి మూడు మ్యాచ్‌లకు మూడింటిని ఘోరంగా ఓడిపోవడంతో పాటు ముంబై ఇండియన్స్ మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. ఇతర జట్లు కూడా 10 పాయింట్స్ సాధించవద్దు. అప్పుడే ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరగలదు. ఇలా జరగడం అసాధ్యం. ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకొని ఎలిమినేటర్‌లో విజయం సాధిస్తేనే ముంబైకి ఫైనల్ బెర్త్ దక్కుతుంది.



# ప్రో రెజ్లింగ్ లీగ్‌లో ముంబయిపై పంజాబ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026లో 3-1 తేడాతో వెనుకబడి ఉన్న పంజాబ్ రాయల్స్ 6వ రోజు నాటకీయమైన మ్యాచ్‌లో అద్భుతమైన పునరాగమనం చేసి ముంబై దంగల్స్‌పై 6-3 తేడాతో విజయం సాధించింది. మహిళల 57 కిలోల పోటీలో కీలక మలుపు చోటు చేసుకుంది. అక్కడ రజనీత జాంగ్రా పతనంతో టైను సమం చేసింది. 74 కిలోల పోటీలో చంద్రమోహన్ గెలుపుతో పంజాబ్ ఊపందుకోగా, ఆ తర్వాత మీనాక్షి ఆధిపత్య విజయంతో మ్యాచ్‌ను ముగించింది. పంజాబ్ వరుసగా ఐదు బౌట్‌లను గెలిచిన నిర్ణయాత్మక ఆటను పూర్తి చేసింది. పంజాబ్ తరపున ఆడిన నలుగురు మహిళా రెజ్లర్లు విజేతలుగా నిలిచారు. 86 కిలోల పురుషుల బౌట్‌లో ముంబైలో టైగర్స్ ముకుల్ దహియా ద్వారా మొదటగా గోల్ చేశాడు. 62 కిలోల మహిళల పోటీలో పంజాబ్‌కు చెందిన కామన్వెల్త్ రజత పతక విజేత అనా గొడినెజ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 65 కిలోల పురుషుల విభాగంలో రోహిత్ రాహల్ వరుస టేక్‌డౌన్‌లతో ఆధిపత్యం చెలాయించినా తర్వాత బెలారస్‌కు చెందిన ఇస్లాం గుసేనోవ్‌పై ఓటమిచెందాడు. 57 కిలోల పురుషుల విభాగంలో కెప్టెన్ పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ చిరాగ్ చికారాను 17-7తో ఓడించి టైగర్స్‌ను 3-1తో ఆధిక్యంలో నిలిపాడు. 76 కిలోల మహిళల విభాగంలో ప్రియా మాలిక్ ప్రత్యర్థి జ్యోతి బెర్వాల్‌ను 10-0తో కమాండింగ్ షట్‌అవుట్ చేసి పంజాబ్‌ను పోటీలో దృఢంగా ఉంచింది. మహిళల 57 కిలోల విభాగంలో జాతీయ ఛాంపియన్ రజనితా జాంగ్రా ప్రారంభంలోనే టేక్‌డౌన్‌తో కొట్టింది, పీరియడ్ 2లో మరో టేక్‌డౌన్ మరియు టర్న్అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌తో స్కోరును 3-3గా చేసి నిర్ణయాత్మకంగా మార్చింది. 74 కిలోల పురుషుల విభాగంలో చంద్రమోహన్ ద్వారా పంజాబ్ తొలిసారిగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అతడు 15-9 తేడాతో విజయం సాధించి పంజాబ్‌ను 4-3తో ఆధిక్యంలో ఉంచాడు.

## ఇండోనేసియా మాస్టర్స్‌లో..

# మెయిన్ డ్రాకు అన్మోల్, ఆకర్షి

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా మాస్టర్స్-2026 తొలి రౌండ్‌లో స్టార్ ఇండియన్ షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ పోరాట విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో జపాన్‌కు చెందిన మనామి సుయిజుపై 22-20, 21-28 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించడానికి ముందు సింధు నాలుగు గేమ్ పాయింట్లను కాపాడుకుంది. అలాగే 72 నిమిషాల మారథాన్ ఆట తర్వాత శ్రీకాంత్ 21-15, 21-13, 24-22 తేడాతో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జపనీస్ షట్లర్ కోకి వటనాబేపైను నిర్ణయాత్మక ఆటలో అధిగమించాడు. తర్వాత లక్ష్య సేన్, అన్మోల్ ఖర్బ్ కూడా తమ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించారు. వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. లక్ష్య 21-13, 16-21, 21-14 తేడాతో చైనీస్ తైపీకి చెందిన వాంగ్ త్జు వీని ఓడించగా, అన్మోల్ 21-16, 21-17 తేడాతో పాయ్





యు పోపై విజయం సాధించాడు. అలాగే కిరణ్ జార్జ్, ఆకర్షి కశ్యప్ తమ తమ విభాగాలలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. కిరణ్ మోహ్ జాకి ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో 17-21, 14-21 తేడాతో ఓడిపోగా, ఆకర్షి రెండు మ్యాచ్ పాయింట్లను కోల్పోయి జూలీ జాకోబ్సెన్ (డెన్మార్క్) చేతిలో 21-8, 20-22, 17-21 తేడాతో, హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా మొదటి రౌండ్‌లో 19-21, 11-21 తేడాతో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత లీ జియ్ జియా (మలేషియా) చేతిలో ఓడిపోయారు. ధ్రువ్‌తనీషా వరుసగా మూడోసారి ఇస్టోరా సెనాయన్‌లో జరిగిన మరో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. భారత అగ్రశ్రేణి మిక్స్‌డ్ డబుల్స్ జంట ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టోల పేలవమైన ఫామ్ కొనసాగింది. తొలి రౌండ్‌లో ఈ జంట 21-23, 22-20, 21-6 తేడాతో దిగువ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ జంట జూలియన్ మాజో-లియా పలెర్మో చేతిలో ఓటమి ఎదుర్కొంది. దీంతో, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ప్రచారం ముగిసింది.

# మార్కెట్లకు తప్పని వరుస నష్టాలు

**ముంబయి, జనవరి 21:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా నష్టాల బాటలోనే పయనిస్తున్నాయి. బుధవారం బిఎస్ఇ ఒక మోస్తరునష్టాలు చవిచూసింది. సెన్సెక్స్ 270.84 పాయింట్లు, నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 81,794.65 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమైంది. ఒక దశలో 81,124.45 పాయింట్ల కనిష్టాన్ని చేరుకుంది. చివరకు 270.84 పాయింట్ల నష్టంతో 81,909.63 వద్ద ముగిసింది. నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి, 25,157.50 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల ధోరణులు, భౌగోళిక ఉద్రిక్తతలు, మార్కెట్ అనిశ్చితి వంటివి సెంటిమెంట్ ను దెబ్బతీయడంతో స్టాక్ మార్కెట్ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ట్రెంట్, బిఇఎల్ ఎక్కువగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఇండిగో, ఎటెర్నల్ వంటి సంస్థలు లాభాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి



విలువ మరింత తగ్గింది. అత్యల్ప కనిష్ట స్థాయి 91.73కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 64.33 వద్ద కొనసాగింది. బంగారం ధర ఔన్సుకు 4,862 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు భారతీయ మార్కెట్లో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. బుధవారం హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.53లక్షల వరకు చేరింది. ఇది అంతకుముందు రోజుతో పోలిస్తే రూ.9,000 అదనం. అంటే ఒక్కరోజులోనే తొమ్మిది వేల రూపాయలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42 లక్షలు గా ఉంది. వెండి కిలో ధర రూ.3.30లక్షలకు పైగానే ట్రేడవుతోంది. బిఎస్ఇలో 1437 కంపెనీలు పెరిగితే 2831 కంపెనీలషేర్లు క్షీణించాయి. మరో 142 కంపెనీల షేర్లుమాత్రం స్థిరంగానే కొనసాగాయి. ఇక బిఎస్ఇ ఎఇడ్‌క్యాప్ కూడా 1.01శాతం, స్మాల్‌క్యాప్ సూచీ కూడా 0.80శాతం పతనం చెందాయి.

# ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం, వెండి

**ముంబయి, జనవరి 21:** దేశీయ మార్కెట్లో బంగారం ధర సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. బుధవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో పసిడి ఫ్యూచర్స్ ధర మునుపెన్నడూ లేనంత గరిష్ఠస్థాయికి చేరింది. అమెరికా యూరప్ మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతుందన్న భయాలు, డాలర్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా 4.25శాతం (సుమారు రూ. 4,100) పెరిగి 10 గ్రాములకు రూ.1,56,970 వద్ద సరికొత్త ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. ఎంసీఎక్స్ మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ ధర 2.71శాతం పెరిగి కిలోకు రూ. 3,32,451కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. కామెక్స్‌లో ఔన్స్



బంగారం ధర 4,849 డాలర్లకు చేరింది. ఫిబ్రవరి 1 నుంచి ఎనిమిది యూరోపియన్ దేశాలపై అమెరికా సుంకాలు విధించనుంది, జూన్‌లో ఈ సుంకాలను 25 శాతానికి పెంచవచ్చని వచ్చిన నివేదికలు ఈ ర్యాలీకి తోడయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలగా, ఇన్వెస్టర్లు బంగారం, వెండి వైపు మళ్లారని పృథ్విఫిన్‌మార్ట్ కమోడిటీ రీసెర్చ్ విశ్లేషకులు మనోజ్ కుమార్ జైన్ తెలిపారు. దీనికి తోడు రూపాయి బలహీనపడటం కూడా దేశీయంగా ధరల పెరుగుదలకు మద్దతునిస్తోంది. సోలార్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎఐ వంటి రంగాల నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ బలంగా ఉండటంతో దీర్ఘకాలంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న నెలల్లో ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.3.50 లక్షల స్థాయికి చేరవచ్చని భావిస్తున్నారు.


# రికార్డుస్థాయి కనిష్టానికి రూపాయి

## డాలర్ వర్సెస్ రూపాయి 91.74



**ముంబయి, జనవరి 21:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్‌టైమ్ కనిష్టానికి చేరాయి. అంతర్జాతీయ కరెన్సీ మార్పిడికౌంటర్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 91.74 వద్ద ముగిసాయి. ఇప్పటివరకూ ఇదే అత్యంత కనిష్టస్థాయి అని తెలుస్తోంది. అమెరికా వాణిజ్య ఒప్పందంలో జాప్యం విదేశీ ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి ఎక్కువ పెట్టుబడులు విత్‌డ్రాచేయడం, అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య, రాజకీయ ఉద్రిక్తతలు కూడారూపాయి పతనానికి కారణంగా తెలుస్తోంది. డిసెంబరులో ఒకపర్యాయం రూపాయి 91 మార్కుకు చేరి ఆ తర్వాత రికవరీ అయింది. తిరిగి మళ్లీ బుధవారం రోజున ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. అత్యంత క్షీణత దశలో 91.08 వద్దప్రారంభం అయి రానురాను మరింత క్షీణించింది. కరెన్సీ వరుసగా ఆరోరోజు కూడా క్షీణించింది. ఎక్కువగా అమెరికా ట్రంప్ వైఖరి రూపాయీ క్షీణతను మరింత పెంచుతోంది. 2024లో రూపాయి 4.95శాతం క్షీణించింది. టర్కి లీరా, అర్జెంటీనా పెసో కరెన్సీలు కూడా సుమారు 50శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.36వేల కోట్లకుపైగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. గత ఏడాది కూడా మార్కెట్లనుంచి సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి. వీటివల్లకూడా డాలర్ డిమాండ్‌పెరిగింది. దీనివల్ల దేశీయ కరెన్సీపై ఒత్తిడిపెరిగింది.

# జొమాటో మాతృసంస్థ సిఇఒ రాజీనామా



**ముంబయి, జనవరి 21:** ప్రముఖ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో మాతృ సంస్థ అయిన ఎటెర్నల్‌లో కీలకమార్పులు జరిగాయి. కంపెనీ మూడవ త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో పాటు, యాజమాన్య నిర్మాణంలో పెను మార్పులను చేపట్టింది. సంస్థ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ సిఇఒ పదవి నుంచి తప్పుకోవడం ఇప్పుడు కార్పొరేట్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎటెర్నల్ గ్రూప్ సిఇఒగా ఉన్న దీపిందర్ గోయల్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన కంపెనీ నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. భవిష్యత్తులో కంపెనీకి సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగస్వామిగాఉంటూ, బోర్డు డైరెక్టర్‌గా, వైస్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. కొత్త, అధిక రిస్క్ కలిగిన ప్రాజెక్టులపై దృష్టి పెట్టడానికే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. దీపిందర్ గోయల్ స్థానంలో బ్లింకిట్ సిఇఒ అల్బీందర్ సింగ్ దిండ్సా ఎటెర్నల్ గ్రూప్ కొత్త సిఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్లింకిట్‌ను క్విక్ కామర్స్ రంగంలో తిరుగులేని శక్తిగా మార్చడంలో అల్బీందర్ చూపిన ప్రతిభను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టారు. ఫిబ్రవరి 1, 2026 నుండి ఆయన ఈ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. యాజమాన్య మార్పుల వేళ కంపెనీ అద్భుతమైన ఆర్థిక ఫలితాలను సాధించింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.102 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 59 కోట్లతో పోలిస్తే ఇది 73 శాతం వృద్ధి సాధించింది. గత ఏడాది రూ.5,405 కోట్లుగా ఉన్న రాబడులు, ఏకంగా 202 శాతం వృద్ధి చెంది రూ. 16,315 కోట్లకు చేరుకుంది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్ బ్లింకిట్ కీలక పాత్ర పోషించింది. బ్లింకిట్ తన నిర్వహణలో బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పట్టడం కంపెనీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అల్బీందర్ సింగ్ దిండ్సా నాయకత్వంలో బ్లింకిట్ సాధించిన ఈ విజయమే ఆయనను గ్రూప్ సిఇఒ స్థాయికి చేర్చిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# టెక్ దిగ్గజం మెటాలో భారీ లేఆఫ్‌లు




**సియాటెల్, జనవరి 21:** టెక్ దిగ్గజం మెటాలో ఉద్యోగుల కోతలు కొనసాగుతున్నాయి. తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన మెటావర్స్, వర్చువల్ రియాలిటీ విభాగాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ భారీ లేఆఫ్స్‌కు శ్రీకారంచుట్టారు. దాదాపు 15,000 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు. ఇప్పటివరకు మెటావర్స్ కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను మెటా కుమ్మరించింది. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు తగినట్లుగా కొనసాగుతోంది. వీఆర్ హెడ్‌సెట్ల కంటే ఎఐ ఆధారిత స్మార్ట్ గ్లాసెస్, వేరబుల్ గ్యాడ్జెట్లపై పెట్టుబడి పెట్టడం మేలని భావించిన మెటా అందుకు అనుగుణంగానే ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ లేఆఫ్స్ నిర్ణయంపై ఓకులస్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 2017లో కొన్ని వివాదాల కారణంగా జుకర్‌బర్గ్ చేత తొలగించబడ్డ పామర్ ఇప్పుడు అదే జుకర్‌బర్గ్ నిర్ణయాన్ని సమర్థించారు. రెండేళ్లుగా మెటా వరుసగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది. తాజా లేఆఫ్స్‌తో రియాలిటీ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తొలగింపునకు గురైన వారికి మెటా తన ప్యాకేజీ నిబంధనల ప్రకారం పరిహారం అందజేయనుంది.

వాణిజ్యం




## టిసిఎల్‌తో సోనీ టైఅప్..

# కొత్త జాయింట్ వెంచర్

**ముంబయి, జనవరి 21:** హోం ఎంటర్‌టైన్‌మెంట్‌లో దిగ్గజంగా ఉన్న సోనీ ఇతర కంపెనీలతో భాగస్వామి అవుతోంది. ఎలక్ట్రానిక్స్ కంపెనీలు సోనీ, టిసిఎల్ భాగస్వామ్యం దిశగా ముందడుగు వేశాయి. ఈ మేరకు రెండు కంపెనీలు ఎంఒయులపై సంతకాలు చేశాయి. సోనీ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని నిర్వహించేలా ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు అవుతుంది. ప్రతిపాదిత నిర్మాణంలో టిసిఎల్‌కు 51 శాతం వాటా, సోనీకి 49 శాతం వాటా ఉంటుంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని రెండు సంస్థలు స్పష్టం చేశాయి. ఈ చర్చలు తుది దశకు చేరితే కొత్త జాయింట్ వెంచర్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఉత్పత్తుల డిజైన్, డెవలప్మెంట్ నుంచి తయారీ, విక్రయాలు, లాజిస్టిక్స్, కస్టమర్ సర్వీస్ వరకు హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ మొత్తం చైన్‌ను జెవీ చూస్తుంది. టెలివిజన్లు, హోమ్ ఆడియో ఉత్పత్తులు ప్రధానంగా ఉంటాయి. రెండు కంపెనీలు 2026 మార్చి చివరికి బైండింగ్ ఒప్పందాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాయి. అవసరమైన అనుమతులు లభిస్తే 2027 ఏప్రిల్‌లో కొత్త సంస్థ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్‌పై అభిరుచులు పెరుగుతుండటం ఈ భాగస్వామ్యానికి కీలక కారణంగా మారింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, వీడియో షేరింగ్ యాప్స్, స్మార్ట్ టీవీ ఫీచర్లు, అధిక రిజల్యూషన్ డిస్‌ప్లేలు వినియోగదారుల అలవాట్లను మారుస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తూనే, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ పెంచడమే ఈ జాయింట్ వెంచర్ లక్ష్యం.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# వాడివేడిగా జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ బడ్జెట్ సమావేశం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 21 (ప్రభాతవార్త): కాకినాడ జీఎంసీ బాలయోగి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు అధ్యక్షతన ప్రారంభమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్తు బడ్జెట్, సాధారణ సర్వసభ్య, స్థాయి సంఘాల సమావేశం వాడి వేడిగా జరిగింది. సమావేశానికి ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్య నారాయణ, పేరా బత్తుల రాజశేఖరం హాజరయ్యారు. సభకు తొలిసారి విచ్చేసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వర రాజు వర్మ, డీసీఎంఎస్ చైర్మన్ పి.చంద్రమౌళి లను జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు సభకు పరిచయం చేశారు. అనంతరం సభలో అధికార పక్షం ప్రతిపక్షం మధ్య చర్చ వాడివేడిగా కొనసాగింది. సభ ప్రారంభం ముందే మహిళా జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారుగా వైసీపీ పార్టీకి చెందిన మహిళా జడ్పీటీసీలు అందరూ ఏకతాటిపై ముక్తకంఠంతో అధికార పక్షానికి తూట్లు పొడిచే విధంగా సమస్యల బాణాలను సంధించారు. మండలంలో ఏ వేదమైన అభివృద్ధి పనులకు నోచుకోకపోవడంతో కొన్ని మండలాల్లో ప్రోటోకాల్ సైతం అధికారులు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఇసుక సీనరేజ్, స్టాంప్ డ్యూటీ జిల్లా పరిషత్‌కి రావాల్సింది అని వాటిపై తక్షణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని అంతేకాక రిలయన్స్ ఓఎన్జిసి వేదాంత వంటి ఆయిల్ కంపెనీలు సుమారు 500 కోట్ల రూపాయలు జిల్లా పరిషత్ కు చెల్లించాల్సి ఉందని వాటిని వసూలు చేసి జడ్పీటీసీ సభ్యుల ద్వారా ఆయా మండలాలకు నిధులు కేటాయించినట్లయితే జడ్పీటీసీ లకు విలువ పెరుగుతుందని సభాధ్యక్షుల దృష్టికి తీసుకువచ్చారు. 2025–26 సంవత్సరానికి 43 లక్షల మిగులుతో 1019 కోట్ల సవరణ బడ్జెట్ ను, 2026–27 సంవత్సరానికి 45 లక్షల మిగులుతో 2712 కోట్ల 65 లక్షల అంచనా బడ్జెట్ ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఆమోదించింది. 2025–26 సవరణ బడ్జెట్ లో షెడ్యూల్ కులాల సంక్షేమానికి 249 లక్షలు, షెడ్యూల్ తెగల సంక్షేమానికి 99 లక్షలు, స్త్రీ శిశు సంక్షేమానికి 249 లక్షలు, త్రాగు నీటి సరఫరాకు 199 లక్షలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశు సంవర్ధన, సాంఘిక సంక్షేమానికి 165 లక్షలు, అభివృద్ధికి 381 లక్షల నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమం లో జెడ్పీ ఉపాధ్యక్షులు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత; కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల రెవిన్యూ అధికారులు జె.వెంకటరావు, టి.సీతారామ మూర్తి, జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణ రావు,జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.






తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | గురువారం 22 జనవరి 2026 | I


## కూటమి అధికారం.. అభివృద్ధి పరుగులు

**ఈతకోట బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ 2.90కోట్ల నిధులు మంజూరు : కొత్తపేట ఎమ్మెల్యే బండారు**



కొత్తపేట, జనవరి 21,(ప్రభాతవార్త) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతుందని మౌలిక సదుపాయాల కల్పన మీద అధికారం ప్రభుత్వం దృష్టి సారించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు ఈతకోట వద్ద గోరింకల డ్రైన్ పై నాలుగు లైన్ల రహదారి తో కూడిన బ్రిడ్జ్ పునర్నిర్మాణానికి రూ 2.90కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు నిధులు మంజూరు చేసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే బండారు కృతజ్ఞతలు తెలియజేశారు త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే తెలియజేశారు ఈ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయని దేవరపల్లి వైపు భారీ వాహనాలు వెళ్లడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఆయన అన్నారు ఈతకోట నుంచి వయా దేవరపల్లి మీదుగా కొత్తపేట రావడానికి వాహనదారులకు ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు

## ఫిబ్రవరి 1న జ్యోతుల ప్రమాణ స్వీకారం



జగ్గంపేట జనవరి 21(ప్రభాతవార్త) ఫిబ్రవరి ఒకటో తేదీన కాకినాడలో జరిగే జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట టిడిపి కార్యాలయంలో జగ్గంపేటమండల అధ్యక్షులు జీను మణిబాబు అధ్యక్షతన జరిగిన జగ్గంపేట నియోజకవర్గం టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జిల్లా టిడిపి అధ్యక్షుడిగా ఫిబ్రవరి ఒకటో తేదీన కాకినాడలో నవీన్ ప్రమాణస్వీకారం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి జగ్గంపేట నుండి వేలాది మోటార్ సైకిల్, కార్లు బస్సుల్లో ర్యాలీగా వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత రాజకీయాలలో నేను రిటైర్ అవుతాం అనుకున్నాను. కానీ రిటైర్ అవ్వను జగ్గంపేట నియోజకవర్గం నుండి నవీన్ పోటీ చేస్తాడు నేను ఏదో ఒక నియోజకవర్గ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తాను అని అన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నన్ను జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమించినందుకు కావడానికి నియోజకవర్గం కార్యకర్తలు, జిల్లావ్యాప్తంగా అందరూ సహకరించారని మీ అందరి సహకారంతో నేను మళ్ళీ ఈ పదవి చేపట్టానని మన నియోజకవర్గం జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని ఈ ప్రమాణస్వీకారం మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## లావేటి, బొరుసు కుటుంబాలను పరామర్శించిన మాజీమంత్రి



కడియం ,జనవరి 21 (ప్రభాతవార్త) కడియం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో మరణించిన పార్టీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి, వై.సి.పి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మరియు రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మాజీ ఎంపీ భరత్ రామ్ బుధవారం పరామర్శించారు.కడియం ఓ కడియపులంక గ్రామాల్లో ఇటీవల మరణించిన లావేటి వైకుంఠం, బొరుసు అప్పారావు, బొరుసు వెంకట లక్ష్మి ,అడపా అచ్యియ్య,బొమ్మిరెడ్డి గంగారత్నం (తల్లమ్మ),చీలుకూరి బాపాయమ్మ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కడియం మండలం, నాయకులు తాడి గోపాలం,సర్పంచ్ బాషా,చెల్లుబోయిన దుర్గ ప్రసాద్,చీలుకూరి రామకృష్ణ,గుత్తుల రమేష్, లావేటి రాధాకృష్ణ, గుత్తుల అబ్బులు,వనుశే పుత్రయ్య, అర్గనేని మూర్తి, బండారు శ్రీనివాస్,పూడి వీర బ్రహ్మం, సాల సతీష్, పాల్గొన్నారు.

## పెన్నల పండుగ కార్యక్రమానికి ఏర్పాట్లు




అయినవిల్లి జనవరి 21 (ప్రభాతవార్త) ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి పెన్నుల పండుగ కార్యక్రమం ఈనెల 23 శు క్రవారం జరగనుంది ఈ కార్యక్రమంలో స్వామివారికి అనేక రకాల అభిషేక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు ఈ అభిషేకం చేసిన పెన్నులను పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పోటీపడి మరి దక్కించు కుంటారు. అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆల యానికి శుక్రవారం నిర్వహించే పెన్నుల పండుగ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు భక్తులు తరలి రానున్నందున సిబ్బంది ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు పరీక్షల ముందు ప్రతి సంవత్సరము లక్ష పెన్నులతో పూజలు నిర్వహించి ఉచితంగా అందించే కార్యక్రమం గత కొంతకాలంగా చేస్తున్నారు

## భార్యను కొట్టిన భర్తకు జైలు..

ప్రత్తిపాడు,జనవరి21(ప్రభాతవార్త) భార్యను కొట్టిన కేసులో భర్తకు 6 నెలలు జైలు శిక్ష రూ. 1000 జరిమానాను ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి ఎల్. గోపీనాథ్ తీర్పునిచ్చారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామం కోన రమణమ్మ ను భర్త కోన సూర్యారావు మద్యం సేవించి వచ్చి తనను కొట్టాడని ప్రత్తిపాడు పోలీసులకు 2016లో రమణమ్మ ఫిర్యాదు చేసిన అప్పటి ఎస్సై ఎం. నాగ దుర్గారావు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి గోపీనాథ్ కోన సూర్యారావుకు జైలు శిక్ష జరిమానా విధించారని ప్రత్తిపాడు ఎస్ఐ? లక్ష్మీకాంతం తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ ఎం. శివరామ కృష్ణ, కోర్టు నందు సాక్షులను ప్రవేశపెట్టి ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీలు పి.రవీంద్ర మోహన్, లక్ష్మీదేవి సాక్షుల తరఫున కోర్టులో వాదనలు వినిపించారు.

## సిఐఎస్ఎఫ్‌కి ఎంపికైన శశికిరణ్

కె.గంగవరం, జనవరి 21, (ప్రభాతవార్త): గంగవరం మండలం తాళ్లపూడి గ్రామపంచాయతీ నామాడి వారి పేటకు చెందిన ఇసుకపట్ల సత్యనారాయణ కుమారుడు ఇసుకపట్ల శశికిరణ్ సెంట్రల్ పోలీస్ సిఐఎస్ఎఫ్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కాటే సుబ్రమణ్యం తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన శశికిరణ్ కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించినందుకు గాను తను చదివిన ఆదర్శ అకాడమి చైర్మన్, గ్రామ ప్రజలు పూలమాలలతో సాల్వాలతో సత్కరించారు.

## 2029 ఎన్నికల్లో వైసిపికి అధికారం ఖాయం..

**నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు మురళి రాజు**



ప్రత్తిపాడు,జనవరి21(ప్రభాతవార్త) వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణ రాజు అన్నారు. తుణుకు నియోజకవర్గ వైసిపి సమన్వయ కమిటీ సమావేశం బుధవారం మాజీ మంత్రి, ఇంచార్జ్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్లమెంట్ పరిశీలకులు మురళి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలన మరో రెండు ఏళ్లలో ముగుస్తుందని ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వైసిపి శ్రేణులు అధైర్య పడాల్సిన పనిలేదని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వైసిపి వస్తుందని మురళి రాజు ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ బలమేంటో అధికార పార్టీకి వైసీపీ నాయకులు శ్రేణులు చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం తణుకు పట్టణం, రూరల్ లో అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ పార్టీ సెక్రటరీ వజ్జ విజయభాస్కర్ రెడ్డి,మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు,ఎంపీటీసీలు,ఎంపీటీసీలు,సర్పంచులు,వివిధ హోదాలో ఉన్న కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రాజముద్రతో పాసు పుస్తకాలు

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్.**



కాట్రేనికోన జనవరి 21(ప్రభాతవార్త) రీ సర్వే తరువాత రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ద్వారా రైతుల భూ హక్కులను బలోపేతం చేయడం జరిగిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం కాట్రేనికోన మండలం దొంతికుర్రు గ్రామపంచాయతీ లో జరిగిన రైతులకు రాజ ముద్రతో కూడిన పట్టాదార్ పాస పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ భూ యజమానులకు, భావితరాల వారికి వివాదరహిత భూములను అందించేందుకు శ్రీరామరక్ష అన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ వేగంగా పూర్తి చేయాలని అన్నారు. రీ సర్వే తప్పులను సరిచేసి రాజముద్రతో కూడిన కొత్త పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. రైతులందరూ గ్రామసభలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. రైతులకు భూ వివాదాల లేకుండా చేయడం ప్రభుత్వం యొక్క కర్తవ్యం అన్నారు. ఈకేవైసీ పూర్తి చేసి క్యూ ఆర్ కోడ్ లతో కొత్త పాత పుస్తకాలు జారీ చేస్తామన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో గ్రామసభల ద్వారా ప్రతినెల మొదటి వారంలో పంపిణీ జరుగుతుంది అన్నారు. రీ సర్వే ప్రక్రియను విజయవంతముగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం రెవెన్యూడివిజనల్ ఆఫీసర్ కే మాధవి మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూ సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలు కూడా నమోదు చేపడతాయని అన్నారు. దీనివల్ల భూ వివాదాలకు తావు లేకుండాలేకుండా రైతులకు తమ భూములపై సంపూర్ణ హక్కులు ఉంటాయని అన్నారు. భూ యజమానులకు తమ పట్టాదారు పాసుపుస్తకాల లో వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవి కిరణ్, ఎంపీడీఓ రాజేశ్వరరావు, నాగిని నాగేశ్వరరావు, సర్పంచ్ ఈశ్వరి రెవెన్యూఇన్స్పెక్టర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు అరుదైన గౌరవం



రామచంద్రపురం,జనవరి 21,(ప్రభాతవార్త): సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కు అరుదైన గౌరవం దక్కింది.జనవరి 26 రిపబ్లిక్ డే గణతంత్ర దినోత్సవం ను పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ లోక్ భవన్లో అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానం అందింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ద్వారా వాసంశెట్టి సత్యం కు ఆహ్వానం అందింది.సమాజానికి వివిధ రూపాల్లో సామాజిక సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానించడం పరిపాటి. రామచంద్రపురం నియోజకవర్గంలో,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ నిర్మూలన కోసం జాబ్ మేళాలు నిర్వహించడం,మహిళా సాధికారత దిశగా పలువృత్తి నైపుణ్య శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పించడం, నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివించడం, వృద్ధులు,వికలాంగులకు ఆర్థిక సహాయం అందించడం, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్తదాన శిబిరాలు,మెడికల్ క్యాంపులు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సంగతి తెలిసిందే.ఎట్ హోం కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం అందుకున్న వాసంశెట్టి సత్యం కు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అభినందనలు తెలియజేశారు.

## ఆనందోత్సాహలతో బీబీ జైనబ్ జయంతి




మామిడికుదురు.జనవరి 21(ప్రభాతవార్త) ముస్లిం మతస్తుల ఆరాధ్యదైవం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ సోదరి షహజాదీ బీబీ జైనబ్ జయంతిని నగరం, మామిడికుదురు, మొగలికుదురు గ్రామాలకు చెందిన ముస్లింలు బుధవారం ఆనందో త్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మంజిల్ కర్బలా పంజాలో ఖాసిం మొహమ్మద్ రజా(రజ్జు)ఆధ్వర్యంలో మిలాద్ జరిగింది. ఈ మిలాద్ లో పలువురు కవులతో పాటు స్థానికులు ఖసీదాలు ఆలపించారు. మత ప్రబోధకులు మౌలానా సయ్యద్ అబ్బాస్ బాఖరి షహజాదీ బీబీ జైనబ్ జయంతి విషయాలను భక్తులకు వివరించారు. మిలాద్ అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని జయంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ఈ పంట నమోదు తప్పనిసరి

కె. గంగవరం, జనవరి 21, (ప్రభాతవార్త): గంగవరం మండలంలోని పేకేరు, బాలాంత్రం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏవో సద్గురు మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ డి ఎ బి.నాగ కుమార్ హాజరై సమతుల్య ఎరువుల వాడకం ద్వారా, దీడిపడిల వృద్ధి తగ్గి, అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. ఫిబ్రవరి 20వ తారీకు ప్రతి రైతు రబీ ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు.ఈ కార్యక్రమంలో వి ఏ ఏ సత్యనారాయణ ,సాయిశ్రీ ,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## కామేశ్వర్‌కి మరోసారి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు



అమలాపురం,జనవరి21,(ప్రభాతవార్త) అమలాపురం పట్టణం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ మరో అరుదైన ఘనతను సాధించారు. భారతదేశంలో వివిధ సందర్భాల్లో విడుదలైన 75 రూపాయల నాణేల సేకరణకు గాను ఆయనకు ప్రతిష్టాత్మక 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు లభించింది. భారత ప్రభుత్వం ఇప్పటివరకు వివిధ చారిత్రక ఘట్టాలు, ప్రముఖుల స్మారకార్థం విడుదల చేసిన మొత్తం 14 రకాల 75 రూపాయల నాణేలను సేకరించినందుకు గాను కామేశ్వర్?ను ఈ పురస్కారం వరించింది. భారతదేశంలో విడుదలైన అన్ని రకాల 75 రూపాయల నాణేలు ఒకే సేకరణలో ఉండటం విశేషం. కృష్ణ కామేశ్వర్ లిమ్కా రికార్డును అందుకోవడం ఇది వరుసగా నాలుగో సంవత్సరం. గతంలో ఆయన వివిధ విభాగాల్లో తన ప్రతిభను చాటుకుని రికార్డులు సృష్టించారు:తపాలా బిళ్లల సేకరణలో రెండు పర్యాయాలు లిమ్కా రికార్డులు,నాణేల సేకరణలో ఒకటి,కరెన్సీ నోట్ల సేకరణలో మరో రికార్డును సాధించారు.తాజా రికార్డుతో కలిపి ఆయన ఖాతాలో మొత్తం ఐదు లిమ్కా రికార్డులు చేరాయి. ఒకే వ్యక్తి వివిధ రకాల సేకరణలలో వరుసగా రికార్డులు సాధించడం పట్ల స్థానికులు, సేకరణకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా కృష్ణ కామేశ్వర్ మాట్లాడుతూ, చిన్నతనం నుండి అలవడిన ఈ వ్యాసంగం తనకు గుర్తింపు తీసుకురావడం సంతోషంగా ఉందని, భవిష్యత్ తరాలకు మన దేశ చరిత్రను, సంస్కృతిని ఈ నాణేలు, స్టాంపుల ద్వారా తెలియజేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

## రికార్డు స్థాయిలో వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ. 2.05 కోట్లు..

**డిప్యూటీ కమీషనర్, నల్లం.**



ఆత్రేయపురం, జనవరి, 21,(ప్రభాతవార్త) కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి హుండీల ఆదాయం 34 రోజులకు రూ. 2,05,51,004/–కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఎం.వి. దుర్గ భవాని అసిస్టెంట్ కమీషనర్, దాక్షారామం దేవస్థానం. ఎస్. టి. వి. టి. శ్రీనివాస్,తనిఖీ అధికారి రాజమండ్రి, ఎం సత్యనారాయణ వేలిచేరు దేవస్థానం కార్యనిర్వాహణాధికారులు పర్యవేక్షణ అధికారులుగా బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టి నట్లు డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి హుండీ నుండి రికార్డు స్థాయిలో ఆదాయం లభించిందని. ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ. 1,46,7,768/– అన్న ప్రసాదం హుండీలు నుండి. రూ. 59,43,236/– లు మొత్తం హుండీల రూ. 2,05,51,004 లు సమకూరిందని తెలిపారు. అలాగే, బంగారం 26 గ్రాములు, వెండి ఒక కేజీ 200. గ్రాములు వచ్చింది . అలాగే 14 దేశాల లకు చెందిన 87 కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమం లో ధర్మకర్తల సభ్యులు పి. భవాని, సిహెచ్. సత్యనారాయణ, టి. సాయి ప్రసాద్, శిష్ట్ల సూర్య కుటుంబరావు, ఎం త్రిమూర్తులు, సూపరింటెండెంట్ పులవర్తి. రాంబాబు, వర్మ, మనోజ్, వై శ్రీనివాస్, కుమార్, సంతోశ్వరుడు,నారాయణ,ఏపుగంటి వెంకటేష్, గ్రామస్తులు,దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నానో యూరియా,డీఏపి లనే వినియోగించాలి.. ఏఓ ధర్మాప్రసాద్..

**అంబాజీపేట,జనవరి 21, (ప్రభాతవార్త):** వరి సాగులో నానో యూరియా,నానో డీఏపీలనే వినియోగించాలని మండల వ్యవసాయాధికారి కె.దర్మప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని చిరతపూడి పంచాయితీ కార్యాలయం వద్ద ఆత్మ సౌజన్యంతో సర్పంచ్ కోట బేబిరాణి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ధర్మ ప్రసాద్ నానో యూరియా, నానో డీఏపి వాడడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.అలాగే దాళ్వా వరి ఈ- పంట నమోదు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, నాయకులు,రైతులు అయ్యగారి సూరిబాబు,సరేళ్ల వెంకటేశ్వర్లు, బొడ్డు రాంబాబు, సానబోయిన అర్జునరావు, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, దారపురెడ్డి శ్రీనివాసరావు, సూరిశెట్టి సుబ్బారావు, సొసైటీ సీఈవో పెచ్చెట్టి నారాయణమూర్తి, వ్యవసాయ సిబ్బంది పి. జాబేస్ శాస్త్రి,బి.లలితారాణి తదితరులు పాల్గొన్నారు.

## పాళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద చండీ యాగం



**మామిడికుదురు.జనవరి 21(ప్రభాతవార్త)** మండల పరిధిలోని ఈదరాడ గ్రామ దేవత శ్రీ పాళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈనెల 29 నుంచి చండీయాగం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సాదనాల సుబ్బారావుతెలిపారు.దీనికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో బుధవారం విడుదల చేశారు.ఈనెల 29వ.తేదీ నుంచి 31 వ.తేదీ వరకు చండీయాగ మహోత్సవాలు జరుగుతాయన్నారు.గ్రామ శ్రేయస్సు పాడి పంటల వృద్ధి గ్రామాభివృద్ధి కోరుతూ విశ్వశాంతి,లోక కళ్యాణం కోరుతూ ఈ పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శైవాగమ బ్రహ్మ పూజ్యం జగన్నాధశర్మ ఆధ్వర్యంలో పూజ్యం విశ్వనాధశర్మ బ్రహ్మత్వంలో పూజలు జరుగుతాయన్నారు.ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ వారు కోరారు.

## ఎంఎంఆర్ ట్రస్ట్ నుండి ఆర్ధిక సాయం.. వైసీపీ నేత మురళీ కృష్ణం రాజు



**ప్రత్తిపాడు,జనవరి21(ప్రభాతవార్త)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కుండలేశ్వరపు నూకరాజు ఇటీవల కాలంలో స్వర్గస్తులయ్యారు. వారి కుటుంబాన్ని పరామర్శించిన మురళీ రాజు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. వారి కుటుంబ సభ్యులు నూకరాజుకు ఎం ఎం ఆర్ ట్రస్ట్ నుండి రూ.5 వేలు ఆర్ధికసాయం అందించారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ప్రతిపాడు నియోజకవర్గ వైసిపినేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకు లు ముదునూరి మురళి కృష్ణంరాజు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు, కుండలేశ్వరపు ఈశ్వరరావు, కుండలేశ్వరపు రమేష్, తుంపాల వీరబాబు, అల్లవరపు వెంకటేశ్వ రావు, సుందరపల్లి సత్తిబాబు, నానిపల్లి వెంకన్న, కుండలేశ్వరపు నాయకులు, పాల్గొన్నారు.

## బహుళ వికలాంగత్వం ఆప్షన్ను వెంటనే సదరం వెబ్‌లో ఏర్పాటు చేయాలి....




**ఆత్రేయపురం, జనవరి, 21,(ప్రభాత వార్త)** దివ్యాంగుల చిన్నారుల తల్లిదండ్రులకు కేర్ గివెర్స్ ట్రైనింగ్ శిక్షణ పారసంస్థ సిబిఆర్ కోఆర్డినేటర్ బదుగు మహిమ రావు ఆధ్వర్యంలో లొల్ల గ్రామ భవిత సెంటర్ నందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదుగు మహిమారావు మాట్లాడుతూ సదరం వెబ్ లో బహుళవికలంగత్వం విభాగం లేకపోవడం వల్ల చాలామంది దివ్యాంగులు పదిహేను వేలు పొందే అవకాశాన్ని కోల్పోతున్నారని, అదేవిధంగా గత రెండు సంవత్సరాలుగా మంజూరు చేయని దివ్యాంగ పెన్షన్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా, తల్లితండ్రులు ఏ విధంగా పిల్లల్ని తమ ఇంటి వద్ద శ్రద్ధ తీసుకుంటూ వాళ్ళ అభివృద్ధికి తోడ్పడాలి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీకి అవసరమైన వస్తువులను పారా సంస్థ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డా. నల్లి సంగీత, ఫిజియోథెరఫీ కిట్ ను ఏ విధంగా ఉపయోగించుకోవాలో తల్లిదండ్రులకు తెలియజేశారు. చివరగా పారసంస్థ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ సింహరాయిలు పారసంస్థ ఎప్పుడు దివ్యాంగులు తల్లితండ్రులకు తోడుగా ఉంటుందని అన్నారు. చివరగా కె. మేరీ బ్లెస్సీ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి అవసరాలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవిత టీచర్స్ అరుణ, జానకి, పారా సంస్థ ఆత్రేయపురం బ్లాక్ కోఆర్డినేటర్ మాగపు ప్రభాకర్ దివ్యాంగులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్సీ సిబ్బందికి సంక్రాంతి బహుమతులు



**గండేపల్లి,జనవరి 21 (ప్రభాతవార్త):** గండేపల్లి మండలం జెడ్. రాగంపేటలో గల జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని సిబ్బందికి ముగ్గులు,తదితర పోటీలు నిర్వహించి సందడి చేశారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది అందరి పేర్లు రాసి ఒక బౌల్ లో వేసి చీటి తీసిన వారికి ఒకరికి ఒకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పైస్థాయి, కింద స్థాయి ఉద్యోగుల్లో పరస్పర అనుబంధాలు మెరుగుపడతాయని సీహెచ్సీ సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి



**గోపాలపురం జనవరి 21, (ప్రభాతవార్త):** దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి చెందుతున్నాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము అన్నారు. బుధవారం రూ.20 లక్షల ఎన?ర?జీఎస్ నిధులతో నిర్మించనున్న భీమోలు గ్రామ పుంత రోడ్డు నిర్మాణానికి టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. రాము మాట్లాడుతూ.. గతంలో కూడా టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయనడానికి ప్రతి పల్లెలోనూ సిమెంట్ రోడ్లు నిర్మాణాలు జరిగాయని గుర్తు చేసారు. వైసీపీ హయాంలో గ్రామాల్లో ఒక్క సిమెంట్ రోడ్డు నిర్మించిన దాఖలాలు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. గోపాలపురం టౌన్ మాజీ అధ్యక్షులు జ్యేష్ఠ శ్రీధర్ మాట్లాడుతూ.. గోపాలపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సారధ్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి సొసైటీ చైర్మన్ వడ్లమూడి రమేష్, గంద్రోతు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కాట్రగడ్డ సురేష్, డీ.అప్పారావు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నారీ, సిఆర్పి లకు శిక్షణ



**కడియం ,జనవరి 21 (ప్రభాతవార్త)** పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఈ కార్యక్రమాలు సకాలంలో విజయవంతంగా అమలు కావాలంటే సమాఖ్యలు బలంగా పనిచేయాలని జిల్లా ఎల్ హెచ్ ఏపిఎం ఎస్ ఆదినారాయణ, కడియం ఇన్చార్జి ఏపిఎం ఎం నాగభూషణం అన్నారు. కడియం మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఈ నారీ మరియు సీఆర్పీ లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎల్ హెచ్ ఏపియం మరియు కడియం ఇంచార్జ్ ఏపియం లు మాట్లాడుతూ, ఈ నారీ సీఆర్పీలు మండల సమాఖ్య లో సోషల్ క్యాపిటల్ మెరుగుపరచుకొని, వారికి కావలసిన శిక్షణ తీసుకొని, సేవలు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ సంఘంలో ప్రతి పది సంఘాలకు ఒక ఈ నారీ, ఇరవై ఐదు సంఘాలు పైగా ఉంటే రెండు సీఆర్పీలుగా గుర్తించి వారికి ఈ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా దుళ్ళ క్లస్టర్ పరిధిలో 60 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు యుబిజి తిలక్, బి నాగేశ్వరావు, మండల సమాఖ్య ప్రతినిధులు, విఓఏ లు తదితరులు పాల్గొన్నారు.

## మేజిస్ట్రేట్ బొనిగే వెంకట్రావుకు ఘన సన్మానాలు



**గోపాలపురం జనవరి 21, (ప్రభాతవార్త):** కొవ్వూరు కోర్టు మేజిస్ట్రేట్ గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపాలపురం మండలం, చిట్యాల గ్రామానికి చెందిన బొనిగే వెంకట్రావు ఘన సన్మానాలు అందుకుంటున్నారు. పార్డ్ ఇండియా గోపాలపురం మండల శాఖ, నవ చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో మేజిస్ట్రేట్ వెంకట్రావును ఘనంగా సభ్యులు సన్మానించారు. దుస్సాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసారు. న్యాయవాధిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. న్యాయవాద వృత్తి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరిస్తూ మేజిస్ట్రేట్ స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వించదగిన విషయమని తెలిపారు. బొనిగే వెంకట్రావు ఎంతో మందికి ఆదర్శనీయుడని కొనియాడారు. వారి సారధ్యంలో ప్రతిఒక్కరికి న్యాయ ఫలాలు సక్రమంగా అందుతాయని సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా సభ్యులు దొడ్డిగర్ల వెంకటేశ్వరరావు, మోసాల కొండలరావు, వింజమూరి సుబ్బారావు, కొయ్య నాగరాజు, గుమ్మడి నాగేశ్వరరావు, సిహెచ్ రత్నభాస్కరరావు, సిహెచ్ భాస్కరరావు, సరిపల్లి వెంకటేష్, నవచైతన్య అ ంబేద్కర్ సంఘ అధ్యక్షులు పైడి దొరబాబు, దాసరి రవి పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన విఘ్నేశ్వరస్వామి వారి ఆలయం




**అయినవిల్లి జనవరి 21 ప్రభాతవార్త** అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది సంక్రాంతి పర్వదినాల నుండి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి భక్తులు మొక్కులను తీర్చుకుంటున్నారు సుదుర ప్రాంతాల నుంచి ట్రావెల్ వాహనాలతో భక్తులు తలిరావడంతో బుధవారం భక్తులు గంటలు తరబడి క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించుకోవలసి వచ్చింది ప్రత్యేక పర్వదినాలలో వాహనాలు నిలుపుకోవడానికి తగినంత చోటు లేకపోవడంతో గ్రామంలో వీధులన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి వాహనాల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ దేవాదాయ శాఖ సరైన చర్యలు తీసుకోవటం లేదని భక్తులు విమర్శిస్తున్నారు రోడ్డుపైనే క్యూ లైన్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలు స్తంభించి భక్తులు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు పర్వదినాల్లో అంచనాలకు మించి భక్తులు తరలిరావడం విశేషం ఆలయ భక్తుల సౌకర్యార్థం వాహనాలు నిలుపుదలకు క్యూలైన్ల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని భక్తులు గ్రామస్తులు కోరుతున్నారు

## 13 మందిపై బౌండ్ ఓవర్ కేసు నమోదు



**గండేపల్లి జనవరి 21(ప్రభాతవార్త):** నీలాద్రిరావు పేట గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగించుచున్న 13 మందిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శ్రీనివాస్ వద్ద ప్రొడ్యూస్ చేసి సత్ప్రవర్తన కొరకు బౌండ్ ఓవర్ చేయడం జరిగిందని గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు తెలిపారు.

## కోటిపల్లిలో గ్రామసభ



**కె గంగవరం,జనవరి 21, (ప్రభాతవార్త):** మండలంలోని కోటిపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు తెలిపారు. ఈ గ్రామ సభలో భాగంగా విద్యుత్ శాఖ ఏ ఈ టి భాస్కర్ కుమార్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి సమస్యలు, పీఎం సూర్య ఘర్ పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం ద్వారా ఇంటిపై సోలార్ విద్యుత్ ద్వారా 78,000 వరకు రాయితీ వస్తుందని ఇందుకు సంబంధించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, ఏ ఈ భాస్కర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కలెక్టర్‌కు విన్నపం


**అమలాపురం కలక్టరేట్, జనవరి21, ప్రభాతవార్త** నేషనల్ హైవే 216 ఈ అలైన్మెంట్ మార్పు చేయాలని కోరుతూ ఇందుపల్లి, నడిపూడి ,పేరూరు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. 216 ఈ నిర్మాణంలో ఇందుపల్లి గ్రామంలో చాలా ఇల్లు కోల్పోతున్నామని తమ ఇల్లును పంట పొలాలను కాపాడాలని ఈ సందర్భంగా కోరారు. డిఆర్ఓ కె.మాధవ్ కి వినతి పత్రం అందజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కి ఈ మేరకు అభ్యంతరం తెలుపుతూ వినతి పత్రం ఇవ్వడంతో పాటు వ్యక్తిగతంగా అభ్యంతరాలు తెలుపుతూ పోస్ట్ ద్వారా బాధితులు ఫిర్యాదు చేశారు. 2021 లో ఇచ్చిన అలైన్మెంట్ ప్రకారం హైవే నిర్మాణం జరగాలని ఈ సందర్భంగా బాధితులు కోరారు. కలెక్టరేట్ కార్యాలయం ముందు తమ ఇల్లు కాపాడాలని హైవే అలైన్మెంట్ మార్పు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లులు పోలయ్య, చొల్లంగి అప్పాజీ, నాగిరెడ్డి తాతారావు,ఉరింక బుజ్జి, మోటూరి బాలాజీ, కుడుపూడి శ్రీనివాస్, ఏలేశ్వరుప్పు బుజ్జి, టి కె విశ్వనాథ్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## గ్రామల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ



**గండేపల్లి జనవరి 21(ప్రభాతవార్త):** గండేపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయితీల పరిధిలో 2024-2025 వార్షిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్రి హరి కృష్ణ సత్య రెడ్డి తెలిపారు.స్దానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ అద్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.పల్లె పండుగ,2.0 పనులు త్వరితగతిన పూర్తిచేసి పేమెంట్ లు కూడా ఆన్లైన్ చేయాలని, ఉపాదిహామి పథకం పనులు ఆర్థిక సంవత్సరం 2024-25 సంబందించి సామాజిక తనిఖీ బృందం వారికి తనిఖీ కు సంబందించిన రికార్డ్ లను అందజేయాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమములో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాస్ పంచాయతీ అభివృద్ధి అధికారులు,పరిపాలానాదికారి చంద్రరావు, సామాజిక తనిఖీబృందం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టపగలు భారీ చోరీ



**రామచంద్రపురం,జనవరి 21,(ప్రభాతవార్త):** పట్టణంలో పట్టపగలు దొంగలు బీభత్సం సృష్టించారు. మంగళవారం ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం నగలతో పాటు నగదు దోచుకెళ్లిన వైనం కమ్మవారి సవరం పల్లీల పేటలో చోటుచేసుకుంది.బాధితులు పోతాబత్తుల భవాని,రాంబాబు దంపతులు పని నిమిత్తం బయటకు వెళ్లిన సమయం ఆసరాగా చేసుకుని దుండగులు ఈ చోరీకు పాల్పడినట్లు తెలుస్తోంది.బీరువాలో భద్రపరిచిన 25 కాసుల బంగారు భరణాలు,రూ.1,75,000ల నగదును దొంగలు దోచుకెళ్లారు.బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ ఎమ్ వెంకటనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విఆర్‌ఒల సమస్యలను పరిష్కరించండి..




**శంఖవరం , జనవరి 21 (ప్రభాతవార్త)** ప్రభుత్వం చేపట్టే ప్రతీ పథకం అమలులోనూ, ప్రజలకు అందించే ప్రతీ సేవలోనూ, సమస్యల పరిష్కారంలోనూ గ్రామ రెవెన్యూ అధికారులను భాగస్వాములను చేయడం ద్వారా సమయ పాలన లేకపోవడంతో ఎదుర్కొంటున్న గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే పరిష్కరించాలని శంఖవరం తహాశీల్దార్ తాతారావుకు విఆర్వోల సంఘం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా శంఖవరం మండలం విఆర్వోల సంఘం అధ్యక్షుడు బందిలి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే, స్వమిత్వ సర్వే, సుమోటో కుల ధృవీకరణ పత్రాల విచారణ, పంట నమోదు, కౌలు రైతుల సిసిఆర్ కార్డుల జారీ, ఖరీఫ్, రబీ పంట కొనుగోలు, నీటి తీరువా సంక్షేమ పథకాల పంపిణీ, రేషన్ కార్డుల విచారణ, పిజిఆర?స్, పంచనామా రిపోర్టులు వంటి అనేక అంశాల్లో రేయింబవుళ్ళు గ్రామ రెవెన్యూ అధికారులు కష్టించి పని చేస్తున్నారన్నారు. కాని వీరికి సమయ పాలన లేకపోవడం, అధికారుల ఒత్తిడితో కుటుంబ వ్యవస్థకు దూరం అవుచున్నామని, అనారోగ్యాలకు గురవుతున్నామని తమకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల మాదిరిగానే ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బాధ్యతలు నిర్వర్తించేలా ఉన్నత అధికారులు ఆదేశాలు ఇచ్చి, విఆర్వోల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విఆర్వోలు సీతారామ్, అచ్యుతం, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ని కలిసిన సర్పంచ్ కొండయ్య



**పి.గన్నవరం జనవరి 21 (ప్రభాతవార్త)** వైసీపీ నాయకులు పోతవరం గ్రామ సర్పంచ్ వడలి కొండయ్య మంగళవారంతాడేపల్లి లో మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అతిచిన్న వయసులో సర్పంచ్ గా గెలిచినందుకు జగన్ కొండయ్య ను అభినందించారు. అలాగే నియోజకవర్గం లో సమస్యలు అడిగి తెలుసుకుని పార్టీ బలోపేతనికి కృషి చేయాలనీ జగన్ పిలుపునిచ్చారు. వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని కలిసినందుకు చాలా ఆనందం గా ఉందని కొండయ్య తెలిపారు. అలాగే గన్నవరపు శ్రీను ఇన్చార్జ్ ఎలా చూస్తున్నారు అని అడిగారు. వైసిపి ప్రముఖులు కలిశారు.

## పొలం పిలుస్తోంది..



**సీతానగరం, జనవరి 21, (ప్రభాత వార్త) :** మండలంలోని పురుషోత్తపట్నం, వంగలపూడి గ్రామాల్లో బుధవారం ఏవో గౌరీదేవి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీఏ శశి బిందు హాజరై వరి, మొక్కజొన్న సాగులో చేపట్టవలసిన సస్యరక్షణ, సస్య పోషణ విధానాలను రైతులకు వివరించారు. ముఖ్యంగా రైతులందరూ పంట నమోదు, ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. అనంతరం రామచంద్రాపురం సొసైటీని తనిఖీ చేసిన ఆమె, రికార్డులు, నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండ వెంకటేశ్వరరావు, వివిఏలు సుధీర్, రేష్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps